fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 80 | విజయవాడ, శుక్రవారం 23 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

ఆర్టీసి ఎండిగా సురేంద్రబాబు

- ఆక్టోపస్ అడిషనల్ డిజి నుంచి పదోన్నతి
- ఉత్తర్వులు వెలువరించిన ప్రభుత్వం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి)గా 1987 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్‌వి సురేంద్ర బాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషినల్ మిగతా 9లో

దిగ్బంధం దిగ్విజయం

విజయవాడలో జరిగిన జాతీయ రహదారుల దిగ్బంధన దృశ్యాలు







ఎక్కడికక్కడ స్తంభించిన ట్రాఫిక్ 2

డప్పుకొట్టిన మధు, రామకృష్ణ, శివాజి

గుంటూరులో జగన్ మద్దతు - విడిగా టిడిపి నిరసన

హైదరాబాద్‌లో భారీ బ్యాంకు కుంభకోణం

- రూ. 1394 కోట్ల రుణాలను ఎగవేసిన 'తొట్టెం'

హైదాబాద్ : దేశంలో వరసగా వెలుగుచూస్తున్న బ్యాంకు కుంభకోణాల్లో తాజాగా మరో కుంభకోణం చేరింది.. హైదరాబాద్‌కు చెందిన తొట్టెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనే నిర్మాణ సంస్థ వివిధ బ్యాంకులకు సుమారు రూ.1394 కోట్ల మేర రుణాలకు ఎగనామం పెట్టింది. వివరాల్లోకి వెళ్తే.. తొట్టెంపూడి సలలిత్ ఛైర్మన్ అండ్ ఎండీగా వ్యవహరిస్తున్న తొట్టెం ఇన్ఫ్రా సంస్థ 1997లో హరియాణాలోని గుడ్‌గావ్‌లో ఏర్పాటయింది. ఈ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్‌గా ఉన్న ఎనిమిది బ్యాంకుల కన్సార్టియం నుంచి రుణాలు తీసుకుంది. ఆ తర్వాత ఇతర బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి రుణాల ద్వారా పొందిన సొమ్మును మళ్లించారు. వేతనాలు, ఇతర ఖర్చులను భారీగా లెక్కలు చూపుతూ ఆ సొమ్మును సాహ్వా చేశారు. ఆ తర్వాత రుణాలు చెల్లించకుండా చేతులెత్తేశారు. ఈ సంస్థ రుణాలను 2012 జూన్ 30న మొండి బకాయిలుగా బ్యాంకుల కన్సార్టియం ప్రకటించింది. లావాదేవీలన్నీ కన్సార్టియంలో ఉన్న బ్యాంకుల్లో కాకుండా ఇతర బ్యాంకుల ద్వారా నిర్వహించినట్టు గుర్తించారు. తాజాగా యూబీఐ ఇచ్చిన ఫిర్యాదుతో సీబీఐ రంగంలోకి దిగింది. తమను రూ.313 కోట్ల మేర మోసం చేశారని యూబీఐ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం సీబీఐ కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌లోని తొట్టెం సంస్థ కార్యాలయంతో పాటు డైరెక్టర్లు సలలిత్, అతని భార్య కవిత ఇళ్లల్లో సోదాలు నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఐదో సారీ

అవిశ్వాసంపై చర్చలేదు

పార్లమెంటులో కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన

9

మీరూ.. సిబిఐతో విచారణ చేయించుకుంటారా?



- కేంద్రాన్ని ప్రశ్నించిన చంద్రబాబు
- బిజెపి, వైసిపి, పవన్ ఒక్కటయ్యారని విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాగ్ మీ మీదా నివేదికలిచ్చింది కదా.. మీరూ సిబిఐతో విచారణ చేయించుకుంటారా? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని ప్రశ్నించారు. పట్టిసీమ పథకంపై నిధుల దుర్వినియోగం గురించి కాగ్ నివేదిక ఆధారంగా శాసనసభలో బిజెపి సభ్యులు బుధవారం చేసిన డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని సిఎం ఈ ప్రశ్నలు సంధించారు. ప్రపంచ జలదినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని సిఎం గురువారం శాసనసభలో మాట్లాడారు. అవినీతిని నిర్మూలిస్తామన్న ప్రధాని, తన కార్యాలయంలో ఎ1, ఎ2లను పక్కన పెట్టుకుని రాష్ట్రంలో కుట్రకు పాల్పడుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. బిజెపి, వైసిపి, పవన్ ఒక్కటయ్యారని, అయినా తాను ఎటువంటి కేసులకూ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నాడు ఏం చెప్పారు, రాష్ట్రానికి ఇంతవరకు ఏమిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్‌గా వచ్చే నిధులే రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఏమిచ్చారో చెప్పమని డిమాండ్ చేస్తే తనపైనే ఎదురు దాడి చేస్తున్నారని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఎవ్వరికీ ఇవ్వడం లేదని తనతో అసత్యం చెప్పారన్నారు. రాజకీయపార్టీలన్నీ మద్దతు తెలిపినా అవిశ్వాస తీర్మానాన్ని ఎందుకు చర్చకు రానివ్వడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధికి సహకరించమంటుంటే సిబిఐ విచారణలంటున్నారని, అన్నింటిపైనా సిబిఐతో విచారణ చేయిస్తారా ఇవెక్కడి రాజకీయాలంటూ అసహనం వ్యక్తం చేశారు.

పోలవరానికి కేంద్రం ఇంకా రూ.42వేల కోట్లివ్వాలి

పోలవరం ప్రాజెక్ట్‌పై ఇంతవరకు రూ.13,201 కోట్లు ఖర్చు పెట్టామని, ఈ ప్రాజెక్ట్ పూర్తవ్వాలంటే డిపిఆర్-2 సవరించి కేంద్రం ఇంకా రూ.42వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఎవరికి వారు పోలవరాన్ని ఆపాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైసిపి రైతు విభాగం నాయకులు కేసులు కూడా పెట్టారన్నారు. వాసిరెడ్డి శ్రీనివాసులు అనే వ్యక్తి వేసిన కేసును కోర్టు మిగతా 9లో



విజయవాడలో జరిగిన మహా ధర్నాలో పాల్గొన్న వర్కర్‌లు వార్త 7లో

ఫేస్‌బుక్ క్షమాపణ

భారత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోం

వాషింగ్టన్: సమాచార చౌర్యం కేసులో తమ కంపెనీ కొన్ని పొరపాట్లు చేసిందని, అందుకు తాను విచారిస్తున్నానని ఫేస్‌బుక్ అధినేత జుకరబర్గ్ పేర్కొన్నారు. ఇందుకు క్షమాపణ చెప్పారు. అత్యంత గోప్యమైన వినియోగదారుల సమాచారాన్ని తమ సిబ్బందిలో అనధీకృత వ్యక్తులు తాకకుండా వుండేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భారత్‌తో సహా మరే ఇతర దేశాల ఎన్నికల్లోనూ తాము జోక్యం చేసుకోబోమని ఫేస్‌బుక్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి మిగతా 9లో

పునరావాసానికి కేంద్రం మొండి చెయ్యి

పోలవరంపై అనుమానాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నీటి పనులకే నిధులు ఇస్తామంటూ మరోసారి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వంలో ఆందోళన పెరుగుతోంది. అధిక వ్యయం ఆర్‌ఆర్ ప్యాకేజికే అవుతుందని, ఇప్పుడు నీటి పనులకే అంటూ కేంద్రం చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజికి కావాల్సిన నిధులను కూడా కేంద్రం ఇస్తుందని కేంద్ర మంత్రి గడ్కరీ గతంలో చెప్పడంతో ఆశావహ దృక్పథంతో ఉన్న రాష్ట్రానికి కొద్ది రోజుల క్రితం రాజ్యసభలో కేంద్ర నీటిపారుదలశాఖ రాష్ట్ర మంత్రి ఇచ్చిన సమాధానం మింగుడుపడడం లేదు. వాస్తవంగా రూ.16 వేల కోట్ల అంచనాతో పోలవరం ప్రతిపాదనలు ఉండగా అందులో నీటిపారుదల కాంపోనెంట్ రూ.12,294 కోట్లని కేంద్రం చెబుతోంది. దీనికే తాము వంద శాతం నిధులు ఇస్తామని ఈ నెల 12వ తేదీన కేంద్ర మంత్రి రాతపూర్వకంగా రాజ్యసభలో చెప్పారు. దీనిపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించలేదు. అయితే రెండు రోజులుగా పోలవరంపై కేంద్రం దర్యాప్తునకు సిద్ధమవుతోందని జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో సహాయ మిగతా 9లో



300 కోట్లు కోత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం మరో షాకిచ్చింది. పోలవరానికి కేటాయింపుల్లో రూ.311 కోట్లు కోత పెడుతూ నిర్ణయం తీసుకుంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ స్థాయి హోదా ఉండటంతో దాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే వంద శాతం నిధులు ఇవ్వాలి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలలో జాప్యం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా ఖర్చు చేస్తోంది. అనంతరం మిగతా 9లో

అయిదు జిల్లాలో సేద్యం శూన్యం

ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే కారణం

మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల ధ్వజం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమ, ప్రకాశం వెరసి అయిదు జిల్లాల్లో నీటిపారుదల పథకాలు పూర్తి కాకపోవడం వల్ల ఎకరం భూమి కూడా సేద్యానికి నోచుకోలేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై గురువారం మండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సాగునీటి విషయంలో అనాదిగా రాయలసీమకు అన్యాయమే చేస్తున్నారని, నాడు సిద్ధేశ్వర ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదని అన్నారు. వ్యవసాయానికి వర్షాల పైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో కేవలం 7.6 శాతం భూమిలోనే సాగు సాధ్యమవుతోందని తాగు, సాగు నీరు లేకపోవడమే వెనుకబాటుకు కారణమన్నారు. పరిశ్రమలు రావడం లేదని, నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవాకు నలుగురు ముఖ్యమంత్రులు పోటీలు పడి శంకుస్థాపనలు చేశారని, కానీ ఇంత వరకు పూర్తి కాలేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇరిగేషన్‌కు సుమారు రూ. 16 వేల కోట్లు కేటాయించినా, రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి మాత్రం నామమాత్రంగానే నిధులు కేటాయించారని విమర్శించారు. నిధుల కేటాయింపుల్లోనే ప్రాజెక్టులపై మిగతా 9లో

ఆ భూముల్ని విక్రయించొద్దు

శ్రీహయగ్రీవ ఫర్మ్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్

విశాఖ జిల్లా యండాడ గ్రామంలో అనాథలు, వద్ధుల ఆశ్రమం కోసం శ్రీహయగ్రీవ ఫర్మ్‌కు కేటాయించిన భూముల్ని విక్రయించడానికి వీల్లేదని హైకోర్టు ఆ సంస్థను ఆదేశించింది. కేటాయించిన భూమిని లీజుకు ఇవ్వడానికి కూడా వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తేల్చి చెప్పింది. అనాథలకు, వద్ధుల కోసం కుటీరాల నిర్మాణాలకు ఆ సంస్థ చేసుకున్న దరఖాస్తుపై ఏపీ సర్కార్ తగిన నిర్ణయం తీసుకోవాలని బెంచ్ ఆదేశించింది.

కొత్త ప్రాజెక్ట్



వెలగపూడిలోని సచివాలయంలో నైపుణ్య రథాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఉద్యోగానికి 'సిబిఐ' లక్ష్మీనారాయణ గుడ్‌బై !

- వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు
- త్వరలో రాజకీయాల్లోకి.. ?

ముంబయి : సీబీఐ పూర్వ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పనున్నారు. ఈ మేరకు ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్)కు దరఖాస్తు చేశారు. తాను ఉద్యోగం నుంచి తప్పుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ 1990లో ఐపీఎస్‌కు మహారాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర ఏటీఎస్‌లో ఎస్పీ, డీఐజీగా, ఠానే సంయుక్త పోలీస్ కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం మహారాష్ట్ర అదనపు డీజీగా కొనసాగుతున్నారు. ఆయన కేంద్ర సర్వీసుల్లో ఉన్నప్పుడు సీబీఐ హైదరాబాద్ విభాగం డీఐజీ, సంయుక్త సంచాలకుడిగా పనిచేశారు. సీబీఐ అధికారిగా వైకాపా అధినేత జగన్ అక్రమాస్తులు, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఎమ్మార్, సత్యం కుంభకోణం, ఆజాద్ ఎన్‌కౌంటర్ వంటి కీలక కేసుల్లో ఆయన వ్యవహరించిన తీరు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. కేంద్ర సర్వీసుల అనంతరం తిరిగి మహారాష్ట్రలో విధుల్లో చేరినప్పటికీ లక్ష్మీనారాయణ తరచుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను ఉత్తేజపరిచే ప్రసంగాలు చేస్తూ వస్తున్నారు. సుమారు ఏడేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ ఆయన ఐపీఎస్‌గా వైదొలగాలని నిర్ణయించుకోవడం సంచలనం స ష్టిస్తోంది. లక్ష్మీనారాయణ త్వరలోనే రాజకీయాల్లో చేరుతారనే ప్రచారం కూడా జరుగుతోంది.



తెలుగు రాష్ట్రాలపై ద్రోణి

నేడు రాయలసీమలో ఎండల తీవ్రత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రెండు తెలుగు రాష్ట్రాలపై అల్పపీడన ద్రోణి కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. బీహార్ నుంచి ఆగ్నేయ ఉత్తరప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి నెలకొంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి ఆనుకుని 1.5 నుంచి 2.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. కోస్తాలో రెండు మూడు రోజుల పాటు పొడి వాతావరణం కొనసాగుతోందని, రాయలసీమలో శుక్రవారం 40 నుంచి 41 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. తర్వాత సాధారణ పరిస్థితులు నెలకొంటాయని తెలిపింది. గురువారం రాయలసీమలో పలు చోట్ల 40 నుంచి 41 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. రూ. 120 కోట్లతో ప్లాస్టిక్ పార్క్‌ను ఎక్కడ ఏర్పాటు చేయనున్నారు?
2. కొరియాలో భారత రాయబారిగా ఎవరిని నియమించారు?
3. ఇండియన్ సైన్సు కాంగ్రెస్ 2019కు ఏ రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనుంది?
4. ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
5. భారత ఆటవీ పరిశోధనా, విద్యా కౌన్సిల్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

దిగ్బంధం దిగ్విజయం



విశాఖలోని మద్దిలపాలెం జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించిన అఖిలపక్ష పార్టీ నేతలు



గుంటూరులో మిర్చియార్డు వద్ద ఆందోళనలో పాల్గొన్న జగన్

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రత్యేక హోదాకై సాగుతున్న పోరాటం ఉవ్వెత్తున ఎగసింది. ఎపికి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, వైసిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపి పలు చోట్ల నిరసన చేపట్టింది. హోదా ఉద్యమానికి రాష్ట్రంలో ఒక్క బిజెపి మినహా అన్ని పార్టీలు మద్దతు పలికాయి. జాతీయ రహదారులు ఉదయం 10 నుండి 12 గంటల వరకు స్తంభించాయి. విజయవాడ కనకదుర్గ వారధి దగ్గర జరిగిన జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూ రావు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సినీ హీరో శివాజీ, వైసిపి రాష్ట్ర నాయకులు పార్థసారథి, జనసేన కార్యకర్త పోతిన మహేష్ పాల్గొన్నారు.

గుంటూరు నగర శివారు అంకిరెడ్డిపాలెం రహదారి వద్ద వైఎస్ జగన్ ఆందోళనకు మద్దతు తెలిపారు. విజయవాడలో ఈలలు వేసి, కర్రసాము చేసి డప్పులు కొట్టి మధు రామకృష్ణ, శివాజి ఆందోళనలో పాల్గొన్న వారికి ఉత్సాహాన్నిచ్చారు. విశాఖ జిల్లాలో ఎనిమిది సెంటర్లలో హైవేలను దిగ్బంధం సాగింది. విశాఖపట్నం మద్దిలపాలెం జంక్షన్‌లో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళలు ఆటలు ఆడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. సినీ హీరో శివాజి కర్రసాము చేశారు. అయితే జాతీయ రహదారులపై నిలిచిపోయిన బస్సుల్లో నుండి దిగిన ప్రయాణికులు కూడా ఆందోళనలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్వాహకులు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. మరోవైపు ఆందోళనకు మద్దతు ప్రకటించిన తెలుగుదేశం కూడా జాతీయ రహదారుల పక్కనే టెంట్లు వేసి నిరసన కార్యక్రమాలు చేపట్టింది. విజయవాడలో బెంజిసర్కిల్, రామవరప్పాడు వద్ద తమ ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ బిజెపి రాష్ట్రాలను ఇబ్బందులు పెడుతోందని తెలిపారు. హోదా ఇస్తామని ఎందుకు ఇవ్వలేదో ఇంతవరకు సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యకం చేశారు. తెలుగుదేశం కూడా ఇప్పటి వరకూ ఏం చేయకుండా ఇప్పుడు హోదా కోసం పోరాడుతున్నట్లు ఫోజు పెడుతోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ హోదాపై బిజెపి పూర్తి అన్యాయం చేస్తోందని తెలిపారు. వైసిపి రాష్ట్ర నాయకులు కొలుసు పార్థసారథి మాట్లాడుతూ టిడిపి చేస్తున్న కుట్రలకు రాష్ట్రం బలైపోతోందన్నారు. సినీ హీరో శివాజి మాట్లాడుతూ ఆపరేషన్ గరుడ పేరుతో బిజెపి రాష్ట్రాన్ని దెబ్బతీస్తోందని, దక్షిణ భారతదేశాన్ని కూడా ఇబ్బందులు పెట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల అరెస్టులు

ప్రత్యేక హోదా సాధనకు వామపక్షాలు, వైసిపి, కాంగ్రెస్, జనసేన, లోక్‌సత్తా ఆధ్వర్యాన గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ జాతీయ రహదారులను దిగ్బంధం చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి పిలుపు మేరకు మండుటెండలో సైతం వివిధ రూపాల్లో నిరసన కారక్రమాలు చేపట్టారు. ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. పదో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులు పలు చోట్ల అరెస్టులకు పాల్పడ్డారు.

- శ్రీకాకుళంలోని కొత్తరోడ్డులో జాతీయ రహదారిపై బైటాయించిన సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీ, ప్రజాసంఘాలకు చెందిన 25 మందిని అదుపులోకి తీసుకొని ఆమదాలవలస పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.
- విజయనగరం జిల్లాలో వామపక్షాల కార్యకర్తలు ఒంటి కాళ్లపై నిలబడి నిరసనలో పాల్గొన్నారు.
- కర్నూలు నగర శివారులోని తుంగభద్ర బ్రిడ్జిపై రాస్తారోకోతో దాదాపు 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వామపక్షాలు, వైసిపికి చెందిన సుమారు 200 మందిని పోలీసులు అరెస్టు చేశారు.
- అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ నాయకులు కూడా రాస్తారోకోలో పాల్గొన్నారు.
- పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో టిడిపి కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టింది.
- తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని అచ్చంపేట జంక్షన్లో సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు.
- ప్రకాశం జిల్లాలో వైసిపి నాయకులు రోడ్డుపై కబడ్డీ ఆడి నిరసన తెలిపారు.
- చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి దిగ్బంధం సందర్భంగా వంద మందిని పోలీసులు అరెస్టు చేసి అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.
- విశాఖలో మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు కూడా రోడ్డుపై బైటాయించాయి.
- గుంటూరు బైపాస్‌లో జాతీయ రహదారిపై బైటాయించిన వామపక్షాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.
- విజయవాడలోని వారధి వద్ద జరిగిన రాస్తారోకోలో 16 పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.
- నెల్లూరులో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. రోడ్డుపై బైటాయించిన వారిని పోలీసులు పక్కకు లాగేశారు. కడపలో జాతీయ రహదారుల దగ్బంధం విజయవంతమైంది.

రాష్ట్రంలో త్వరలో ఆపరేషన్ 'గరుడ'

సినీ హీరో శివాజీ

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అయితే రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను మార్చేందుకు ఒక జాతీయ పార్టీ 'ఆపరేషన్ గరుడ' చేపట్టనుందని చెప్పారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆ జాతీయ పార్టీ అను బంధ విభాగానికి చెందిన నాయకుడు తనకు మిత్రు డుగా ఉండటం వల్ల ఆ విషయం చెప్పగల్గు తున్నట్లు వెల్లడించారు. జాతీయ పార్టీ తీసుకునే నిర్ణయాలను ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ, మరో ప్రధాన పార్టీలు అమలు చేస్తుంటాయని, ఆ రెండు పార్టీలను ఒక నాయకుడు శాసిస్తాడని తెలిపారు. దీని కోసం రూ.4,800 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్‌లోకి ఎవరైనా వస్తే వారికి రావడమేగానీ బయటకెళ్లడం తెలియదన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎవరూ ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల్లో అధికారం చేపట్టటానికి వివిధ పేర్లతో ఆపరేషన్స్ చేపట్టబోతున్నారన్నారు. ఆంధ్ర, తెలంగాణలకు సంబంధించి 'గరుడ' పేరుతో ఆపరేషన్ చేపట్టనున్నట్లు వివరించారు. హోదా కోసం ఉద్యమం చేసిన కమ్యూ నిస్టులు, వైసిపి, ఇతర సంఘాలకు గుర్తింపు ఉండటం లేదని తెలిపారు. ఎపి ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని ఎవరూ ఆ నాటకంలో చిక్కుకోవద్దని సూచించారు. ప్రత్యేక హోదా కోసం సినిమా వాళ్లు పోరాటం చేయటం లేదని టిడిపి ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మొదటసారి జాతీయస్థాయికి తీసుకెళ్లింది సినిమా వారేనని చెప్పారు. తాను హోదా ఉద్యమం కోసం హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తే అర్ధరాత్రి అరెస్టు చేసి పంపించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ హోదా కోసం జరిగే ఉద్యమంలో పాల్గొనాలని కోరారు.



విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సినీహీరో శివాజీ

అవిశ్వాసంపై చీకట్లో మమ అనిపించే అవకాశం

కేంద్రం తీరుపై యనమల ఆగ్రహం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కాంగ్రెస్ 2014లో అవలంబించిన చీకటి ప్రయత్నాలు తాజాగా బిజెపి కూడా అనుసరించే పరిస్థితి కనిపిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. గురువారం శాసనసభలోని తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై మరోసారి అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తలుపులు మూసేసి వివాదం మధ్య చర్చలు లేకుండానే నిర్ణయం తీసుకున్నారని, ఇప్పుడు కూడా అవిశ్వాస తీర్మానంపై చర్చకు కేంద్రం సుముఖత చూపించడం లేదని ఆయన ఆరోపించారు. అందుకే చివరి రోజు వరకు చూసి అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు తీసుకుని, చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో అవిశ్వాసం వీగిపోయిదని చెప్పే ప్రయత్నానికి కేంద్రం ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే జరిగితే ఆ తంతు రాజ్యాంగ విరుద్ధం కాగలదని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో పూర్తి బలం ఉన్న బిజెపి రాష్ట్రంపై వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, అదే రాజ్యసభలో కూడా బలం ఉంటే ఇంకెంతగా ఇబ్బందులు పెట్టేవారో నని అన్నారు. బిజెపి నుంచి రానున్న కాలంలో మరికొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. అయితే కాంగ్రెస్‌లో కొంత మార్పులు కనిపిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. . పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాహుల్‌గాంధీలో కొత్త మార్పులు కనిపిస్తున్నాయని, ఆయన ఇటీవల చేసిన ప్రసంగాల్లో ఇది కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. కానీ ఎంతవరకు ఉపయుక్తంగా ఉంటుందన్నది చూడాలన్నారు.

ప్రత్యేకం

వివాదాస్పదమైన జీవో 27

- సీనియర్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు నష్టం
- ఆందోళనకు సిద్ధమవుతున్న వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల విడుదల చేసిన 27 నంబరు జీవో వివాదాస్పదంగా మారింది. ఈ శాఖలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు ప్రచారం చేస్తూనే, ఇంతవరకు వారు పొందుతున్న డిఎ, హెచ్‌ఆర్‌ఎ వంటివేమీ ఉండబోవని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ఉద్యోగుల వేతనాలను క్యాడర్ల వారీగా ఏకీకృతం చేసే యత్నంలో భాగంగా జీవో 27 జారీ అయిందని పేర్కొంటూ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని సవరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో ప్రస్తుతం అమలవుతున్న వేతనాల ప్రకారం 2010లో చేరిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కంటే 2017లో చేరిన వారికి ఎక్కువ వేతనం వస్తోంది. ఉదాహరణకు 2010లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేరిన స్టాఫ్ నర్సుకు రూ.15 వేలు ఇస్తుంటే, 2017లో చేరిన వారికి రూ. 25 వేల వరకు వేతనం అమలవుతోంది. చేసే పని ఒకటే అయినా వేతనాల్లో మాత్రం వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైద్యఆరోగ్య శాఖలో మొత్తం 12 హెచ్ఒడిలు, దాదాపు 30 విభాగాలున్నాయి. వాటన్నిటిలో కాంట్రాక్ట్ ఉద్యోగులు దాదాపు 26వేల మంది ఉన్నారు. వారిలో 2002లో కాంట్రాక్ట్ పద్ధతిలో చేరిన వారు దాదాపు 3,600 మంది ఉన్నారు. వారికి మాత్రమే బేసిక్‌తోపాటు డిఎ, హెచ్‌ఆర్‌ఎ అలవెన్సులు వర్తిస్తున్నాయి. వారికి ఏటా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా డిఎ చెల్లిస్తున్నారు. అందువల్ల వారికి వేతనాల పెంపు సమస్య పెద్దగా అనిపించదు. అయితే జీవో 27 ప్రకారం వారికి బేసిక్ వేతనాన్ని 50 శాతం పెంచుతూ, ఆపై వచ్చే డిఎ, హెచ్‌ఆర్‌ఎలను తొలగించారు. ఇక 2004 నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో చేరిన వారికి డిఎ, హెచ్‌ఆర్‌ఎ ఇవ్వడంలేదు. వారికి బేసిక్ వేతనాన్ని మాత్రమే చెల్లిస్తున్నారు. అందువల్ల ఈ జీవో వల్ల వీరికి మాత్రమే తాత్కాలికంగా లబ్ధి చేకూరుతుంది.

జిఒ 27ను పున:పరిశీలించాలని 'తెలుగునాడు సంఘం' వినతి

జీవో 27ను పున:పరిశీలించాలని తెలుగునాడు వైద్యఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆర్థిక శాఖను కోరింది. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌ఎస్‌ఆర్. మూర్తి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి గురువారం వినతి పత్రం అందజేశారు. దీనివల్ల జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా నియమితులైన వారికి నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. అందర్నీ క్రమబద్ధీకరించి, బేసిక్ పే, డిఎ, హెచ్‌ఆర్‌ఎ వర్తింపచేయాలని కోరారు.

27 చలో విజయవాడ

వైద్యఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమం చేపడతాం. జీవో 27ను సవరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పదో పిఆర్సీ ప్రకారం వేతనాలు, డిఎ, హెచ్‌ఆర్‌ఎ అమలు చేయాలి. ఖాళీ పోస్టుల్లో కొత్త వారిని నియమించాలి.

- తాళ్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

ఏప్రిల్ నుంచి ఆందోళన

ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని అబ్జార్షన్ విధానంలో రెగ్యులరైజ్ చేయాలి. వారి సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడతాం.

- అరవ పాల్, రాష్ట్ర కార్యదర్శి , ఏపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్

సంక్షిప్తం

హౌస్‌బోట్‌ల కొనుగోలుకు రూ.12 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యాటక శాఖలో హౌస్ బోట్‌ల కొనుగోలుకు రూ.12.04 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు వేర్వేరు ప్రాంతాల కోసం ఐదు ఏకగది హౌస్ బోట్లు, మూడు రెండు గదుల హౌస్ బోట్లు, రెండు నాలుగు గదుల హౌస్‌బోట్లు కొనుగోలుకు ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు.

విజయవాడకు ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపిఎస్‌సిపిసి) కార్యాలయం విజయవాడకు తరలివచ్చింది. శుక్రవారం కమిషన్ కార్యాలయం విజయవాడ మధురానగర్‌లో ప్రారంభంకానుంది. ఈమేరకు కమిషన్ చైర్‌పర్సన్ జి. హైమావతి గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీతతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

మైనార్టీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి ఖర్చు చేసిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజి డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో మైనార్టీలకు ప్రాధాన్యతను లేదన్నారు. మైనార్టీల అభ్యున్నతిపై శ్రద్ధ ఉంటే చంద్రబాబు తన క్యాబినెట్‌లో వారికి ఎందుకు చోటు కల్పించలేదని ప్రశ్నించారు. పార్టీలు మార్చే జలీల్‌ఖాన్‌కు బిజెపిని విమర్శించే అర్హత లేదన్నారు. త్రిపుల్ తలాక్ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం తెలిపి, రాజ్యసభలో అడ్డుకున్న టిడిపి అధినేత చంద్రబాబు ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడు రాజీనామా చేయాలి

- ఎపి అభివృద్ధి పోరాట సమితి, ఎపిజెఎఫ్ రౌండ్‌టేబుల్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తక్షణమే పదవికి రాజీనామా చేయాలని ఎపి అభివృద్ధి పోరాట సమితి, ఎపిజెఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. టిఆర్‌ఎస్ పార్టీ, తెలంగాణలో మేధావులు సైతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు మద్దతు తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. టిఆర్‌ఎస్ పార్టీ తరుపున హాజరైన ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎపిపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎపి నేతలు కోరితే అవిశ్వాసానికి మద్దతు ఇచ్చేందుకు టిఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని, సిఎం కెసిఆర్, టిఆర్‌ఎస్ ఎంపి కవిత ఇప్పటికే డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య మాట్లాడుతూ, గతంలో అభివృద్ధి సరైన పద్ధతిలో జరగలేదన్నారు. విభజన హామీలను రెండు రాష్ట్రాల్లో అమలుచేయాలన్నారు. ప్రత్యేక హోదా ఇస్తేనే ఏపీలో అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని, ఆదిశగా ప్రజల్లో అవగహన కల్పించాలని సూచించారు. ఎపి పిసిసి కార్యదర్శి తులసిరెడ్డి మాట్లాడుతూ, హోదా ఆలస్యమైనా రావడం తప్పనిసరి అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా హామీ రాజకీయాల సాలిగూడెలో ఇరుక్కుపోయిందని వ్యాఖ్యానించారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి ఉద్యమించాలని సూచించారు. ఎపి అభివృద్ధి పోరాట సమితి అధ్యక్షులు ఎన్.రాజిరెడ్డి, ఎపిజెఎఫ్ అధ్యక్షులు సిహెచ్.కృష్ణాంజనేయులు మాట్లాడుతూ, వెంకయ్యనాయుడు తన పదవికి రాజీనామా చేసి హోదా కోసం ప్రజా ఉద్యమంలోకి రావాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ జనాభాకు అనుగుణంగా ఇళ్లివ్వని కేంద్రం

సహాయం అందించకుండా ఇబ్బందులు
మంత్రి కాలవ శ్రీనివాసులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గ్రామీణ జనాభాకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయడం లేదని మంత్రి కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. అసెంబ్లీలో గురువారం 344వ నిబంధన కింద 'రాష్ట్రంలో గ్రామీణ గృహాలు' అనే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కాల్వ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు తీరులోనూ కేంద్రం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నిధులకు ఇబ్బంది వస్తుందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి సహాయం అందించకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన విమర్శించారు. 1983లో ఎన్టీఆర్ పక్కా గృహ నిర్మాణ పథకాన్ని ప్రవేశ పెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఇప్పటికి రూ.3,370 కోట్లతో మూడు లక్షల ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. గృహ నిర్మాణ రంగానికి ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా రూ.9,865 కోట్ల నిధులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో ఉన్న బలహీన ప్రభుత్వాల హయాంలో లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరగలేదన్నారు. కేంద్రం కేవలం 1.23 లక్షల ఇళ్లు మాత్రమే మంజూరు చేసినా రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అండగా ఇళ్ల నిర్మాణం చేపట్టిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే సంస్థ ద్వారా చెల్లింపులు చేయడంతో పేమెంట్లు కొంచెం ఆలస్యమవుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

కుంభకోణ నిందితులపై చర్యలేవి...

గత ప్రభుత్వ హాయంలో గృహ నిర్మాణానికి సంబంధించి జరిగిన రూ.4,150 కోట్లు కుంభకోణానికి కారకులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2022కి అందరికీ ఇళ్లు అనే లక్ష్యంతో పని చేస్తోన్న ప్రభుత్వ విధానం హర్షనీయమని ఈ అంశంపై మాట్లాడిన ఎమ్మెల్యేలు మృణాళిని, ఉప్పులేటి కల్పన, బొండ ఉమ, అయితాబత్తుల ఆనందరావు, శేషారావులు పేర్కొన్నారు.

పట్టిసీమను పూర్తి చేసిన ఘనత టిడిపిదే

మండలి సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేవలం 100 రోజుల వ్యవధిలోనే పట్టిసీమను పూర్తి చేసి కృష్ణా డెల్టాను ఆదుకున్న ఘనత టిడిపిదేనని ఎమ్మెల్సీ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. శాసనమండలిలో జరిగిన సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన స్వల్ప వ్యవధి చర్చలో ఆయన మాట్లాడారు. కాగ్ అభ్యంతరాలపై విచారణ కావాలంటే ముందుగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై కేంద్రాన్ని తప్పుడుతూ నివేధికలో పొందుపరిచిన అంశాలపై విచారణ వేసుకుని తమ నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ నదుల అనుసంధానం ద్వారా నీటి సమస్యకు శాశ్విత పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టుల్లో పోలవరం ప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ పరిశీలనలో 16 కొత్త రెవెన్యూ డివిజన్లు

ఉప ముఖ్యమంత్రి కెఇ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా 16 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి తెలిపారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాలలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధా నమిస్తూ.. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వ నిర్ణయం అనంతరం అభ్యంతరాలు స్వీకరించి, డివిజన్లను ఖారారు చేస్తామన్నారు. పాతపట్నం, చింతపల్లి, నర్సీపట్నం, బొబ్బిలి, చీపురుపల్లి, భీమవరం, నందిగామ, బాపట్ల, మార్టూరు, దర్శి, శ్రీకాళహస్తి, కుప్పం, బద్వేలు, పత్తికొండ, గుంతకల్లు కేంద్రాలుగా కొత్త డివిజన్ల ఏర్పాటు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాజోలు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు.

అమరావతిలో మెగా శిల్పారామం : మంత్రి అఖిల ప్రియ

అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో మెగా శిల్పారామం ఏర్పాటుకు ప్రతిపా దనలు సిద్ధం చేస్తున్నట్లు పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. వీటి నిర్వహణలో లోపాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి, కడప, విశాఖపట్నం, అనంతపురం, పులివెందుల, పుట్టపర్తిలలో శిల్పారామాలు ఏర్పాటు చేశామని, విజయనగరం, గుంటూరుల్లో పనులు చేపట్టనున్నామని చెప్పారు. కర్నూలు, శ్రీకాకుళంలలో భూములు ఇచ్చారని, తూర్పుగోదావరి, ప్రకాశం, నెల్లూరుల్లో భూములు కేటాయించాల్సి ఉందని తెలిపారు.

కొత్తగా 41 పిహెచ్‌సిలు : మంత్రి యనమల

రాష్ట్రవ్యాప్తంగా 41 కొత్త పిహెచ్‌సిల ఏర్పాటు, ఉన్న వాటిని అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర స్థాయిలో కమిటీని నియమించినట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో అనేక సమస్యలున్నాయని, అందుకే ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు అదనంగా కేటాయించామని తెలిపారు. జిల్లాల వారీగా అభివృద్ధి కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణా ళికలు రూపొందించలేదని సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి యనమల లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.



కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర టాస్క్‌ఫోర్సు కమిటీ : మంత్రి సుజయకృష్ణ

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంలో స్టీల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన నివేదిక సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లిందని మంత్రి సుజయకృష్ణ రంగారావు తెలిపారు. దీంతో కేంద్రం టాస్క్‌పోర్సు కమిటీని ఏర్పాటు చేసిందని సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. మికాన్ సంస్థ తన నివేదికను టాస్క్‌పోర్సు కమిటీకి ఇచ్చిందని చెప్పారు. త్వరలో నిర్వహించే టాస్క్‌పోర్సు కమిటీ సమావేశంలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశ ముందన్నారు. సహకార రంగంలోని చక్కెర కర్మాగారాల విషయంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకునే అవకాశం లేదన్నారు. సహకార రంగంలో 10 చక్కెర కర్మాగారాలుండగా ఆరు మూతబడ్డాయని, ఈ సమస్యల పరిశీలనకు నిపుణుల కమిటీని, మంత్రి వర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం నియమించిందన్నారు.

ప్రతిపాదనల్లో 59 కొత్త జూనియర్ కళాశాలలు : మంత్రి గంటా

రాష్ట్రంలో 59 కొత్త జూనియర్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గాల్లోని జూనియర్ కళాశాలల సమస్యలను వివరించేందుకు మాట్లాడే అవకాశాలు ఇవ్వాలని స్పీకర్‌ను పలువురు సభ్యులు కోరారు. బిజెపి ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు కోరినా స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన లేచి నిలబడి తమ నియోజకవర్గానికి జూనియర్ కళాశాల కావాలని మంత్రి దృష్టికి తెచ్చే యత్నం చేశారు. స్పీకర్ అనుమతి లేకుండా నేరుగా మాట్లాడం సభా మర్యాద కాదని అధికార పక్ష సభ్యులు పలువురు వారించారు. అయితే స్పీకర్ మంత్రికి సమాధానం ఇచ్చేందుకు అవకాశం ఇవ్వడంతో అలజడి సద్దుమణిగింది.

ఒకరికి ఒక ఇల్లే : మంత్రి కాలువ

ఒక పర్యాయం ఇల్లు మంజూరైనట్లు ప్రభుత్వ జాబితాలో పేరు లబ్ధిదారునికి మరో ఇల్లు మంజూరుకు అవకాశం లేదని గృహనిర్మాణ శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు తెలిపారు. ముందు మంజూరైన మొత్తం వెనక్కి చెల్లిస్తే, మరోమారు ఇల్లు కేటాయించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. లబ్ధిదారులకు చెల్లింపులో జాప్యానికి సాంకేతిక సమస్యలున్నాయని, వాట పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముంపు మండలాలపై మండలిలో బిజెపి, టిడిపిల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు కింద ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపిన అంశం గురించి మండలిలో అధికార పక్ష ఎమ్మెల్సీలకు, బిజెపి ఎమ్మెల్సీలకు మధ్య గురువారం వాగ్వాదం ఏర్పడింది. సిఎం చంద్రబాబు వల్లే కేంద్ర ప్రభుత్వం ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపారని టిడిపి సభ్యులు వాదించగా, కేవలం కేంద్ర ప్రభుత్వం చొరవ వల్లే ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపారని బిజెపి ఎమ్మెల్సీలు వాదించారు. చర్చలో బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతున్న సమయంలో టిడిపి సభ్యులు పలుమార్లు అడ్డుకున్నారు. ముంపు మండలాల అంశంలో నాడు కేంద్ర మంత్రిగా ఉన్న నేటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎంతో కృషి చేశారని సోము వీర్రాజు అన్నారు. ముంపు మండలాలు రాష్ట్రంలో కలిపే అంశంపై ఆర్డినెన్స్ వచ్చిన తర్వాతనే సిఎంగా ప్రమాణం చేస్తే బాగుంటుందని తాము సూచించామని చెప్పడంతో మండలి చీఫ్ విప్ పయ్యా వుల కేశవ్, టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ సోము వీర్రాజు ప్రసంగాన్ని అడ్డుకున్నారు. తాను మాట్లాడుతున్న ప్రతి సారి అధికార పక్షం సభ్యులు అడ్డుతగులుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. బిజెపి సభ్యులు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని అధికాప పక్షం సభ్యులు విమర్శించారు. ఈ పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముంపు మండలాల అంశంలో అంతా కేంద్ర ప్రభుత్వమే చేసిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ముంపు మండలాలను రాష్ట్రంలో కలిపిన అనంతరమే సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చంద్రబాబు నాయుడు నాడు ప్రధాని మోడీకి చెప్పారన్నారు. వెంకయ్య నాయుడు ఒక్కరి వల్లే ఇది సాధ్యం కాలేదన్నారు. ఈ అంశం పై వెంకయ్య నాయుడు రాజ్యసభలో మాట్లాడు తున్న సమయంలో సమాచారాన్ని తాము స్లిప్‌ల ద్వారా పంపించామన్నారు.తాను ఎక్సైజ్ శాఖకు మంత్రిగా ఉన్నానని తెలిసి కూడా హెల్త్ మంత్రి అని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు సంబోధించడం సరైంది కాదని దీనిని వెనక్కు తీసుకోవాలని మంత్రి జవహర్ అన్నారు. దీనికి వీర్రాజు అంగీకరిస్తూ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పై సోము వీర్రాజు మాట్లాడుతూ హెల్త్ మినిస్టర్ అని జవహర్‌ను వ్యాఖ్యానించడంతో ఈ అంశమూ వివాదంగా మారింది.

20 పద్దులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర 2018-19 వార్షిక బడ్జెట్‌లో వివిధ శాఖలకు చెందిన 20 పద్దులకు శాసనసభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తొలిసారిగా వివిధ శాఖలకు చెందిన 20 అంశాలపై బడ్జెట్ డిమాండ్లపై శాసనసభలో విడివిడిగా చర్చ జరపగా, మంత్రులు చేసిన ప్రతిపాదనలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇరవై విభాగాలకు సంబంధించిన బడ్జెట్ డిమాండ్లపై సభలో తొలిసారిగా విడివిడిగా చర్చ చేపట్టారు. జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మాట్లాడుతూ... నదుల అనుసంధానం ద్వారా రైతులకు సాగునీటి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృష్టి చేస్తుందన్నారు. పట్టిసీమ విష యంలో ఎక్కడా నిబంధనలు అతిక్రమించలేదని స్పష్టం చేశారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం

తొలిసారిగా డిమాండ్ల వారీగా చర్చ

ప్రభుత్వం కట్టుబడి ఉందని బిసి సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఏటా సగటున రూ.3,216 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బ్యాంకులు సహకరించకున్నా బిసి కార్పొ రేషన్ ద్వారా రుణాలు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. చంద్రన్న పెళ్లికానుక గురించి వివరించారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఖాళీగా ఉన్న పారా మెడికల్, డాక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. చక్కెర, కిరోసిన్‌కు కేంద్రం ప్రభుత్వం పెద్దఎత్తున కోత విధించినప్పటికీ తమ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. తూనికలు- కొలతల విషయంలో ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ వినియోగదారులకు నష్టం లేకుండా నిత్యావసరాలు అందజేస్తున్నామన్నారు.

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే 14 శాతం నిధులు ఈ బడ్జెట్‌లో పెంచామని తెలిపారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 200 అన్నా క్యాంటిన్‌లు జూన్ నాటికి ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్ర క్రీడలు-యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ క్రీడా వికాస్ క్రింద ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రైతు రుణ విముక్తి కోసం రూ.4100 కోట్లు కేటాయించినట్లు వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. రుణమాఫీకి సంబంధించి ఇప్పటి వరకు 9 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో చాలా వరకు పరిష్కరించామని తెలిపారు. దాదాపు రూ.600 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేశామని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ క్రింద మూడేళ్లలలో రూ.3 వేల కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. కరువు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, దీని కోసం ఈ ఏడాది రూ.1042 కోట్లు కేటాయించామని చెప్పారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ ఇవ్వగలుగుతున్నామని, ఉత్పత్తి అయిన విద్యుత్‌లో ఎక్కువ వినియోగించుకుంటున్న రాష్ట్ర ఏపీ అని మంత్రి కళా వెంకట్రావు తెలిపారు. మహిళా-శిశు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని స్త్రీ సంక్షేమ మంత్రి పరిటాల సునీత తెలిపారు.

అంగన్‌వాడీల తీరుపై స్పీకర్ అసంతృప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల అవసరం ఎంతో ఉందని, అయితే వీటి పనితీరు సంతృప్తికరంగా లేదని శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. శాసనసభలో గురువారం ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై అడిగిన ప్రశ్నకు శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ మంత్రికి పలు సూచనలు చేశారు. భవనాల నిర్మాణానికి కేటాయిస్తున్న మొత్తం చాలడం లేదని, ఈ మొత్తాన్ని రూ.8 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని స్పీకర్ తెలిపారు. ఎన్జీఒ, ఎన్ఆర్ఐలను వినియోగించుకోవడం వల్ల పథకాన్ని మరింత సమర్ధవంగా అమలు చేసేందుకు అవకాశముందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటిని ఇందుకు వినియోగించుకోవాలని సూచించారు. మంత్రి సమాధానాలిస్తూ 6,719 అంగన్‌వాడీలకు భవన నిర్మాణాల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. సభ్యులు వారి నియోజకవర్గాలలో అంగన్వాడీ కేంద్రాల అవసరం తన దృష్టికి తీసుకువస్తే మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. వెలుగు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, గణబాబు, వెంకటేష్, సర్వేశ్వరరావు తదితరులు తమ నియోజకవర్గాలలో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ కూలీ బకాయిలు రూ.445కోట్లు చెల్లించాలని, కూలీ రూ.500 పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు కోరారు. శాసనమండలిలో మండలి చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌కు ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని గురువారం వివరిం చారు. గ్రామాల్లో వలసల నివారణకు యంత్రాలతో కాకుం డా ఉపాధి హామీ కూలీలతో పనులు చేయించాలని, రోజు ఎంత పనిచేస్తున్నారో తెలియడానికి పేస్లిప్పులు ఇవ్వాలని, ఉపాధి నిధులను సిమెంట్ రోడ్లు, భవనాలు, స్టేడియంలు, గోడౌన్లకు మళ్ళించొద్దని, చిన్న, సన్నకారు రైతులు, దళిత గిరిజనుల భూములు అభివృద్ధికి, చెరువులు, కుంటలు, పంటకాలువలు, భూగర్భ జలాలు పెరిగి అన్ని రకాల మట్టినులు,మట్టిరోడ్లకు ఉపయోగించాలని, ప్రమాదాల్లో, వడదెబ్బకు చనిపోయిన వారికి రూ.10లక్షలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు బుధవారం వేలాది మందితో విజయవాడలో ధర్నా నిర్వహించారని తెలిపారు.

అనంత రైతులకు మూడునెలల్లో పటాలు

మంత్రి కెఇ కృష్ణమూర్తి హామీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లాలో అర్హులైన రైతులకు వారు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేసేందుకు వీలుగా ఆర్డీఒ నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేస్తామని, మూడు నెలల్లో పట్టాలు పంపిణీ చేస్తామని రెవెన్యూ మంత్రి కెఇ కృష్ణమూర్తి తెలిపారు. శాసనసభలో ప్రజాప్రాధాన్యత గలదిగా ఈ అంశంగా గురువారం జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ మాట్లాడారు. అనంతపురం జిల్లాలో పట్టాల మంజూరుకు సంబంధించి 252 క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి చెప్పారు. పలు గ్రామాల్లో రైతులు ఎంతో కాలంగా భూములు సాగు చేసుకుంటున్నా వారికి లింకు డాక్యుమెంట్లు, ఒరిజినల్ డాక్యుమెంట్లు లేకపోవడంతో పట్టాలు మంజూరు చేయలేకపోయినట్లు చెప్పారు. అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు సభ్యులు హనుమంతరాయ చౌదరి, పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ పట్టాలు లేకపోవడంతో రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారని చెప్పారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కు లేకపోవడంతో ఇబ్బందుల ఎదుర్కొంటున్నారన్నారు.

జీరో అవర్

మడకశిర ప్రాంతం నుంచి 50 వేల మంది వలస

- ధర్మవరంలో పనిచేయని ఎల్ఇడి లైట్లు
- జీరో అవర్‌లో ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 40 శాతం ఎల్ఇడి లైట్లు పని చేయడంలేదని, వాటిని మార్చాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ కోరారు. అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గ సమీప ప్రాంతాలో ఉపాధి కోసం సుమారు 50 వేల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఈరన్న కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా ప్రొసెసింగ్ ప్లాంట్లు ఎక్కువగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. అసెంబ్లీలో గురువారం జీరో అవర్ వివిధ నియోజకవర్గాల్లోని సమస్యలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. విశాఖపట్నంలోని నాలుగు నియోజకవర్గాల్లో ప్రవహిస్తోన్న శారద నదికి వేసవిలోనే పూడికలు తీసి మరమత్తులు చేయాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు కోరారు. అవనిగడ్డ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఉపయోగించే మద్దూరు, ఉప్పులూరు, కేసరపల్లి రోడ్డును బాగు చేయాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కోరారు. విజయ నగరం అర్బన్ ప్రాంతంలో పందులు, కుక్కల బెడద లేకుండా చేయాలని, స్టెరిలైజేషన్ చేసేందుకు వచ్చే సిబ్బందిపై దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మీసాల గీత కోరారు.

క్రైస్తవ మత బోధకులకు స్టైఫండ్ ఇవ్వాలి

క్రైస్తవ మత బోధకులకు స్టైఫండ్ ఇవ్వాలని నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్స్ టోచర్ ప్రభుత్వాన్ని కోరారు. చింతలపూడి ఏరియా ఆస్పత్రిని 30 నుంచి 100 పడకలకు పెంచాలని ఎమ్మెల్యే పీతల సుజాత కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్వతీపురానికి గతంలో కేటాయించిన బైపాస్ రోడ్డుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే చిరంజీవులు కోరారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల రుణాలపై రాయితీ ఇవ్వాలని ఎమ్మెల్యే వీరాంజనేయులు కోరారు. నర్సాపురం నియోజకవర్గ పరిధిలో మత్స్య సంపదకు ఇబ్బంది లేకుండా పూడిక తీత పనులు చేయాలని ఎమ్మెల్యే మాధవనాయుడు విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న పాఠశాల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పా టు చేయాలని ఎమ్మెల్యే గణేష్‌కుమార్ కోరారు. నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని తాడిమళ్ల గ్రామంలో ఆరోగ్య కేంద్రానికి నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే శేషారావు కోరారు.

ప్రశ్నోత్తరాలు

ఎస్సీ, ఎస్టీకు జీవో 25 అమలుకు
హౌస్ కమిటీ వేయాలి

మండలి ప్రశ్నోత్తరాల్లో శమంతకమణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ప్రయోజనాల కోసం జారీ చేసిన జీవో 25 అమలు కావడం లేదని టిడిపి సభ్యులు శమంతకమణి తెలిపారు. ఉప కుల్లాలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించే ఉద్దేశంతో ఈ జీవో విడుదల చేశారని గుర్తు చేశారు. దీనిపై హౌస్ కమిటీ వేయాలని గురువారం మండలి పశ్నోత్తరాల్లో కోరారు.

23,353 మంది చేనేత రుణాలు మాఫీ మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో 23,355 మంది చేనేతల రుణాలను మాఫీ చేశామని బిసి సంక్షేమ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయడు తెలిపారు. చేనేత రుణాలను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని వైసిపి సభ్యులు సుభాష్ చంద్రబోస్, వెన్నపూస గోపాల్ రెడ్డి, దేవసాని చిన్న గోవింద రెడ్డి వేసిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. టిడిపి సభ్యులు రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ చేనేతల వద్ద ఉన్న పాత మగ్గాలు మరమ్మతులకు గురయ్యాయని, సబ్సిడీతో వారికి కొత్త మగ్గాలు అందించాలని కోరారు. టిడిపి సభ్యులు పోతుల సునీత మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు.

హోంగార్డులకు ప్రాధాన్యమివ్వాలి : బొడ్డు నాగేశ్వరరావు

కానిస్టేబుళ్ల నియామకంలో హోంగార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డునాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కానిస్టేబుళ్ళ నియామకంలో హోంగా ర్డుల ప్రాధాన్యతను ఇస్తున్నారా అని హోం మంత్రి చిన్నరాజప్పను ప్రశ్నించారు. ఎస్టీలకు మాత్రమే ప్రాధాన్యతను ఇస్తున్నామని మంత్రి రాజప్ప చెప్పారు.

జప్తు చేసిన వాహనాలు ప్రభుత్వానికి ఇవ్వండి : చైర్మన్

ఎర్రచందనం అక్రమ రవాణా వల్ల స్వాధీనం చేసుకొని జప్తు చేసిన వాహనాలను ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఉపయోగించాలని శాసన మండలి చైర్మన్ ఎన్ఎండి ఫరూక్ అటవీ శాఖమంత్రి శిద్ధా రాఘవరావుకు సూచించారు. 2015-16,2017-18 సంవత్సరాలలో ఎర్రచందనం, తదితర అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్న 3,308 వాహనాలు స్వాధీనం చేశామని టిడిపి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. రుణ భారాలు లేని జప్తు చేసిన వాహనాలను వేలం వేస్తామని తెలిపారు.

సంపాదకీయం

మరో భారీ స్కాం

'మెరిసేదంతా బంగారం కాదు' అన్న నానుడి అక్షరాలా నిజమని కనిష్క గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ (కెజిపిఎల్) కుంభకోణం మరోసారి నిరూపించింది. మోడీ ఆశ్రిత పెట్టుబడిదారీ (క్రోనీ కేపిటలిజం) పాలనలో పరంపరగా సాగిపోతున్న బ్యాంకుల లూటీలలో కనిష్క గోల్డ్ తాజాగా వచ్చి చేరింది. పంజాబ్ నేషనల్ బ్యాంకుతో సహా పలు బ్యాంకులకు 11,400 కోట్ల రూపాయల మేర టోకరా వేసిన నీరవ్ మోడీ కుంభకోణం, ఆ తరువాత రోమోటెక్ తదితర కుంభకోణాలు సృష్టించిన ప్రకంపనలు సద్దుమణగక ముందే వెలుగులోకి వచ్చిన కనిష్క గోల్డ్ కుంభకోణం మొదటి దానితో పోల్చితే పరిమాణంలో చిన్నదే కావచ్చు. కానీ, ఇది చాలా పెద్ద ప్రభావాన్నే చూపిస్తుంది. కనిష్క గోల్డ్ బ్యాంకులకు ఎగవేసిన రుణం ఒక్కటే రూ.824.15 కోట్లు. వడ్డీ కూడా కలుపుకుంటే ఇది వెయ్యి కోట్ల రూపాయలకు చేరుకుంది. వెయ్యి కోట్లు అంటే చిన్న మాటా! బందిపోట్లను మించిన బందిపోటుల్లా వ్యవహరిస్తూ బ్యాంకులను యథేచ్ఛగా లూటీ చేస్తుంటే కేంద్రంలో ఏలికలు చోద్యం చూడడమే విచిత్రం. చట్టాలను చుట్టాలుగా మార్చుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఈ ఘరానా మోసగాళ్లకు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక పట్ట పగ్గాలు లేకుండా పోయాయి. కేంద్రంలోని ఏలికల దన్ను లేకుండానే బ్యాంకుల లూటీ సాగిపోతుందని ఎవరైనా అనుకుంటే పొరపాటే! కనిష్క గోల్డ్ రుణాల ఎగవేత గురించి జనవరి 25న అంటే నీరవ్ మోడీ కుంభకోణం బయటపడడానికి నాలుగు రోజుల ముందే సిబిఐకి ఎస్‌బిఐ ఫిర్యాదు చేసింది. అయినా, కేంద్ర ప్రభుత్వం కానీ, సిబిఐ కానీ దీనిని బయటకు పొక్కకుండా ఇన్నాళ్లు తొక్కిపెట్టాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత నిర్ణాయక వేదిక పార్లమెంటుకు సైతం తెలియజేయలేదంటే ఈ ప్రభుత్వం పారదర్శకతను ఎంతలా పాతర వేస్తున్నదో అర్థమవుతుంది.

కనిష్క గోల్డ్ అధిపతి భూపేష్ కుమార్ జైన్, ఆయన భార్య నీతా జైన్, ఆయన వ్యాపార భాగస్వామి అజయ్ కుమార్ జైన్ విదేశాలకు పారిపోయినట్లు వార్తలొస్తున్నాయి. అక్రమార్కులను ప్రభుత్వమే కాపాడుతోందని అన్ని వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం లెక్కచేయడం లేదు. నీరవ్ మోడీ అక్రమాల గురించి బెంగుళూరుకు చెందిన ప్రజా వేగు హరిప్రసాద్ ప్రధాని కార్యాలయానికి, కంపెనీల రిజిస్ట్రార్‌కు 2016లోనే ఉప్పందించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. భారతీయ స్టేట్ బ్యాంకుకు 9000 కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విజయ మాల్యాకు, ఐపిఎల్ సొమ్ము అక్రమంగా కైంకర్యం చేసి పారిపోయిన లలిత్ మోడీకి కేంద్రంలోని బిజెపి సర్కారు పెద్దల అండదండలున్నాయన్న విమర్శలున్నాయి. బ్యాంకుల లూటీ ఇప్పుడే కొత్తగా మొదలైంది కాదని, యుపిఎ ప్రభుత్వ హయాంలోనే దీనికి బీజాలు పడ్డాయని చెప్పి బిజెపి ప్రభుత్వం తన బాధ్యతనుంచి తప్పించుకోవాలని చూస్తే కుదరదు. యుపిఎ హయాంలో ప్రారంభమైన ఈ కుంభకోణాలు వికృత రూపం దాల్చింది మోడీ జమానాలోనే. ఇన్ని కుంభకోణాలు బయటపడినా వీటికి సంబంధించి ఇంతవరకు ఏ ఒక్క నిందితుణ్ణి అరెస్టు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిందితులంతా విదేశాల్లో దర్జాగా తిరుగుతూ భారత దర్యాప్తు సంస్థలను సవాల్ చేస్తుంటే, వారిని దేశానికి రప్పించి, కటకటాల వెనక్కి నెట్టాల్సిన మోడీ ప్రభుత్వం చేష్టలుడిగినట్లు వ్యవహరించడం శోచనీయం.

ఒకవైపు కుంభకోణాలకు పాల్పడేవారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరోవైపు ఈ కుంభకోణాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలనే దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నది. నీరవ్ మోడీ కుంభకోణం బయటకు రాగానే ప్రధానమంత్రి ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద సుబ్రమణ్యం స్పందిస్తూ, ప్రభుత్వ రంగబ్యాంకులను మరింత డీ రెగ్యులేట్ చేయాల్సిన తరుణం ఆసన్నమైందని సెలవిచ్చారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడమే బ్యాంకుల సంక్షోభానికి పరిష్కారమన్నట్లు నయా ఉదారవాద విధాన సమర్థకులు ప్రతి రోజూ పాడిందే పాట పాడుతున్నారు. ఇటువంటి వాదన చేసేవారు 1947-69 మధ్య ఈ దేశంలో ప్రయివేటు వాణిజ్య బ్యాంకుల అక్రమ భాగోతాలను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. ఆ ఇరవై ఏళ్లలో దాదాపు 550కిపైగా ప్రైవేట్ బ్యాంకులు బోర్డు తిప్పేసి కోట్లాది మంది ఖాతాదారులను నిలువునా ముంచాయి. కోలుకోలేని స్థితిలో వున్న మరో పాతిక ప్రైవేట్ బ్యాంకులను ప్రభుత్వ రంగ బ్యాంకులతో విలీనం చేశారు. నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన నేటి యుగంలోనూ 'కొత్త తరం బ్యాంకు' గా పోజులిచ్చిన గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు తన ఖాతాదారులను ఎలా ముంచేసిందో చూశాము. నీరవ్ మోడీ, కనిష్క గోల్డ్ కుంభకోణాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులే కాదు, ఐసిఐసిఐ, యాక్సిస్ వంటి బడా ప్రైవేట్ బ్యాంకులూ దెబ్బతిన్నాయన్నవిషయం మరచిపోరాదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇటువంటి మతిమాలిన వాదనలను మానుకుని బ్యాంకులను లూటీ చేసిన ఘరానా మోసగాళ్లను చట్టం ముందు నిలబెట్టాలి.

ఇదీ విషయం




బ్యాంకుల్లో సొమ్ముంటే
నమో.. బూచాడి భయం...
దొంగల చట్టం చేస్తే
శఠగోపమే అభయం!

జాతీయపు బ్యాంకుల్లో
రోజుకొక్క పందికొక్కు...
బొక్కేసిన వారి పక్క
సర్కారు సన్నాయి నొక్కు!

- కొల్లూరు వెంకట్

ఆ స్ఫూర్తితో హోదాకై ఉద్యమం



వివి శ్రీనివాసరావు

ఆంధ్ర రాష్ట్రంలో 'ప్రత్యేక హోదా' ఉద్యమం జరుగుతున్న వేళ భారత దేశ చరిత్రలో ఉజ్వల తారగా నిలిచిన భగత్‌సింగ్ 87వ వర్థంతిని జరుపుకుంటున్నాం. ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్య వాదులపై భగత్‌సింగ్ ఆయన సహచరులైన రాజ్‌గురు, సుఖదేవ్ వంటి వారు చేసిన పోరాటం, నడచిన మార్గం, కనబరచిన స్ఫూర్తి, చేసిన త్యాగం నేటి మన ఉద్యమానికి ఎంతో ఆచరణీయం. దేశీయుల పాలనలో ప్రజల అవసరాలు, సంక్షేమం కంటే తమ స్వార్థ ప్రయోజనాలే మిన్నగా భావిస్తుంటే దీనికి ధీటుగా ప్రజలంతా ఐక్యంగా కదలాల్సిన ఆవశ్యకతను భగత్‌సింగ్ లాంటి పోరాట యోధులు మనకు చూపిన మార్గం. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని గందరగోళపర్చి, పక్కదారి పట్టించడం తెలిసిందే. అందులో భాగంగానే మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలోనూ తెలుగుదేశంతో కలిసి ఇన్నాళ్లూ ఆడిన నాటకానికి పరాకాష్టగా నేటి పరిణామాలను చూస్తున్నాం. ఈ నేపథ్యంలోనే భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రత్యేక హోదాకై ఉద్యమించాలనే నినాదాన్ని యువత, విద్యార్థిలోకం లోకి తీసుకెళ్లాల్సి వుంది. భగత్‌సింగ్ వారసులుగా ఉద్యమిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరాక తప్పదు. వీరు చెబుతున్న కల్లబొల్లి కబుర్లను ఎండగట్టి, హోదా మన హక్కుగా సాధించాలి.

భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించాడు. ఆ కాలంలో తన కుటుంబంలోని తండ్రి, మామయ్య వంటి ఎందరో... బ్రిటీష్ ప్రభుత్వంపై సాగుతున్న జాతీయోద్యమ కార్యకలాపాల్లో పాల్గొని జైల్లో ఉన్నారు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన భగత్‌సింగ్ పాఠశాల విద్యార్థిగా వున్నప్పుడే లాహోర్ కుట్ర కేసులో ఉరి తీసిన కర్తార్‌సింగ్ శరభ ఫోటోను జేబులో పెట్టుకుని తిరిగేవాడు. స్వాతంత్ర్య సాధనకై నవజవాన్ భారత్ సభ (ఎన్‌బిఎస్) అనే మిలిటెంట్ యువజన సంఘాన్ని స్థాపించి నడిపాడు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు మతోన్మాద భావజాల వ్యాప్తిని, మత పరమైన సంస్థలతో లేదా అలాంటి పార్టీలతో ఎలాంటి సంబంధం పెట్టుకోరాదని విశ్వసించి ఎంతో జాగరూకతతో కృషి చేశాడు. మతం అనేది మనిషి వ్యక్తిగత నమ్మకమనీ, అందుకు అనుగుణంగానే మనిషి పూర్తిగా వ్యవహరించాలన్న సాధారణ సహన స్ఫూర్తిని ప్రజల్లో కల్గించేందుకు ప్రయత్నించాడు. మతం, మూఢ నమ్మకాల బంధనాల నుండి ప్రజలు తమంతట తాము విముక్తులవ్వాలని విశ్వసించేవాడు. ఆ దిశగా నేడు పచ్చి మతోన్మాద మితవాద పార్టీ అధికారం లోకి వచ్చిన తరువాత దేశంలో జరుగుతున్న పరిణామాలు నాడు భగత్‌సింగ్ చెప్పినట్లే మతాన్ని రాజకీయాల్లోకి చొప్పించి ప్రజల్ని, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడం చూస్తున్నాం. అధికారం కోసం మతోన్మాదులతో చేతులు కలిపి రాష్ట్ర ప్రజల్ని వంచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం యువతను, యువశక్తిని నిర్వీర్యం చేయడానికి చూస్తోంది. దీనిపై ఉద్యమిస్తే నిర్బంధాలను, లాఠీలను ఝుళిపిస్తూ ఉద్రిక్తతలకు దారితీసే విధంగా రాజ్యాంగ యంత్రాన్ని ఉపయోగించుకుంటోంది.

ఈ నేపథ్యంలోనే భగత్‌సింగ్ మాటలను గుర్తుచేసుకోవాలి. 'విప్లవ సాధనకు వ్యక్తిగత హింసతో కూడిన టెర్రరిజం సరికాదు. కార్మిక కర్షక యువజన సమీకరణ, ప్రజా ఉద్యమాలు, ప్రజా పోరాటాలే సరియైన మార్గం' అన్నాడు. ఈ విప్లవోద్యమం దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడంతో ఆగిపోరాదని, ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరో జాతి దోపిడీ చేసే ఈ వ్యవస్థ రద్దయ్యేవరకూ మన సమాజంలో మౌళికమైన సాంఘిక, ఆర్థిక మార్పులను తీసుకుని వచ్చేంతవరకూ విప్లవోద్యమం కొనసాగవల్సిందేనని భగత్‌సింగ్ విశ్వసించి పని చేశాడు. తుదకు మార్క్సిస్టు విప్లవకారుడుగా 1931 మార్చి 23న తన 23 ఏళ్లకే బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చేతిలో ఉరికంబమెక్కి భావితరాలకు ఆదర్శప్రాయుడయ్యాడు.

అంతటి మహోన్నత భావాలతో, ప్రపంచానికే దిశా నిర్దేశం చేసిన మార్క్సిస్టు దృక్పథంతో మెలిగిన భగత్‌సింగ్ బాటలో నేటి యువతరం కూడా నడవాలి. నేటి పాలకుల విధానాల్లో మార్పు తెచ్చే వరకు, అణగారిన ప్రజలకు అధికారం వచ్చే వరకు అది సాగాలి. దీనిలో భాగంగానే ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీసుకెళ్లాలి.

(రచయిత సెల్: 94900 98799)

అధ్యయన శీలి.. భౌతికవాది ..



బండారు రవికుమార్

అనేక మంది విప్లవకారులందరిలో కంటే భగత్‌సింగ్‌లో కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. ఆయన గొప్ప అధ్యయన శీలి. ఆలోచనాపరుడు. అందుకే విప్లవం, సోషలిజం, దేవుడు, మతం, టెర్రరిజం, హోల్‌టైమర్ల ఆవశ్యకత, పార్టీ పని ఎక్కడ, ఎలా చేయాలి? అనే విషయాలపై అభిప్రాయాలను స్పష్టంగా వివరించాడు. 87వ వర్థంతి సందర్భంగా భగత్‌సింగ్ అభిప్రాయాలను ప్రజల ముందుంచడం అవసరం.

'కేవలం నమ్మడం-మరీ గుడ్డిగా నమ్మడం చాలా ప్రమాదకరమైనది. అలాంటి అంధ విశ్వాసం మన మెదళ్ళను మొద్దుపరిచి అభివృద్ధి నిరోధకులుగా తయారు చేస్తుంది' అంటూ 'విప్లవమనే ఆయుధం ఆధునిక ఆలోచనలతో పదునెక్కుతుంది' అంటాడు భగత్‌సింగ్. 'అభ్యుదయం కోసం నిలబడే ప్రతి వ్యక్తీ పాత విశ్వాసాలకు సంబంధించిన ప్రతి దాన్ని ప్రశ్నించాలి. ఒక్కొక్కదాన్ని తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే నిర్ధారణకు రావాల్సి ఉంటుంది' అని వ్యాఖ్యానించాడు. తాను నాస్తికుడనని ప్రకటించుకున్నాడు.

'శాస్త్రీయమైన, హేతుబద్ధమైన అవగాహన లేని బలహీనమైన వ్యక్తికి దేవుడన్న విశ్వాసం వలన ఊరట కలుగుతుంది. ఆ విశ్వాసం వలన కష్టాలను తట్టుకోగలడు. కష్టాలు పడటంలో ఆనందాన్ని సహితం అనుభవించగలడు' అని పేర్కొన్నాడు.

1926 లోనే 'ఈ జగత్తునంతటినీ సృష్టించి, అదుపు చేసి నడిపించే ఒక దేవుడున్నాడనే సిద్ధాంతానికి ఏ మాత్రం ఆధారం లేదు' అంటూ అతీతమైన శక్తి పట్ల నమ్మకాన్ని, దైవ భావాన్ని నిరాకరించాడు. 'నా ఉద్దేశంలో మానవుడు తనకున్న పరిమితులను, బలహీనతలను, లోపాలను దృష్టిలో ఉంచుకుని దేవుడనే సర్వశక్తివంతుడిని ఊహలోకి తెచ్చుకున్నాడు' అన్నాడు. మానవుడు ప్రకృతిలో ఒక భాగం. మానవుడి ఆలోచనలు భౌతిక వాస్తవంలో నుండి, పదార్థం నుండి ఉద్భవిస్తున్నాయి. మతం మానవుడిని సృష్టించలేదు, మానవుడే మతాన్ని సృష్టించాడని భౌతికవాదం చెబుతుంది. అందుకే భగత్‌సింగ్ భౌతికవాది.

అతీతమైన శక్తిపై, భగవంతుడిపై నమ్మకం ఉండేవారికి భగత్‌సింగ్ పలు ప్రశ్నలను సూటిగా సంధించాడు. 'ఈ భూమిని, ప్రపంచాన్ని సృష్టించిన ఒక సర్వశక్తివంతుడు, సర్వాంతర్యామి అయిన భగవంతుడు మనుషులను పాప కార్యాలు చేయకుండా ఎందుకు ఆపకూడదు? యుద్ధ భీభత్సాలు, మానవ మారణ హోమం సాగించే దుర్మార్గులైన పాలకులను ముందుగానే ఎందుకు శిక్షించకూడదు? మానవ జాతిని నాశనం చేసే ప్రపంచ యుద్ధాన్ని రాకుండా దేవుడు ఆపుచేయలేడా? పెట్టుబడిదారులు తమ వద్దనున్న ఉత్పత్తి సాధనాలను, సంపదను ప్రజలపరం చేసేటట్లుగా వారికి హృదయ పరివర్తన ఎందుకు తీసుకొని రాకూడదు? ఈ విధంగా కష్టజీవులందరినీ ఉద్ధరించేటట్లు చేయరాదా? అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు లేని సోషలిస్టు సమాజాన్ని సర్వశక్తి సంపన్నుడైన దేవుడే సృష్టించవచ్చు కదా? దేవుడే స్వయంగా రంగంలోకి దిగి సమాజాన్ని అంతటినీ ఒక క్రమపద్ధతిలో పెట్టి సవ్యంగా నడిపించవచ్చుకదా? భగవంతుడు ఉంటే భూమి మీద ఇన్ని ఘోరాలు జరుగుతుంటే ఆనందిస్తున్నాడా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. భగత్‌సింగ్ భావాలు ఇంత పరిపక్వంగా ఉండటానికి కారణం ఆయన నిరంతర అధ్యయనశీలి కావడమే. నేటి తరం భగత్‌సింగ్ నుండి సామ్రాజ్య వ్యతిరేక పోరాట వారసత్వం, త్యాగం, నిరంతర అధ్యయనం, మార్క్సిజం, సోషలిజం భావాల ప్రాధాన్యతను గుర్తించడం మొదలైనవాటిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

(రచయిత సెల్ : 9496098090)

నేడు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్థంతి



సామ్రాజ్యవాదానికిదే సమాధానం

జి కిషోర్ కుమార్

దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం బ్రిటీష్ పాలకులను గడగడలాడించి, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన వీర కిశోరం భగత్‌సింగ్ వారు మోపిన అక్రమ కేసుకు బలైన రోజు ఇది. సామ్రాజ్యవాదానికి సమాధానం పోరాటమేనని, పోరాటానికి కావలసిన అసలైన సైన్యం క్షేత్రాలలో పని చేసే రైతుల్లోనూ, కర్మాగారాలలో పని చేసే కార్మికులలోనే ఉందని చాటి చెప్పిన యువ కెరటం భగత్‌సింగ్.

సామ్రాజ్యవాదం పెచ్చురిల్లి, ప్రపంచ ప్రజల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన బోధనలు ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. 'పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర రూపమే సామ్రాజ్యవాదం'. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదని ప్రచారాన్ని సాగిస్తూ, ఈ వ్యవస్థ సృష్టిస్తున్న సామ్రాజ్యవాదాన్ని ఆ విధాన ఫలితాలను ప్రపంచ ప్రజల మీద అమెరికా దాని మిత్ర రాజ్యాలు రుద్దుతున్నాయి. సామ్రాజ్యవాదులు సృష్టించిన సంస్థలైన వరల్డ్ బ్యాంక్, ఐఎమ్ఎఫ్, డబ్ల్యుటిఒ విధాన ఫలితాలను ప్రపంచ ప్రజలు చవి చూస్తున్నారు. 'పెట్టుబడి ప్రపంచీకరణ' పేరుతో జరుగుతున్న ప్రపంచీకరణ దుష్ఫలితాలు దేశ ఆర్థిక వ్యవస్థలను కూల్చే స్థాయికి చేరాయి.

ప్రజల కొనుగోలు శక్తిని హరించి, ఉన్న ఉపాధి అవకాశాలను ఊడబెరికి, వివిధ రంగాలలో ఉన్న కీలక వనరులను కొల్లగొట్టేందుకు ఈ విధానాలు ఉపయోగపడుతున్నాయనే వాస్తవాన్ని ఆచరణలో ప్రజలు అనుభవించే స్థాయికి రావటం వలనే దాఓస్, సియాటెల్, ప్రాగ్ వంటి చోట్ల ఈ సంస్థలు నిర్వహిస్తున్న సమావేశాలకు వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా నిరసన వెల్లువెత్తింది. అందుకే 'మానవాళికి సేవ చేయడానికి, పీడితులకు విముక్తి సాధించటానికి, నిస్వార్థంగా, అధికారికంగా స్త్రీ, పురుషులు ముందుకు వచ్చినప్పుడే విముక్తి యుగానికి నాందీ ప్రస్తావన జరుగుతుంది' అని భగత్‌సింగ్ పేర్కొన్నాడు.

సామ్రాజ్యవాద సంస్థ అయిన డబ్ల్యుటిఒ విధానాల ఫలితంగా భారతదేశం వంటి వ్యవసాయ ప్రధానమైన దేశాలలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వస్తోంది. మానవాభివృద్ధి నివేదిక కూడా ఈ విషయాన్ని ప్రస్తావించింది. వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ లేకపోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, కార్పొరేట్ వ్యవసాయం, వ్యవసాయరంగ కేటాయింపులు కుదించడం, సబ్సిడీలను రద్దు చేయడం వంటి విధానాల ఫలితంగా వ్యవసాయరంగం సంక్షోభంలోకి నెట్టబడి రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడడం, కరువు కోరలలో చిక్కుకోవడం జరుగుతోంది. దారిద్ర్యం కంటే పాపం ఇంకొకటి లేదని అంతకంటే శిక్ష మరొకటి లేదని భగత్‌సింగ్ ఎప్పుడో పేర్కొన్నాడు.

ప్రస్తుతం మన దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, స్పెషల్ ఎకనమిక్ జోన్స్, స్టార్టప్ కల్చర్, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్, ప్రైవేట్ ఈక్విటి, బిట్ కాయిన్ వంటి ప్రత్యామ్నాయ కరెన్సీ వంటి పేరుతో జరుగుతున్న ప్రక్రియ సామ్రాజ్యవాద విస్తరణలో భాగమే.

సామ్రాజ్యవాదుల ఆధీనంలో వున్న బహుళజాతి సంస్థల శక్తి ముందు దేశ ఆర్థిక వ్యవస్థలు పేకమేడల్లా కూలిపోతున్నాయన్న సంగతి పాలకులకు తెలిసి కూడా వాటిని ఆహ్వానించడం సామ్రాజ్యవాదాన్ని స్వాగతించడమే!

ఈ వాస్తవాలు తెలిసి కూడా భారతదేశం లాంటి అతిపెద్ద మార్కెట్లోకి అందులోను కీలకమైన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఔషధ, టెలికం, ప్రింట్ మీడియా, రక్షణ, చిల్లర వ్యాపారం వంటి కీలక రంగాల్లోకి విదేశీ సంస్థలను ఆహ్వానిస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే 'ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పాలక వర్గాల చేతుల్లో వారి ప్రయోజనాలను పరిరక్షించే ఆయుధాలు మాత్రమే' అన్న భగత్‌సింగ్ ఉవాచ గుర్తుకురాక తప్పదు.

దోపిడీదారులను, పీడకులను, నిరంకుశులను సవాలు చేసి మానవ జాతిని బానిసత్వం నుంచి విముక్తి చేసి మానవులకు శాంతిని, స్వాతంత్ర్యాన్ని ప్రసాదించే లక్ష్యం కోసం ప్రాణాలను లెక్కచేయక 'సిద్ధాంతం జీవితం కన్నా గొప్పదని' పేర్కొని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య సాధన కోసం సగర్వంగా ఉరికంబం ఎక్కిన వీర కిశోరం భగత్‌సింగ్‌కు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళటమే నిజమైన నివాళి అవుతుంది.

(రచయిత ఐసిఐయు ప్రధాన కార్యదర్శి, మచిలీపట్నం)

వారి బలిదానం చిరస్మరణీయం

భగత్‌సింగ్‌ని చూస్తే సుఖదేవ్ అసూయపడే వాడా? మీరు నమ్మినా నమ్మకపోయినా అది నిజం. తన కంటే ముందు దేశం కోసం ప్రాణార్పణం చేసే అవకాశం భగత్‌సింగ్‌కి వస్తుందని అసూయ పడేవాడట. ఈ ఇరువురు వీరులతో పాటు రాజగురును కలిపి బ్రిటీష్ పాలకులు 87 సంవత్సరాల క్రితం అంటే 1931 మార్చి 23న ఉరి తీశారు. చాలా మంది అపోహ పడుతున్నట్లు పార్లమెంటులో బాంబులు వేసినందుకు వారికి మరణశిక్ష వేయలేదు. ఆ కేసులో భగత్‌సింగ్‌కు, మరో విప్లవ వీరుడు భటుకేశ్వరదత్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

తప్పించుకునే అవకాశం వుండి కూడా ఉద్యమ ప్రచారానికి కోర్టు విచారణని వేదికగా చేసుకోవాలనే తపనతో భగత్‌సింగ్ ప్రాణార్పణకు సిద్ధమయ్యాడు. అంతకుముందు లాలా లజపతిరాయ్ మృతికి కారణమయ్యాడని శాండర్స్ అనే బ్రిటీషు పోలీసు అధికారిని కాల్చి చంపిన ఘటనలో ఉపయోగించిన పిస్టల్ భగత్‌సింగ్ దగ్గర దొరకటంతో పోలీసులకు అంతుపట్టని శాండర్స్ హత్య కేసు మిస్టరీ వీడిపోయింది. పార్లమెంటుపై బాంబు దాడి కేసును, శాండర్స్ హత్య కేసును కలిపి బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్రపన్నారని 13 మంది విప్లవకారులపై మోపిన లాహోర్ కుట్రకేసులో భగత్‌సింగ్‌తో పాటు రాజగురు, సుఖదేవ్‌లకు మరణశిక్ష విధించారు.

1928 డిసెంబరు 17న శాండర్స్‌ని చంపే నాటికి భగత్‌సింగ్ కమ్యూనిస్టు కాదు. 1929 ఏప్రిల్ 8న పార్లమెంట్‌పై బాంబు దాడి నాటికి కూడా భగత్‌సింగ్ కమ్యూనిస్టు కాదు. కాని 1931 మార్చి 23న ఉరి తీయబడే నాటికి భగత్‌సింగ్ కమ్యూనిస్టు. 23 సంవత్సరాల ఆయన జీవితకాలంలో ఈ రెండేళ్లే అతి కీలకమైనవి. నిరంతర అధ్యయనంతో కమ్యూనిస్టుగా మారిన భగత్‌సింగ్ చనిపోయే చివరి క్షణం వరకు పుస్తక పఠనంతోనే గడిపాడు. లాహోర్ ద్వారకా గ్రంథాలయం అధ్యక్షులు రాజారాం శాస్త్రి, తన న్యాయవాది ప్రాణనాథ్ మెహతా సహకారంతో అనేక గ్రంథాల్ని అధ్యయనం చేశాడు. 'నేనెందుకు నాస్తికుడను', 'వీలునామా', 'నా నెత్తురు వృథా కాదు', 'భారత జాతీయ విముక్తి పోరాట దిశలు' లాంటి రచనల ద్వారా తన అభిప్రాయాల్ని జాతికి అందించారు. జైల్లో రాసిన ఈ రచనలు బయట ప్రపంచానికి చేరవేయడంలో న్యాయవాది ప్రాణనాథ్ మెహతా ముఖ్య పాత్ర వహించారు.

క్షమాభిక్ష కోసం దరఖాస్తు చేయమన్న వకీలు అభ్యర్థనపై రాజగురు, సుఖదేవ్‌లు మండిపడ్డారు. భగత్‌సింగ్ గవర్నరుకు పంపించిన లేఖలో... ఇంగ్లీషు వారికి భారతీయులకు జరిగే యుద్ధంలో పాల్గొన్న మేము యుద్ధ ఖైదీలమని, కనుక మమ్మల్ని ఉరి తీయడం కాకుండా కాల్చి చంపడానికి మీ సైన్యాన్ని ఆదేశించాలని, మీ న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును మీరు గౌరవించి ఈ పని చేయాలని కోరారు.

క్షమాభిక్ష కోసం తన అనుమతి లేకుండా తండ్రి పెట్టుకున్న దరఖాస్తుపై స్పందిస్తూ ఆయన తనను వెన్నుపోటు పొడిచాడని చెబుతూ... తన జీవితం సిద్ధాంతాల్ని బలిపెట్టేంత గొప్పది కాదని నమ్రత ప్రకటించాడు.

తాను చనిపోయే ముందు యావజ్జీవ కారాగార శిక్ష పడిన భటుకేశ్వరదత్తుకి లేఖ రాస్తూ విప్లవకారుడు తన ఆదర్శాల కోసం మృత్యువును వరించడమే కాదు, జీవిస్తూ ప్రతి కష్టాన్ని ఎదుర్కొనగలడని నిరూపించాలి. మృత్యువు కుటుంబ కష్టాల నుండి విముక్తి పొందే సాధనం కారాదని అభిలషించాడు. తృప్తిగా నినాదాలివ్వ డానికి కొన్ని నిమిషాలు సమయం కావాలని చివరి కోరికగా అడిగిన ఈ యువ కిశోరాలు కమ్యూనిస్టులు కావటం భారతదేశంలోని కమ్యూనిస్టులకు గర్వకారణం.

- చెరుకూరి సత్యనారాయణ

నిజమైన దేశభక్తి అంటే?



కంభం ప్రసన్న కుమార్

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఉన్నత స్థాయి సైద్ధాంతిక, తాత్విక పరిణితిని సాధించిన వారిలో మిగతా వారి కంటే భగత్‌సింగ్ అగ్రభాగాన నిలుస్తాడు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన వారిలో ఎక్కువ మంది ఏదో ఒక మత విశ్వాసాన్ని నమ్మినవారే. స్వాతంత్రోద్యపు ప్రధాన స్రవంతి హిందూ మత పునరుద్ధరణ ఆధారంగా అభివృద్ధి చెందింది. ఇది బ్రిటీషు పాలకులతో రాజీపడే ధోరణిని అవలంబిస్తూ కొన్ని రాయితీలు పొందటానికే పరిమితమైంది. దీనికి బ్రిటీషు పాలకులు కూడా ప్రత్యక్షంగాను పరోక్షంగాను సహకరించారు. కొందరు స్వాతంత్ర్యం కోసం పోరాడినా, కోరిక వెల్లడించినా అవి బ్రిటీషు ప్రభుత్వ ధిక్కార తరహాలో ఉండేవి కావు. దశాబ్దాలు గడిచేవి. నినాదం మారేది. ఉద్యమాలు వాయిదా పడేవి. ఎవరి కారణాలు వారికున్నా, యువతలో అసహనం పెరిగేది. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో రాజకీయ ఎత్తుగడలతో తల పండిన మేధావుల ఆలోచనలు, సుదీర్ఘ ఉపన్యాసాలు, చర్చలు స్వాతంత్ర్యంతోనే ఆగిపోయేవి. కానీ స్వాతంత్ర్యం తర్వాత దేశం ఎలా ఉండాలి? అని వారు ఆలోచించలేకపోయారు. ఈ రెండు ధోరణులకు భిన్నంగా భగత్‌సింగ్ పోరాటంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ మత విశ్వాసాన్ని నమ్మని, ఆచరించని మనవతా దృక్పథాన్ని కలిగిన వ్యక్తి. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అప్పట్లో పెద్దగా పరిచయం లేని నినాదం. దాని అర్థాన్ని తెలియజేస్తూ భగత్‌సింగ్ ఇలా అన్నాడు. 'విప్లవమంటే రక్తపాతంతో కూడిన సంఘటన కాదు. ఇందులో వ్యక్తిగత ద్వేషాలకు ఏ మాత్రం తావు లేదు. అలగే ఇది బాంబు, పిస్తోళ్ల సంస్కృతి కాదు. విప్లవమంటే మా అర్థంలో అన్యాయం పునాదిగా వున్న ప్రస్తుత వ్యవస్థ మారి తీరాలి' అన్నాడు. అలాగే మన దేశాన్ని బ్రిటీషు పాలకులు వదిలి వెళ్ళిన తరువాత ఏర్పడవలసిన వ్యవస్థ ఏంటో కూడా చెప్పాడు. స్వాతంత్ర్యం అనంతరం స్థాపించవలసిన వ్యవస్థ రూపాలు, స్వభావాల గురించి చెబుతూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఒక్క సోషలిస్టు వ్యవస్థలోనే సాకారం అవుతాయని ప్రకటించాడు.

23 ఏళ్ల వయస్సులో బ్రిటీష్ పాలకులు తీసింది భగత్‌సింగ్ ప్రాణం మాత్రమే. తన ప్రాణం కన్నా మిన్నగా భావించిన భావజాలం, ఆయన సమకాలీక నాయకుల్లో ఎవరికీ అందనంత ఎత్తుకు చేరిన ఆలోచనలను మాత్రం కాదు. కానీ ఆయన ఆదర్శాలను విస్తృత స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళకుండా అడ్డుకట్ట వేసింది మాత్రం నాటి నాయకుల నుంచి నేటి పాలకులే. దాని ఫలితమే నేటి వికృత సమాజం. 1929లో అంటరానితనం గురించి రాసిన వ్యాసంలో 'మనం భారతీయులం. మన ఆధ్యాత్మిక సంపద గురించి గొప్పలు చెప్పుకుంటున్నాం. కానీ ప్రతి మనిషీ మనలాంటి వాడేనన్న విషయాన్ని విస్మరిస్తాం. కానీ డబ్బు సంస్కృతి వంటబట్టిందని మనం చెడుగా చెప్పుకుంటున్న పశ్చిమ దేశాల వారు మాత్రం సమానత్వ సూత్రాన్ని గాఢంగా నమ్ముతున్నారు. మన దేవుళ్ళ గురించి, దేవతల గురించి అలుపు లేకుండా గొప్పలు చెప్పుకునే మనం మాత్రం అంటరాని వారిపై ఇంకా చర్చోపచర్చలు చేస్తున్నాం' అన్నాడు భగత్‌సింగ్.

ఇంతటి ఉన్నత భావాలు గల భగత్‌సింగ్ దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడితే, నేటి యువత సామ్రాజ్యవాద విష సంస్కృతిలో కొట్టుమిట్టాడుతోంది. ఆయన సాగించిన భావజాల సంఘర్షణను కొంత మంది కాషాయీకరణ చేస్తున్నారు. సకల పీడనలు, దోపిడీల నుంచి విముక్తి చేసి మానవులందరు స్వేచ్ఛా, సమానత్వాలను పొందే మరో సమసమాజ లక్ష్యంగా ఉండాలని భగత్‌సింగ్ కలలు కన్నాడు. దేశ విముక్తికి అవసరమైన సైద్ధాంతిక స్ఫూర్తి కోసం నిరంతరం అన్వేషించాడు. మతం వ్యక్తిగత అంశంగా ఉండాలని, అది రాజకీయాల్లోకి చొరబడి మతోన్మాద రూపం తీసుకున్నప్పుడు దాన్ని ఒక పెద్ద శత్రువుగానే భావించి ఎదుర్కొనాలని అన్నాడు. మతం, మూఢనమ్మకాల బంధనాల నుంచి ప్రజలు తమంతట తామే విముక్తులవ్వాలని ఆయన విశ్వసించేవాడు. దేశభక్తి పేరుతో కొత్త నిర్వచనాలు పులుముకుంటున్న నేపథ్యంలో నిజమైన జాతీయత ఏంటో? దేశభక్తి అంటే ఏంటో? భగత్‌సింగ్‌ను చూసి మనం గ్రహించాలి. ఆ స్ఫూర్తితోనే నేటి యువత సమాజంలో ఎదుర్కొంటున్న అసమానతలపై, దోపిడీ వ్యవస్థపై, మతోన్మాదంపై పోరాడాల్సిన అవసరం ఉంది.

(రచయిత సెల్ : 7396503105)



లీలమ్మ ... అనగానే అప్పటి తరానికి ఆమె చప్పున గుర్తుకొస్తారు.. నేటి తరంలో కొందరికి లీలగా జ్ఞప్తికొస్తారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవన సహచరి ఆమె.. ఆయన ఆశయం వెనుక ప్రజ్వలించే జ్యోతి ఆమె. ఆయన ప్రతి అడుగులో, శ్వాసలో ఆమె అణువణువునా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పీడిత ప్రజల అభ్యున్నతికి వారిద్దరూ అహరహం పనిచేశారు. వారి త్యాగం అసామాన్యం. వారు పిల్లల్ని వద్దనుకుని, పీడిత ప్రజలందరూ తమ బిడ్డలే అని భావించారు. పార్టీ శ్రేణులకు ఆమె మాతృమూర్తి. 1985లో సుందరయ్య కన్నుమూశాక ఆమె దగ్గర శివకుమారి దంపతులు ఉండాలని పార్టీ నిర్ణయించింది. ఆమె చనిపోయే వరకూ.. దాదాపు రెండేళ్లపాటు శివ ఆమె వద్దే ఉన్నారు. మార్చి 21న లీలమ్మ వర్ధంతి. లీలమ్మను గురించిన విశేషాలపై శివకమారిని పలకరించింది 'జీవన'. లీలమ్మతో తన జ్ఞాపకాలను ఆమె ఇలా పంచుకున్నారు...

పుస్తకాలే ఆస్తిపాస్తులు

అప్పుడు సరిగ్గా నాకు 23 ఏళ్లు ఉంటాయి. 1986 జూన్‌లో లీలమ్మ దగ్గరకు నేనూ నా భర్త ఇద్దరం వెళ్లాం. అక్కడే గొడవ అవ్వడంతో నా భర్త వెళ్లిపోయినా.. నేను మాత్రం ఆమె దగ్గరే చివరి వరకూ ఉండిపోయాను. 'పూర్తికాలం కార్యకర్తగా ఇక్కడ అంత పని ఉండదు కదా?! పని అవ్వగానే చదువుకో.. వయసులో ఉన్నప్పుడే చదవాల్సినవన్నీ దాదాపుగా చదివేయాలి' అంటూ లీలమ్మ నాతో పుస్తకాల్ని చదివించేవారు. 'నిన్ను 'శివా!' అంటూ మేమంతా శివ జపం చేయాలా? నిన్ను "శివాల్!" అనే పిలుస్తా అంటూ నన్ను "శివాల్" అనే పిలిచేవారు.

పుస్తకాలంటే అపురూపం

లీలమ్మ ప్రతి ఆరునెలలకు ఒకసారి పుస్తకాలన్నీ సర్దాలనేవాళ్లు. ఆ పుస్తకాలు సర్దే రోజుల్లో ఉదయమే టిఫిన్, వంట చేసేసుకునేవాళ్లం. ఉదయం 8.30 గంటల నుంచి 12 గంటల వరకూ సర్దేవాళ్లం. ఆమె పుస్తకాల క్రమం తప్పకుండా సర్దేవారు. ఎక్కడ ఏ పుస్తకం ఉందో ఆమెకు బాగా గుర్తు. చీకట్లో సైతం కావాల్సిన పుస్తకాన్ని తీయగలరు. సినీదర్శకుడు మధుసూదనరావు సోదరి శేషారత్నం లీలమ్మకు మంచి స్నేహితురాలు. ఆమె అప్పుడప్పుడూ వచ్చేవారు. ఆమె ఒకసారి పుస్తకాలు సర్దేటప్పుడు వచ్చి వాటిని కదపబోతే.. లీలమ్మ నిర్మొహమాటంగా 'శేషా! నీవు సాయంత్రం రా! అప్పటికి మా పని పూర్తవుతుంది' అని పంపేశారు. సాహిత్యం పట్ల, పుస్తకాల పట్ల ఆమెకు అంత శ్రద్ధ ఉండేది. ఆ ఇంట్లో సామాన్ల కన్నా పుస్తకాలే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకుని ఉండేవి.

ఎవరైనా పుస్తకాలు కావాలని అడిగితే ఇచ్చేవారు కాదు. కావాలంటే చదువుకుని వెళ్లమనేవారు. ఒకసారి డాక్టర్ ఎన్.భాస్కరరావు గారి అమ్మాయి నిర్మల చెన్నయిలో కూడా దొరకలేదని ఒక లా పుస్తకం కోసం వచ్చారు. అది సుందరయ్యగారు ఎక్కడ సంపాదించారోగానీ, అది తీసుకెళ్లి, మళ్లీ ఇస్తానంటే.. లీలమ్మ – జిరాక్స్ తీయించుకునిగానీ, రాసుకునిగానీ వెళ్లమన్నారు. ఆ రాసే పనిలో నేనూ సాయం చేశాను. పుస్తకాల్ని లీలమ్మ చాలా విలువైనవిగా భావించేవారు.


లీలమ్మతో వివాహం అయిన తొలిరోజుల్లో స్వగ్రామం వచ్చిన సుందరయ్య, తల్లి శేషమ్మ, అన్నతో..

సమయపాలన పాటించేవారు

ఆమె సమయపాలన పాటించడంలో చాలా కచ్చితంగా ఉండేవారు. శాఖ సమావేశం 12.30కి ప్రారంభమవుతుంది అంటే 11.30కి వెళ్లిపోయేవాళ్లం. ఒక్కోసారి ఆమె వెళ్లలేకపోతే, నేను ఒక్కదాన్నే వెళ్లేదాన్ని. అలా నేను మాత్రమే వెళ్లాల్సి వచ్చినప్పుడు ఎలాగో ముందెళ్లినా ఆలస్యం అవుతుందని.. పుస్తకం తీసుకుని వరండాలో కూర్చునేదాన్ని. లీలమ్మ పని అమ్మాయితో 'అక్క వెళ్లిందా?' అని ఆరా తీసేవారు. నేను అక్కడే ఉన్నానని తెలిసి, నా కారణం విని 'వాళ్లు ఆలస్యంగా ప్రారంభించినా.. మనం మాత్రం సమయానికి వెళ్లాలి. అదే క్రమశిక్షణ' అనేవారు. ఇక అప్పటి నుండి నాకు సమయపాలన పాటించడం అలవాటైంది. ఇప్పుడు నేను సిఐటియు జిల్లా కార్యదర్శిగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. నేను సమయానికి వెళ్లడంతో.. 'శివని చూస్తే గడియారం చూడక్కర్లేదు' అంటుంటారు మావాళ్లు.

తీరిక దొరికితే చాలు..

లీలమ్మకు కాస్త తీరిక దొరికితే చాలు.. ఏదో ఒక పని చేయడం అలవాటు. లీలమ్మ ఉద్యోగం చేసేటప్పుడూ సాయంత్రం ఆఫీసు నుంచి నేరుగా పార్టీ కార్యాలయానికి వచ్చి, వాల్‌పోస్టర్లు తయారుచేయడానికి పేపర్లపై చేతితో రాసేవారంట. వాటిని గోడలపై అంటించేవారమని చెప్తుండేవారు. అలాగే తన 76 ఏళ్ళ వయసులోనూ ఆమె ప్రతిరోజూ లోక్‌లహరీ, బెంగాలీ పత్రికలు చదివి అందులో నుంచి ప్రజాశక్తికి అవసరమైనవనుకున్నవి ఇంగ్లీషులోకి రాసిచ్చేవారు. ఆంధ్రాలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినా, డిగ్రీ చేసినా ఇంగ్లీషు నాలెడ్జ్ తక్కువగా ఉంటుందని లీలమ్మ అంటుండేవాళ్లు. ఆమె ఫిల్మ్ సొసైటీలో మెంబరుగా ఉండేవాళ్లు. నెలలో 25 రోజులు సినిమాలు ప్రదర్శించేవారు. ఆ సందర్భంగా లీలమ్మ ఉదయం షోకి వెళ్తుండేవారు.

మొక్కలంటే అమితమైన ప్రేమ

లీలమ్మకి మొక్కలంటే చాలా ఇష్టం. సుందరయ్య గారికి ఇష్టమని ఆయన గది కిటికీ దగ్గర రెండు సన్నజాజి తీగలు పెంచారు. ఆయన చదువుకునేప్పుడు ఆ పూల పరిమళాలు వస్తే బాగుంటుదని అలా పెంచానని చెప్తుండేవాళ్లు. ఆమెకు చమేలీ పూలు అంటే చాలా ఇష్టం. రాత్రివేళ తన తలగడ దగ్గర వాటిని పెట్టుకుని నిద్రపోయేవారు. సుందరయ్యగారి వర్ధంతి సమయానికి జెండా దిమ్మె చుట్టూ రకరకాల పూలమొక్కలు పూచేలా ఏర్పాటు చేసేవారు. వర్ధంతి రోజు జెండా ఎగరేసేవాళ్లు. ఎరువు తయారుచేసి, మొక్కలకు ఎప్పుడూ పోషణ చేస్తుండేవారు. వాళ్ల అక్క కొడుకు పెళ్లి ముంబయిలో అయితే, అక్కడికి వెళ్లి పడిపోయారు. అంత బాధలోనూ ఒక ములక్కాయలాంటిదా (పూల విత్తనా) న్ని తెచ్చారు. అది పూచే సమయానికి లీలమ్మ చనిపోయారు. ఆ మొక్కను సూర్యావతమ్మ ఇంట్లో తీసుకెళ్లి పెట్టాం. అది గుత్తులు గుత్తులుగా పూలు పూస్తే రమక్క ఫొటో తీయించారు.



ఐక్య పోరాటాలతోనే పరిష్కారం

ఒకసారి తిరువూరులో మహిళాసంఘం మహాసభలు జరిగినప్పుడు - లీలమ్మ గారిని రమ్మని స్వరూపరాణి అక్క అడిగారు. ఆమె రాలేనంటే.. మీరు అక్కడికి వచ్చి కూర్చుంటే చాలని బతిమిలాడి తీసుకెళ్లారు. ఆ సభలో క్లుప్తంగా లీలమ్మ మాట్లాడారు. 'మనకు సమస్యలు ఎక్కువవుతున్నాయి. అలాంటప్పుడే అందరం ఐక్యంగా పోరాడాలి. అప్పుడే సమస్య పరిష్కారం సులువవుతుంది' అని చెప్పారు.

మంచి అలవాట్లు

ఆమె వంట చేసేటప్పుడు సుందరయ్యగారిపై రాసిన పాటలను వింటుండేవారు. ఎవరితోనూ తన బాధను పంచుకోవడానికి ఇష్టపడేవారు కాదు. అవతలి వాళ్లు తన వల్ల బాధ పడకూడదనే అనుకునేవారు. నాకు ఎసి పడదు.. ఆమె ఆరోగ్యానికి ఎసి అవసరం. ఒకరోజు నాకు సరిపడటం లేదని ఆమె కూడా నాతో బయట పడుకున్నారు. తెల్లారేసరికి ఆమెకు తేడా చేసింది. దాంతో డాక్టర్ భాస్కరరావుగారు 'శివా! అలాంటి కామ్రేడ్స్‌ను మనం కాపాడుకోవాలి. నీవు చిన్నదానివి.. ఎసి అలవాటు చేసుకో. ఈ రోజు నుండి నువ్వు ఎసిలోనే పడుకో!' అన్నారు.

కార్యకర్తల పట్ల, ఆ కుటుంబాల పట్ల ఆమెకు ఎనలేని ఆప్యాయత ఉండేది. తెలంగాణా సాయుధ పోరాటంలో మరణించిన కామ్రేడ్స్ ఫొటోలన్నీ సేకరించి, వాటి వెనుక వారి వివరాలు రాసి, వాటన్నింటినీ భద్రంగా సూట్‌కేసులో సర్దేవారు. ఇంట్లో పనిచేసే అమ్మాయి ఎప్పుడూ ఫొటో దిగలేదంటే.. లీలమ్మ ఆ అమ్మాయిని చక్కగా రెడీ చేసి, మంచి డ్రెస్సులు వేసి, ఫొటోలు తీయించారు. పప్పుచారు, చేపలు ఫ్రై బాగా చేసేవారు. తన అలవెన్స్‌కు తగ్గట్టే బడ్జెట్ వేసేవారు. వంట మాత్రం లీలమ్మే చేసేవారు. పని అమ్మాయి రాకపోయినా, గిన్నెలు కడగటం అవీ ఆమె చేసేవారు. జక్కా వెంకయ్యగారూ ఎండు చేపలు, రొయ్యలు వంటివి తెస్తే, వాటిని చక్కగా వండి, పార్టీ సమావేశాలు జరిగేటప్పుడు బాక్సుల్లో సర్ది కామ్రేడ్స్ కోసం పంపేవారు. పాటూరు రామయ్యగారి భార్య మహాలక్ష్మిని 'నువ్వు ఆ ఆకూ వక్కా మానలేవా?' అని అడిగేవారు. డాక్టర్ రమణారెడ్డిగారి భార్య నిర్మల వస్తూ వాళ్ల అక్క వాళ్లకు పండాయని, పప్పులు, బియ్యం తీసుకొస్తే, అభ్యంతరం చెప్పేవారు. కొన్నవి కాదని ఆమె ఎంతో బతిమిలాడి ఇచ్చి వెళ్లేవారు. రాత్రివేళ పని అమ్మాయి, నేనూ, లీలమ్మ ముగ్గురం కలిసి 'అంత్య పదాలు' ఆట ఆడేవాళ్లం. పని అమ్మాయి తెలిసీ తెలియక పలికే పదాలకు లీలమ్మ ఛలోక్తులు విసిరేవారు.

నవ్వుతూ ఉండేవారు

లీలమ్మ జోకులు వింటుండేవారు. మరాఠీ జోకులు వినీ, మాకు తెలుగులో చెప్పి పడీ పడీ నవ్వేవాళ్లు. ఇంతమంచి జోకులు తెలుగులో ఉండవు అంటుండేవారు. ఒకసారి పని అమ్మాయి ఉదయం లేవడం లేదు. లీలమ్మ ఎప్పుడూ గదమాయించేవారు కాదు. మెల్లగా లేపుతూ బతిమిలాడుతూ పదిసార్లు పైనే తిరిగేవారు. లీలమ్మ అవస్థ చూసి, నేను పని అమ్మాయిని 'ఏడవుతుంది లే..' అని ఎన్నిసార్లు చెప్పినా లేవడంలేదు. దాంతో 'లేవకపోతే నీ మీద ఐస్ వేస్తా!' అంటూ వెళ్లి నా పనిచేసుకుంటున్నా. వచ్చేసరికి అమ్మాయి కనిపించలేదు. చాలా కంగారేసి, అంతా వెతికా.. లీలమ్మ అడిగితే 'బాత్రూమ్‌లో ఉందేమో?!' అన్నా.. 'నేను అక్కడి నుంచే వస్తున్నా లేదు' అన్నారు. తీరా చూస్తే అమ్మాయి మంచం కిందకు వెళ్లి పడుకుంది. 'ఎందుకలా?' అని లీలమ్మ అడిగితే.. 'అక్క లేవకపోతే ఐస్ వేస్తానంది.. అందుకనీ..' అనగానే.. లీలమ్మ పది నిమిషాలు తలుపు పట్టుకుని మరీ ఆపకుండా నవ్వారు. అది నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఎప్పుడూ మమ్మల్ని నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాళ్లు.

పెనవేసుకునే అనుబంధం

లీలమ్మ అక్క కొడుకు పెళ్లికి ముంబయి వెళుతూ విమానాశ్రయంలో పడిపోయారు. కాలు కదపలేకపోతే అక్కడ థెరిస్ అనే నర్సును ఏర్పాటు చేశారు. థెరిస్ లీలమ్మతో కలిసి విజయవాడకు వచ్చారు. లీలమ్మ చెప్పే విషయాలు, ఆమె జీవనశైలి చూశాక 'కమ్యూనిస్టులంటే ఇంత మంచివాళ్లా?!' అంటూ థెరిస్ ఎంతో ఇష్టంగా లీలమ్మకు సేవలు చేశారు. లీలమ్మకు వేయాల్సిన మందుల గురించి, చేయాల్సిన వ్యాయామాన్నీ థెరిస్సే నాకు నేర్పించారు. థెరిస్ తిరిగి వెళ్లేటప్పుడు లీలమ్మ చీరలంటే ఇష్టమంటే.. కొత్తవి తెప్పిస్తానన్నారు. 'నాకు కొత్తవి వద్దు.. మీరు కట్టుకున్నవే కావాలి' అంటూ లీలమ్మవి ఆరు చీరలు పట్టుకుని వెళ్లారు. వీల్ ఛైర్‌లోనే ఉంటున్నారని లీలమ్మ వాళ్ల అక్క కొడుకు టీవీ కోసం బ్యాంకులో డబ్బులు వేశారు. లీలమ్మ సంతకం చేసి ఇస్తే, డబ్బులు డ్రా చేయడానికని బయటకు వెళ్లాను. ఆరోజే రంగా హత్య జరిగింది. నేను బయటకు వెళ్లేసరికి బయటంతా బీభత్సంగా ఉంది. నేను సందులూ గొందులూ తిరుగుతూ డబ్బులు డ్రా చేయకుండానే ఎలాగో ఇంటికి చేరా. నేను వచ్చేవరకూ ఆమె గుమ్మం దగ్గరకూ, లోపలకూ నేనేమయ్యానోనని ఆందోళనతో వీల్ ఛైర్‌లోనే తిరుగుతూ ఉన్నారు.


1943 లో విజయవాడలో జరిగిన ప్రథమ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల్లో లీలమ్మ

చివరి క్షణాలు..

అది 1988, మార్చి 21.. లీలమ్మకు వెన్నులో నీరు తీయాలంటే నేనే ఆసుపత్రికి తీసుకెళ్లి తీసుకొచ్చాను.. ఆమె వీల్‌ఛైర్‌లోనే కూర్చునేవారు. ఆసుపత్రి నుండి వచ్చిన దగ్గర నుండి ఒకటే దగ్గు. కళ్లె బాగా వస్తుందనీ, మాటిమాటికీ వెళ్లలేరని ఒక డబ్బా పెట్టా. అలా చేయించుకోవడానికి చాలా ఇబ్బందిపడ్డారు. ఒకసారి దగ్గు ఆపుకోలేక, కళ్లె కింద పడిపోయింది. నేను శుభ్రం చేశాను. లీలమ్మ 'నీతో ఇలాంటివన్నీ చేయించుకోవాల్సి వస్తుంది..' అని బాధపడ్డారు. 'అమ్మా మీరలా బాధపడకండి. అది నా బాధ్యత' అన్నా. అయినా ఆమె ఫీలవుతూనే ఉన్నారు. ఆ రోజు దగ్గుతూనే వీల్ ఛైర్‌లోనే పక్కకు వాలిపోయారు. లీలమ్మ ఎప్పుడూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం పూర్తవ్వగానే నన్ను వెంట తీసుకుని, అక్కడకు వెళ్లాలని అనేవారు. అక్కడ పనిచేయాలనేది ఆమె తీరని కోరికగా మిగిలిపోయింది. ఆమె అపూర్వమైన ఆస్తిపాస్తుల (పుస్తకాలు) న్నీ సుందరయ్య విజ్ఞానకేంద్రంలోనే ఉన్నాయి.

సంభాషణ : శాంతిశ్రీ

మా అత్తగారికి నలుగురు కుమార్తెలు. ఒక కొడుకు. మా మామగారు చనిపోయారు. వీలునామా ద్వారా ఆయన స్వార్జిత ఆస్తి మా అత్తగారికి వచ్చింది. నా భార్య చివరి కుమార్తె, నా బావమరిది తల్లి చనిపోయిందని చెప్పి, రెవెన్యూ రికార్డుల్లో తన పేరు మార్పించుకున్నాడు. అత్తగారిని గెంటేశాడు. ఆమె మా వద్దనే ఉన్నారు. కలెక్టరుకి అర్జీ పెట్టాం. ఆర్డీవోని చూడమని చెప్పారు. ఆయన వాయిదాలు వేస్తున్నారు. మేమేం చెయ్యాలి?

- రాఘవేంద్ర, కర్నూలు.

మహిళల ఆస్తికి పూర్తి రక్షణ

న్యాయ సూత్రం

వృద్ధుల చట్టం 2007 ప్రకారం మీ అత్తగారికి రక్షణ లభిస్తుంది. ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అలా చెయ్యండి. వృద్ధురాలిగా ఆమె ఆస్థిని ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి మోసపద్ధతిలో ఎవరు తీసుకున్నా దానిని రద్దుచేసే అధికారం కలక్టరు/ట్రిబ్యునల్‌కి ఉంది.



మీకు ట్రిబ్యునల్‌లో న్యాయం జరుగుతుంది. ఒకవేళ మీకు న్యాయం జరగని పక్షంలో కోర్టులో కేసు పెట్టొచ్చు. మీ బావమరిది మీద ఛీటింగ్ (ఐపిసి 420) కింద పోలీసు కేసు పెట్టండి. నేరుగా ప్రైవేటు కేసు కిందా కోర్టులో దాఖలు చేయవచ్చు. మీ అత్తగారికి లభించిన వీలునామా ఆస్తి తిరిగి ఆమెకు దక్కిన తర్వాత, ఆమె ఇష్టప్రకారం ఎవరికైనా ఇవ్వొచ్చు. అందులో మిగతావాళ్లకి వాటాలు ఉండి తీరాల్సిన అవసరం లేదు. మహిళల పేరునగల ఆస్తికి పూర్తి రక్షణ లభిస్తుంది. అది స్వార్జితంతో సమానం. ★

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com



ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించేటప్పుడు కొద్దిగా పాలు చల్లితే ముక్కలు త్వరగా వేగడంతో పాటు రుచి కూడా పెరుగుతుంది.



జీవన సౌరభం

ఆలోచనలకు కార్యరూపం ఇవ్వటం ప్రధానం. లేకుంటే ఆలోచన ఆలోచనగానే మిగిలిపోతుంది.

ఆమెగా మారిన అతను



పదహారేళ్లకే అతని నుంచి ఆమెగా మారింది. అందుకు కుటుంబాన్ని ఒప్పించడానికి చాలా కష్టపడింది. తనపట్ల వివక్ష చూపుతున్న సమాజాన్ని ఎదిరించింది. చివరకు జీవితాన్ని గెలిచింది. ఆ విజేత కల్కి సుబ్రహ్మణ్యం. కవిగా, నటిగా, వ్యాపారవేత్తగా ఎదగడమే కాదు... సమాజంలో తనలాంటి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్న ఉద్యమకారిణి.

కల్కి ఈ స్థానానికి చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఎదుర్కొంది. ఒకవైపు శరీరం పురుషుడిది.. మనసు స్త్రీత్వాన్ని కోరుకుంటుంది. స్కూల్లో చదువుకుంటున్నప్పుడు తన స్థితి ఏమిటో తెలియని పరిస్థితి. కౌమారదశలోకి వచ్చాక... తానో మగాడిగా ఎదగడం లేదని అర్థమైంది ఆమెకు. ఇంట్లో ఎలా చెప్పాలో తెలియక చాలాసార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. ఒకరోజు ధైర్యాన్ని కూడదీసుకుని తన సమస్యను తల్లిదండ్రుల ముందుంచింది. వాళ్ళు కన్నీటి పర్యంతమయ్యారు. భవిష్యత్ గురించి భయపడ్డారు. అయితే వాళ్ల భయాన్ని గమనించిన కల్కి... తనని తానుగా వదిలేస్తే, కుటుంబ గౌరవం నిలబెడతానని మాటిచ్చింది. కల్కి మీద నమ్మకంతో చివరికి ఒప్పుకున్నారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయలేదామె.

ఓ ఫ్రెండు తన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ని అమ్మి పెట్టమని అడిగాడు. తెలిసినవాళ్లందరినీ అడిగి చూసింది. ఎవ్వరూ ముందుకురాలేదు. అప్పుడు ఆమెకు ఆన్‌లైన్‌లో పెట్టాలన్న ఆలోచన వచ్చింది. అలా కల్కి ఎంటర్‌ప్రైజెస్‌కు పునాది పడింది. వస్తున్న లాభాలు చూసి సంతోషించింది. జర్నలిజం, ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్‌డిగ్రీ చేసిన కల్కి ఇంగ్లీషు, తమిళంలో అద్భుతంగా రాస్తుంది. పదేళ్లుగా ఆమె ట్రాన్స్‌జెండర్స్ హక్కుల కోసం అనేక రచనలు చేసింది. ఆమెకు కవిత్వం అంటే కూడా ఇష్టం. కవితల సంకలనం 'కురి అరితియన్' ఆవిష్కరించింది. ఇందులోని కవితలు తనలాంటి విభిన్న మహిళల జీవితాలను ఆవిష్కరిస్తాయని చెబుతుందామె.



మనదేశంలో ట్రాన్స్‌జెండర్స్‌కు కనీస గౌరవం లేదు సరికదా సమాజం ఆమోదం లభించదు. బతుకుతెరువు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చదువు ఉండదు. ఇల్లు, వాకిలీ లేవు. అసలు రేపటి మీద నమ్మకమే ఉండదు. అలాంటి వాళ్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. ట్రాన్స్‌జెండర్లకు చట్టపరంగా గుర్తింపు కోసం ప్రస్తుతం ఆమె పోరాడుతున్నది. వారి హక్కుల కోసం ఓ వైపు న్యాయస్థానాల్లో పోరాడుతూనే, విద్యాసంస్థల్లో ట్రాన్స్‌జెండర్లు ఎలాంటి వివక్ష లేని స్వేచ్ఛా వాతావరణంలో చదువుకునే పరిస్థితుల కోసం ఉద్యమిస్తోంది. సామాజిక, న్యాయ, ఆర్థిక రంగాల్లో వాళ్ల హక్కుల కోసం పోరాడుతున్న 'సహోదరి ఫౌండేషన్' తో కలిసి పనిచేస్తోంది. 2009లో ఆమె ట్రాన్స్‌జెండర్ల కోసం ఒక మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. 2010 ఫిబ్రవరి 21న కల్కి చెన్నెయి లయన్స్‌క్లబ్ నుంచి 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్'ను అందుకుంది.

'నేను అందరిలాంటి దాన్ని కాను. అయినా.. ఎవరికంటే తక్కువ కాను. ఎప్పటికప్పుడు, అందరికంటే మెరుగ్గా, మరింత ఉన్నతంగా ఎదగడానికి ప్రయత్నిస్తాను. జీవితంలో ప్రతిక్షణం ఏదో ఒకటి నేర్చుకుంటాను' అని తనను తాను నిర్వచించుకుంటుంది. కష్టాలొచ్చినప్పుడు ఎదురొడ్డి నిలబడాలి అంటోందామె. ★

సెన్సెక్స్ ⬇ 130
33,006

నిఫ్టీ ⬇ 41
10,114

రూపాయి ⬆ 11పై॥
అమెరికా డాలరుకు రూ.
65.10



నైపుణ్యాభివృద్ధి..

గ్లోబల్ కంపెనీ సాబిక్ సిఎస్ఆర్‌లో భాగంగా 135 మంది నిరుపేద యువతకు ప్లాస్టిక్ రంగంలో పూర్తి స్థాయి శిక్షణను అందించినట్లు పేర్కొంది. బాలాసోర్, లక్నో, హైదరాబాద్ నగరాల్లోని యువతకు కెమికల్స్ మంత్రిత్వశాఖ, సిపెట్ ఆధ్వర్యంలో పూర్తి స్కాలర్‌షిప్‌తో శిక్షణ అందించినట్లు సాబిక్ సౌత్ ఏసియా వైస్ ప్రెసిడెంట్ జనార్ధనన్ పేర్కొన్నారు.



ఐటెల్ కొత్త ఫోన్లు..

మొబైల్ బ్రాండ్లలో ఒక్కటైన ఐటెల్ భారత మార్కెట్లోకి ఐటెల్ ఎస్42, ఎ44లను, ఎ44 ప్రో మోడళ్లను విడుదల చేసింది. ఈ మూడు కూడా ఫింగర్ ప్రింట్ సెన్సర్‌లతో అందుబాటులో తెచ్చినట్లు ట్రాన్సిషన్ ఇండియా ఎమ్‌డి మార్కో మా తెలిపారు. ఎస్42, ఎ44ల ధరలను వరుసగా రూ. 8,499, రూ.5,799గా నిర్ణయించారు.

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు..

సెన్సెక్స్ 130 పాయింట్ల పతనం

ముంబయి : వరుస నష్టాల నుంచి గట్టెక్కి రెండు రోజులు లాభాల్లో నమోదైన దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ చతికిల పడ్డాయి. మార్చి మాసం డెరివేటివ్స్ కాంట్రాక్టు గడువు ముగింపునకు తోడు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచనున్నట్లు వార్తలు రావడంతో మార్కెట్లు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఈ పరిణామాల మధ్య గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 129.91 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 33,006.27కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 40.50 పాయింట్లు తగ్గి 10,114,75కు క్షీణించింది. బ్యాంకింగ్, విత్త సంస్థల సూచీలు అత్యధికంగా నష్టాలను ఎదుర్కొన్నాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంకు సూచీలు రెండు శాతం మేర విలువ కోల్పోయాయి.

రంగాల వారిగా నిఫ్టీలో రియాల్టీ 1.21 శాతం, బ్యాంకింగ్ 0.47 శాతం, ఆటో 0.89 శాతం, ఐటి 0.95 శాతం చొప్పున నష్టాలను ఎదుర్కొన్నాయి. కాగా లోహ సూచీ మాత్రం 0.32 శాతం పెరిగింది. సెన్సెక్స్-30లో ఎస్‌బిఐ 2.58 శాతం, విప్రో 2.32 శాతం, మారుతి సుజుకి 2.11 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.07 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.98 శాతం, అదానీ పోర్ట్సు 1.62 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. మరోవైపు ఒఎన్‌జిసి 2.45 శాతం, ఇండుస్ఇండ్ బ్యాంకు 1.41 శాతం, రిలయన్స్ 1.31 శాతం, టాటా మోటార్స్ 1.23 శాతం, సన్ ఫార్మా 0.85 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.56 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

సిఎడి మూడు రెట్లు పెరుగొచ్చు

ఇక్రా అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత కరెంట్ ఎకౌంట్ లోటు (సిఎడి) మూడు రెట్లు పెరిగి 10-12 బిలియన్ డాలర్లకు చేరొచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా అంచనా వేసింది. అధిక వాణిజ్య లోటుతో ఈ పరిస్థితి చోటు చేసుకోనుందని పేర్కొంది. జిడిపిలో సిఎడి 13.5 బిలియన్ డాలర్లతో రెండు శాతానికి చేరనుందని తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపిలో సిఎడి 8 బిలియన్ డాలర్లతో 1.4 శాతంగా ఉంది. ఇక్రా అంచనాల ప్రకారం 2017-18లో మొత్తంగా సిఎడి 46-48 బిలియన్ డాలర్లకు ఎగియనుంది. ఇది జిడిపిలో 1.8 శాతంగా ఉండనుంది.

2016-17లో 15.2 బిలియన్లతో 0.7 శాతంగా ఉంది. 2018-19లో భారత ఎగుమతులు 335-340 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకునే అవకాశం ఉంది. ఇదే సమయంలో దిగుమతులు 505-510 బిలియన్లుగా ఉంది. దీంతో భారత వాణిజ్య లోటు 170-175 బిలియన్ డాలర్లకు చేరనుందని ఇక్రా అంచనా వేసింది. 2018-19లో 45-50 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు నమోదు కావొచ్చు. 2018లో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 64-66గా ఉండొచ్చు.

ఆర్‌కామ్‌కు షాక్

- అంబానీ బ్రదర్స్ డీల్‌కు చుక్కెదురు
- స్టే కొనసాగించిన సుప్రీం
- వచ్చే నెలలో తదుపరి విచారణ
- పడిపోయిన షేర్ విలువ



ఫైల్ ఫోటో

న్యూఢిల్లీ : అంబానీ అన్నదమ్ములకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు చెందిన ఆస్తులను ముఖేష్ అంబానీ కొనుగోలు చేయాలని గతేడాది నిర్ణయించారు. ఆర్‌కామ్ ఆస్తులను రిలయన్స్ జియోకు విక్రయించకుండా బాంబే హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం గురువారం నిరాకరించింది. దీనిపై మళ్లీ విచారణ జరిపేంత వరకు బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పు కొనసాగుతుందని స్పష్టం చేసింది. తద్వారా తన అనుమతిలేనిదే ఈ డీల్‌ను పూర్తి చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 5కు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ పరిణామంతో బిఎస్ఇలో ఆర్‌కామ్ షేర్ 5.36 శాతం పతనమై రూ.23.85కు పడిపోయింది.

తీవ్ర అప్పుల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ ఆ భారాన్ని తగ్గించుకునేందుకు తన ఆస్తులను ముఖేష్ అంబానీకి చెందిన జియో ఇన్ఫోకామ్‌కు విక్రయిస్తున్నట్లు గతేడాది డిసెంబరులో ప్రకటించింది. సుమారు రూ.39వేల కోట్ల రుణభారాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా తన వైర్‌లెస్ స్పెక్ట్రం, టవర్, ఫైబర్, మీడియా కన్వర్జెన్స్ నోడ్ (ఎంసిఎన్) ఆస్తులను జియోకు విక్రయించనున్నట్టు ఆర్‌కాం ప్రకటించింది. ఈ మేరకు అంబానీ సోదరులు అనిల్, ముఖేశ్‌ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అయితే దీనిపై ఎరిక్సన్ సంస్థ ఆర్బిట్రేషన్ కోర్టుకు వెళ్లింది. తమ బకాయిలు చెల్లించకుండా ఆస్తులు విక్రయిస్తున్నారని ఆరోపించింది. ఆర్‌కాం నుంచి తమకు రూ.1,000 కోట్లకు పైగా బకాయి రావాల్సి ఉందని ఎరిక్సన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీంతో అనుమతులు లేకుండా రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆస్తులు అమ్మరాదని ఆర్బిట్రేషన్ కోర్టు ఆదేశించింది. దీంతో ఆర్బిట్రేషన్ తీర్పుపై ఆర్‌కామ్ బాంబే హైకోర్టును ఆశ్రయించగా ఆ కోర్టులోనూ ఆస్తులు విక్రయించకుండా స్టే విధించింది.

కాగా ఆర్‌కామ్‌కు మద్దతుగా నిలిచిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ట్రిబ్యునల్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆస్తుల అమ్మకానికి అనుమతి నివ్వాల్సిందిగా కోరింది. దీనిపై స్పందించిన అత్యున్నత న్యాయ స్థానం ముంబై హైకోర్టు తీర్పును సమర్థిస్తూ సుప్రీం ధర్మాసనం ఎకె గోయల్, ఆర్‌ఎఫ్ నారిమన్, యుయు లలీత్ తాజా ఆదేశాలిచ్చింది. దీంతో ఆర్‌కామ్ మళ్లీ చిక్కుల్లో పడినట్లయ్యింది. ఎస్‌బిఐ కన్సోరియంలోని బిఒబి, బిఒఐ, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పిఎన్‌బి, ఐడిబిఐ బ్యాంకు, యూకో బ్యాంకు, ఐఒబి, దేనా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, యూనైటెడ్ బ్యాంకు, ఎల్ఐసి, బార్‌క్లేస్ బ్యాంకు తదితర 24 విత్త సంస్థలు ఆర్‌కామ్‌కు అప్పులిచ్చిన వాటిలో ఉన్నాయి.

ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రమ్, మొబైల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, మీడియా కన్వర్జన్స్ నోడ్స్‌ను (ఎంసిఎన్) జియో ఇన్ఫోకామ్ కొనుగోలు చేయాలని గతేడాది ముగింపులో నిర్ణయించింది. ఆ సమయంలో ఇరు కంపెనీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. కాగా డీల్ ఆర్థిక వివరాలను వెల్లడించనప్పటికీ, దీని విలువ రూ.24,000-25,000 కోట్ల శ్రేణిలో బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ ఆస్తుల విక్రయం రూ.45,000 కోట్ల రుణ భారంతో కుదేలైన ఆర్‌కామ్‌కు ఊరట లభిస్తుందని భావించాయి. 2018 మార్చి ముగింపు నాటికి ఈ ఒప్పందాన్ని పూర్తి చేయాలని ఇరు సంస్థలు నిర్ధేశించుకున్నాయి. తాజాగా కోర్టుల ఉత్తర్వుల వల్ల మరింత ఆలస్యం కానుందని తెలుస్తోంది.

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

ఎల్ఐసికి భారీ నష్టం

న్యూఢిల్లీ : గత కొద్ది రోజులుగా వరుసగా పడిపోతున్న స్టాక్ మార్కెట్ల వల్ల దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ ఎల్ఐసి భారీగానే నష్టపోయింది. ముఖ్యంగా 53 ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాల వల్ల ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు రూ.20,000 కోట్ల నష్టాలు వాటిలినట్లు సమాచారం. 2018లో ఇప్పటి వరకు ప్రతీ 10 పిఎస్‌యుల్లో తొమ్మిది పిఎస్‌యులు దాదాపుగా 40 శాతం వరకు మార్కెట్ విలువను నష్టపోయాయి. ప్రధానంగా కార్పొరేషన్ బ్యాంకు, భెల్, పంజాబ్ నేషనల్ బ్యాంకులు 19 శాతం వరకు నష్టపోయాయని కాపిటలైన్ పేర్కొంది. కోల్ ఇండియా, సెంట్రల్ బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకు సూచీలు నష్టాలను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా పిఎన్‌బి కేసు వల్ల బ్యాంకుల సూచీలు దెబ్బతినడంతో ఎల్ఐసి ఎక్కువగా నష్టపోయింది.

ఆన్‌లైన్‌లో అద్దెకు ఎసి, కూలర్లు

హైదరాబాద్ : వేసవి కాలం నేపథ్యంలో గ్రాబ్ ఆన్ రెంట్.కమ్ అద్దెకు ఎసిలు, కూలర్లు అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. నెలకు రూ.799-రూ.2049 శ్రేణీ అద్దెతో ఈ ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఈ సేవలు హైదరాబాద్, బెంగళూరు, ముంబయి తదితర నగరాల్లో తొలుత అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. రిఫ్రిజిరేటర్లను కూడా అద్దెకు ఇస్తున్నట్లు తెలిపింది. అన్ని ప్రముఖ బాండ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.ల

ఉత్తమ

S.S.C. MODEL PAPER

GENERAL SCIENCE PAPER-2

ప్రాక్టీస్ బిట్ పేపర్లు

PART - B

Time : 30 mts Marks :10

Note : 1. Answer all the questions
2 Each question carries 1/2 mark.
3. Write answers using CAPITAL LETTERS in the question paper itself.
4. Marks will not be awarded in case of overwriting or erased answers.

Choose the correct answer from the following and write the letter in the brackets given below. 20 × 1/2 = 10

14. The energy stored in one ATP ( )
a) 72 cal b) 7200 cal
c) 7000 cal d) 720 cal

15. Match the folowing ( )

Disease	Vitamin
1. Glossitis	A) B3
2. Pellagra	B) B2
3. Rickets	C) D

a) 1-A, 2-B,3-C b) 1-B,2-A,3-C
c) 1-A, 2-C,3-B d) 1-C,2-B,3-A

16. This symbol denotes that ( )



a) UNDP
b) Percolatetoin pits
c) sustainable development
d) Reclycling log

17. Gopi's heart beat is 72 his pulse rate is ( )
a) 72 b) 71
c) 27 d) 70

18. Diabetes is related to this gland ( )
a) Thyroid b) Adrenal
c) pituitary d) pancreas

19. observe the given statements a and b ( )
A) All the family members have identical characters
B) Differences in charcter with in every closely related groups of organisms are refered to as variation.
a) A is false B is true
b) A is true B is false
c) A and B both are true
d) A and B both are false

20. Ovary → [ ] → ovum → ovulation. What will be in the box. ( )
a) ovary b) Testis
c) Graffian follicle d) cavity of ovule

21. The Urine has amber colour due to ( )
a) bilirubin b) Urochrome
c) biliverdin d) chlorides



22. this is a ( )
a)sensory neuron b) Motor neuron
c) Mixed nerve d) controle nerve

23. wild animal conservation act was passed in the year. ( )
a) 1991 b) 1981 c) 2001 d) 1972

24. Human organism is on internal combustion machine because of ( )
a) Assimilation of energy from food
b) expel waste food at the end state digestion
c) liberate Co2 during respiration
d) Secrete powerful digestive juices

25. Cluster of air sacs in lungs are called ( )
a) Alveoli b) bronchi
c) branchioles d) air spaces

26. Fibrinogen —Thrombin→ Fibrin.This equation indicates. ( )
a) blood changing b) bood transfusion
c) releasing of enzymes d) coagulation

27. Which of the following is the correct sequence of steps in the human life cycle. ( )
a) childhoood-Babyhood-adulthood-adolescense
b) babyhood-childhood-adolesence-adulthood
c) Adolescence -babyhood-adulthood-childhood
d) None of these

28. A farmer introduced lizards in his field. The phenomenon is ( )
a) The method of environmental ethics
b) Bio-magnification
c) Bio-control
d) Bio-accumulation

29. The Correct path taken by urine in human body ( )
i) kidneys ii) Urethra
iii) penis iv) Urinary bladder
a) i,ii,iv,iii b) i,ii, iii , iv
c) iv,iii, i, ii d) ii, iii, i, iv

30. A plant is kept in dark cupboard for about forty eight hours before conducting any experiment on photosynthesis in order to ( )
a) remove chlorophyll from leaves
b) ensure that photosynthesis occured
c) ensure that leaves are freefrom thestarch
d) Remove starch from leaves.

31. sphincter that helps in opening of stomch in to duodenum.
a) cardiac b) pyloric c) Anal d) Gastric

32. The scientist who proved incorrectness of the theory of lamark by cutting the tails of rats. ( )
a) Huxlee b) A.R. Wallace
c) Augustus weismass d) Charles dar win

33. To save house hold fuel ( )
A) Soak the food material before boiling/cooking
B) pressure cooker is good for cooking
a) A, B both are correct
b) A correct B wrong
c) a worng, b Corect
d) A,B both are wrong.

PART - B (2)

Time : 30 mts Marks :10

Note :1. Answer all the questions
2 Each question carries 1/2 mark.
3. Write answers using CAPITAL LETTERS in the question paper itself.
4. Marks will not be awarded in case of overwriting or erased answers.


Choose the correct answer from the following and write the letter in the brackets given below. 20 × 1/2 = 10

14. Leaf movement in mimosa helps to( )
a) Reduce photosynthesis
b) protect from greazers
c) releasing phytohormones
d) regulate its growth

15. Respiration is a catabolic process because of ( )
a) breakdown of complex food molecules
b) conversion of light energy
c) synthesis of chemical energy
d) energy storage

16. The Sexual chromosomes will be represented as ....in males, and as ....in femals. ( )
a) xx, yy b) yy,xx
c) xxx, xy d) xy, xx

17. The given picture depicts ( )



a) Various reactions in stomach
b) the structure of oesophagus
c) The peristaltic movement of food
d) the structure of small intestine


18. on which side of the human heart is low in oxygen ( )
a) Right atrium b) right ventricle
c) left ventricle d) a & b

19. PH condition of stomach is .... ( )
a) Alkaline b) neutral
c) salty d) Acidic

20. Ban all pesticides this means that ( )
a) control on usage pesticides
b) prevention of pesticides
c) promote eco friendly agricultural practices
d) stop bio chemical factories

21. consider the statements A & B ( )
A) vasa efferentia forms epididymis
B) sperms are produced in millions
a) both A & B are false
b) A is true, B is false
c) B is true, A is false
d) both A & B are true

22. Given picture is a part of the epidermis of the leaf what is the name of P ? ( )



a) palisade tissue b) Xylum cell
c) Guard cell d) spongy cell

23. In our country which state stands first in the utilization of solar energy ( )
a) Gujarat b) Andhra Pradesh
c) Tamilnadu d) Telangana

24. Match the following ( )

List-A	List-B
1.Pellagra	a) Beriberi
2.Thiamine	b) Vitamin-C
3.scurvy	c) Niacin

a) 1-c, 2-b, 3-a b) 1-c, 2-a, 3-b
c) 1-a, 2-c, 3-b d) 1-b, 2-a, 3-c

25. Which of the following shows hypertension ( )
a) 120/80 b) 80/160 c) 160/90 d) 110/70

26. Observe the given table. The phenotypic ratio is ( )

	T	t
T	TT	Tt
t	tT	tt

a) 1:2:1 b) 2:1
c) 3:2 d) 3:1

27. Fixed gas =CO2::Vitiated gas=..........? ( )
a) Carbonate b) Oxygen
c)Nitrogen d) Hydrogen

28. Match the following ( )

List-A	List-B
1.Cinchona	a) Scopolamine
2.papaver	b) Morphine
3.Datura	c) Quinine

a) 1-a, 2-b, 3-c b) 1-c, 2-b, 3-a
c) 1-b, 2-a, 3-c d) 1-b, 2-c, 3-a

29. Find the correct statement ( )
a) When we send yeastcells in sugar solution ethanol is formed.
b) When we send yeast into sugar solution with co2 then ethanol is formed .
c) yeast+sugar solution+lactic acid results in the formation of ethanol.
d) When we send yeast into sugar solution in absence of O2ethanol is formed

30.The predators which will be grown by the forest ers to prevent the rabbits
a) owls b) Foxes
c) badger d) all the above

31.Palaeontologist deals with ( )
a) Fossil evidences
b) Embrryological evidences
c)vestigial organ evidences
d) all the above

32. Any type of plant or animal material that can be converted into energy is called( )
a) Bio energy b) Bio mass
c) Bio evolution d) Bio-pyramid

33. AIDS stands for ( )
a) Acquired Immuno Deficiency Syndrome
b) Acquired Immuno Diseagable Syndrome
c) Appendix Intestian Deficiency System
d) Aporthable Intencifide Diseases System

Part -B (1) (Answers)

14. B 15.B 16.C 17. A
18. D 19. A 20. C 21.B
22. A 23. D 24. C 25. A
26. D 27. B 28. C 29. A
30. D 31. B 32.C 33. A

Part -B (2) (Answers)

14. B 15.A 16. D 17. C
18. D 19. D 20. C 21. D
22. C 23. A 24. B 25. C
26. D 27. B 28.B 29. D
30. D 31.A 32.B 33. A

భగత్‌సింగ్ స్ఫూర్తితో హోదా ఉద్యమం

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో ఎపికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, విభజన చట్టంలోని హామీల సాధనకు యువత ఉద్యమించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నగర కమిటీల ఆధ్వర్యాన ఆర్కే బీచ్‌లోని కాళీమాతా టెంపుల్ నుంచి వైఎంసిఎ దగ్గర ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వరకు గురువారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో భగత్‌సింగ్ పాత్ర మరువలేనిదన్నారు. ఆయనిచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో ఆనాడు యువత పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. నాడు బ్రిటిష్‌వారిపై ఆయన చూపిన తెగువను నేడు మతోన్మాద పాలకులపై యువత చూపాలని పిలుపునిచ్చారు. బిజెపి, టిడిపిలు



ఎపికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, విభజన హామీల కోసం ఉద్యమించాలని విశాఖ బీచ్ రోడ్డులో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

విభజన హామీల అమల్లో కేంద్రం విఫలం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి - మన్యం జీపుజాతా ప్రారంభం

ప్రజాశక్తి-అనంతగిరి (విశాఖపట్నం)

విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు మన్యంలో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన జీపుజాతాను విశాఖ జిల్లా అనంతగిరి మండలం, కాశీపట్నంలో గురువారం కృష్ణమూర్తి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌లపై సిబిఐ కేసులున్నాయని, అందుకే వారు బిజెపికి తలొగ్గారని విమర్శించారు. ఎపికి జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికే ఈ జీపుజాతాను చేపట్టినట్లు చెప్పారు. హోదాపై సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, విశాఖకు రైల్వేజోన్ వంటి హామీలు నెరవేర్చడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు డి.గంగరాజు, మండల కార్యదర్శి కె.మొశ్య తదితరులు పాల్గొన్నారు. మరో వైపు బుధవారం అనకాపల్లిలో ప్రారంభమైన మరో జీపుజాతా గురువారం పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సాగింది.

పైపు లైన్లను మారుస్తున్నాం

మంత్రి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో డ్రెయిన్ల పక్కనున్న తాగునీటి పైపులైన్లను మారుస్తున్నామని, గుంటూరు నగరం ఆనందపేటలో 22 కిలోమీటర్లలోని పైపులైన్లను నెలాఖరులోపు మారుస్తామని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. పాతగుంటూరు పరిధిలోని అతిసార ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పుల్లారావు, కమిషనర్ శ్రీకేష్ బి లత్కర్‌తో కలిసి ఆయన గురువారం పర్యటించారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభావిత ప్రాంతాల్లో నిత్యం సమీక్షిస్తూ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. 100 కిలోమీటర్ల పరిధిలోని నీటి పైపులైన్లను మారుస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కడప

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 59వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో న్యాయవాదులు పయ్యావుల వేణుగోపాల్, ఎం.పుల్లయ్య, కె.నాగరాజు, దేవరశ్రీక్రిష్ణ, ఆర్.సుందర్‌రాజ్ కూర్చున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పులికుంట ప్రమోద్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థకు అద్దంపట్టేలా జిఎస్‌టి

ఆకట్టుకుంటున్న నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వ్యసనాలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో కుటుంబాన్ని పట్టించుకోకుండా కుటుంబ యజమాని వ్యవహరించడంతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయి. మగాడి సంపాదనలో 20 శాతం జీతం భార్య అకౌంట్‌లో వేసేలా పార్లమెంట్‌లో బిల్లు ఉండాలని, కుటుంబాన్ని నెట్టుకొచ్చే గృహిణికి సర్వీస్ ట్యాక్స్‌లా జీతంలో కొంతశాతం ఇస్తే తప్పేంటి అనే సారాంశంతో రూపొందించిన జిఎస్‌టి నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్, దంటు కళా క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నంది నాటకోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముదునూరి ప్రసాదమూర్తి మెమోరియల్ ఆర్ట్స్ కాకినాడ సమర్పణలో జిఎస్‌టి నాటిక దండు కృష్ణంరాజు సమర్పణలో గురువారం ప్రదర్శించి మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు.రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న నాటికలు గురువారంతో ముగిశాయి.

విఆర్‌ఎల మహాధర్నా

విజయవాడలో భారీ ర్యాలీ - వేతన పెంపు జీవో జారీకి డిమాండ్

- పస్తులతో ఎలా బతకాలి
- సిఐటియు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎలు) తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతమైంది. వేతన పెంపు జీవో విడుదల చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రమోషన్ కోటా 70 శాతం పెంచాలని, రిటైర్డ్ విఆర్‌ఎలకు పెన్షన్ ఇవ్వాలని, పే స్కేలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. రాష్ట్రం నలుమూలల నుంచీ తరలి వచ్చిన విఆర్‌ఎలు విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు పెద్ద ఎత్తున నినదిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. అనంతరం అలంకార్ సెంటర్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎపి విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ పెద్దన్న అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ మహాధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ విఆర్‌ఎలు చాలీచాలని జీతాలతో, పస్తులతో ఎలా బతకాలని ప్రశ్నించారు. విఆర్‌ఎల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెట్టి చాకిరి చేస్తున్న వీరికి జీతాలు ఎందుకు పెంచట్లేదని ప్రశ్నించారు. జిల్లాల నుంచి ధర్నాకు వస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారన్నారు. వేతనపెంపు జీవోను చంద్రబాబు ఎందుకు ఆమోదించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు సబ్సిడీలు ఇస్తారు కానీ కష్టజీవులకు వేతనాలు పెంచరా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటుందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాల్ని అనుసరిస్తున్న టిడిపి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. విఆర్‌ఎల డిమాండ్ల పరిష్కారానికి సిఐటియు మద్దతు ఉంటుందన్నారు. విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న మాట్లాడుతూ వేతనాల పెంపు ప్రతిపాదనల ఫైల్ రెవెన్యూ శాఖ మంత్రి నుంచి సిఎం వద్దకు చేరి 3 నెలలు కావస్తున్నా ఎందుకు సంతకం చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశి, ఉపాధ్యక్షులు జి ధైర్యం, అప్పలస్వామి, వీరభద్రరావు, మీసాల కృష్ణమూర్తి, బొడ్డు వెంకటరత్నం, పాతూరి ప్రభాకరరావు, రాధాకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు వివేకానంద, మధుకృష్ణ, రాష్ట్ర నాయకులు సత్యరాజు, జయరాజు, ఆంజనేయులు, రోశయ్య, సుబ్బారావు, రాజు, సంఘయ్య, హజరత్తయ్య, అల్లబకాశ్, శివ, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ధర్నాకు సంఘీభావం తెలిపారు.



విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు పెద్ద ఎత్తున నినదిస్తూ భారీ ర్యాలీ చేపట్టిన విఆర్‌ఎలు

సిఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటా
రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్‌సింగ్

విఆర్‌ఎల ప్రతినిధి బృందం సచివాలయంలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్‌సింగ్‌ను కలిసింది. వేతనాల పెంపు విషయం సిఎంతో మాట్లాడతామని, విఆర్‌ఎలకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇస్తామని, అర్హులకు ప్రమోషన్స్ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

విశ్వవిద్యాలయాల్లో లౌకిక విలువలు కాపాడాలి

దళిత బహుజన మేథావుల ఫోరం అధ్యక్షుడు ఎన్.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)

విశ్వవిద్యాలయాల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కాషాయీకరణ పద్ధతులను అడ్డుకుని లౌకిక విలువల్ని కాపాడాలని దళిత బహుజన మేథావుల ఫోరం అధ్యక్షుడు ఎన్.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, హిందూభావజాలం కలిగిన ప్రధాని మోడీ నాయకత్వంలో కేంద్ర విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న యూనివర్శిటీలలో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ల నియామకాలలో కాషాయ అనుకూల వ్యక్తులకు ప్రాధాన్యత గల పోస్టులు ఇప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. దీంతో విద్యా వ్యవస్థలో మతతత్వ భావజాలం పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత, దళిత క్రైస్తవ, అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లను నియమించి అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులను, మంత్రులను. ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రాలు అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫోరం నాయకులు జోసఫ్ తంబి, చరబండ.రాజు, జి.శివకుమార్, కె.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువకు గండి

ప్రజాశక్తి- పెనుకొండ రూరల్

అనంతపురం జిల్లా పెనుకొండ మండలం కోనాపురం గ్రామ సమీపంలో 54వ ప్యాకేజీ కింద ఉన్న హంద్రీనీవా కాలువ బుధవారం రాత్రి తెగిపోయింది. నీరు వేగానికి నిర్మాణంలో ఉన్న కాలువ బ్రిడ్జి కూడా సగభాగం కూలిపోయింది. ఈ నెల 16న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా కాలవ ద్వారా నీటిని విడుదల చేశారు. విడుదల చేసిన మరుసటి రోజే హరిపురం వ్యవసాయ పొలాల్లో లిఫ్ట్ ఎత్తకపోవడంతో కాలువకు గండిపడింది. దీంతో వందల క్యూసెక్కుల నీరు వృథా అయింది. ఇది మరువక ముందే కోనాపురం గ్రామసమీపంలో 54వ ప్యాకేజీలో రూ.20 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. అక్కడ కాలువకు గండిపడి తెగిపోయింది. అంతేగాక బ్రిడ్జికూడా కుప్పకూలింది. కాలువ ద్వారా గండిపడి నీరు వృథాతో పాటు జనరేటరు, సామగ్రి తదితర పరికరాలు కొట్టుకుపోయాయి. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి ఇంకా క్యూరింగ్ కావాలని గుత్తేదారుడు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రారంభంలో ఇలా నీరు వృథా అవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం వరకు లిఫ్టులు, బ్రిడ్జీలు అధికంగా ఏర్పాటు అవుతున్నాయి. వీటిని పరిశీలించకుండానే హడావిడిగా నీటిని విడుదల చేశారు. 54వ ప్యాకేజీ హంద్రీనీవా డిప్యూటీ ఇంజనీర్ నారాయణ నాయక్ మాట్లాడుతూ 54వ ప్యాకేజీ కింద పనులు జరుగుతున్నాయని, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలన్న ఉద్దేశంతో పనులు పరిశీలించకుండానే నీటిని విడుదల చేశారని తెలిపారు.

సిపిఎం పాదయాత్రకు అపూర్వ స్పందన

9 రోజులు.. 200 కిలోమీటర్లు..

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖకు రైల్వేజోన్ కేటాయించాలంటూ సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రకు వాడవాడలా విశేష స్పందన లభిస్తోంది. కేంద్రం మెడలు వంచేందుకు చేపట్టిన ఈ పోరాటానికి తామూ కలిసొస్తామని ప్రజలు గొంతు కలిపారు. నగర వ్యాప్తంగా 9 రోజులపాటు 200 కిలోమీటర్లు సాగనున్న ఈ పాదయాత్ర అడవివరం ప్రధాన కూడలి వద్ద రెండో రోజు ప్రారంభమైంది. సింహాచలం కూడలి వద్ద ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాల్సిన కేంద్రం రాష్ట్ర ప్రజలను మోసగించిందన్నారు. టిడిపి రోజుకోమాట చెబుతూ ప్రజలను గందరగోళ పరుస్తోందని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకూ రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా కోసం రానున్న కాలంలో మరింత ఉధృత పోరాటాలు నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం పాదయాత్ర వేపగుంట, నాయుడు తోట, కృష్ణా నగర్, దుర్గా నగర్, బంటా కాలనీ, అప్పల నర్సయ్య కాలనీ, బిసి కాలనీ, వెంకటసాయి నగర్, గోపాలపట్నం, శ్రీరాంనగర్ మీదుగా సాగి కాకానినగర్‌లో ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు డి.అప్పలనాయుడు, బి.వెంకటరావు, పి.వెంకటరెడ్డి, బి.రమణి పాల్గొన్నారు.

గీతం వర్సిటీకి 'అటానమీ హోదా'

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఉన్నత విద్యారంగంలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నందుకుగాను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి 'అటానమీ' (స్వయం ప్రతిపత్తి) హోదాను కల్పించిందని, కేటగిరి '1' విద్యా సంస్థగా గుర్తింపు ఇచ్చిందని గీతం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్ఎస్.ప్రసాదరావు వెల్లడించారు. విశాఖలోని గీతం దూర విద్యా కేంద్రం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజుతో కలిసి ఆయన వివరాలు తెలియజేశారు. యుజిసి దేశవ్యాప్తంగా 60 విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో గీతం కేటగిరి 1 కింద ప్రతిపత్తి హోదా పొందిందని చెప్పారు. 2007 సంవత్సరంలో డీమ్డ్ విశ్వవిద్యాలయం హోదాను స్వీకరించిన గీతం విశాఖతో పాటు హైదరాబాద్, బెంగళూరులలో ప్రాంగణాలను నెలకొల్పిందని, 190 యుజి, పీజీ కోర్సులను నిర్వహిస్తోందని తెలిపారు. అటానమీ హోదా ద్వారా ప్రసిద్ధి చెందిన విదేశీ విద్యాలయాలతో కలిసి సంయుక్త కోర్సుల నిర్వహణకు మార్గం ఏర్పడుతుందని తెలిపారు. త్వరలో రష్యాలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన సెయింట్ పీటర్స్ బర్గ్ మెరైన్ టెక్నికల్ విశ్వవిద్యాలయంతో కలిసి నౌకా నిర్మాణం, సముద్ర వాహన నౌకల తయారీపై కోర్సులు నిర్వహించనున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు.

గోడ కూలి ఇద్దరు కూలీలు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్ (విజయనగరం జిల్లా)





విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కారాడ గ్రామంలో ఇంటి గోడ కూలి ఇద్దరు కూలీలు మృతి చెందారు. మరొకరికి కాలు విరిగింది. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కారాడ గ్రామానికి చెందిన చొక్కాపు శివున్నాయుడు ఇంటి పనికి మత్తాయివలసకు చెందిన 12 మంది కూలీలు వచ్చారు. ఇంటి నిర్మాణంలో భాగంగా ఫిల్లర్ల కోసం ఐదడుగుల లోతులో గోతులను తీస్తుండగా పక్కనే ఉన్న మరో ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో శింగారపు జగన్నాథం (45), దమలపాటి శ్రీరాములు (60) అక్కడకక్కడే మృతి చెందారు. జమ్ము పరుశురామ్‌కు కుడి కాలు విరిగిపోయింది. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. పరుశురామ్‌ను 108 వాహనంలో బొబ్బిలి సిహెచ్‌సికి తరలించారు. ఎస్ఐ అమ్మినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

17 మందికి గాయాలు

ప్రజాశక్తి- కంచిలి, లావేరు (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. 17 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... కంచిలి మండలం కాకర్లపుట్టుగకు చెందిన కె.రాఘవయ్య (45), అతని మేనల్లుడు పి.రాము (35) ద్విచక్ర వాహనంపై కత్తివరం రోడ్డు మీదుగా కంచిలి వస్తున్నారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి దాని వెనుక వస్తున్న ట్రాలీని ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పొదల్లో పడిపోయారు. వారి తలలకు తీవ్ర గాయాలు కావడంతో సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విజయనగరం నుంచి శ్రీకాకుళం వైపు 32 మంది ప్రయాణికులతో వస్తున్న ఆర్‌టిసి బస్సు లావేరు మండలంలోని బుడు మూరు వద్ద జాతీయ రహదారిపై లారీని ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్రంగానూ, మరో పది మందికి స్వల్పంగానూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాకుళంలోని రిమ్స్, కిమ్స్ ఆస్పత్రులకు తరలించారు.

26 నుంచి ఎపి సెట్ దరఖాస్తుల స్వీకరణ

-మే 2న తుది గడువు- జులై 1న పరీక్ష

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలకు నిర్వహించే అర్హత పరీక్ష ఎపి సెట్-2018కు ఈ నెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎపి సెట్ నిర్వహిస్తున్న ఆంధ్ర యూనివర్సిటీ గురువారం ప్రకటన విడుదల చేసింది. రిజిస్ట్రేషన్ రుసుము రూ.1,000, బిసిలు రూ.800, ఎస్సీ,ఎస్టీలు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. మే 2వ తేదీ దరఖాస్తులు స్వీకరించడానికి తుది గడువు. రూ.1,000 అపరాధ రుసుముతో మే 10 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో మే 21 వరకు, రూ.5,000 అపరాధ రుసుముతో జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జులై ఒకటవ తేదీన ఎపి సెట్ పరీక్ష ఉంటుంది. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, అనంతపూర్, తిరుపతి కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. యుజిసి గుర్తించిన 31 సబ్జెక్టులకు పరీక్షలుంటాయి. పేపర్-1 లాంగ్వేజ్ అందరికీ కామన్‌గా ఇంగ్లిష్, తెలుగు ఉంటుంది. పేపర్-2 కామర్స్, ఎకనమిక్స్, ఎడ్యుకేషన్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, సోషల్ వర్క్‌లు ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఉంటాయి. మిగతా పేపర్లన్నీ ఇంగ్లిష్‌లో మాత్రమే ఉంటాయి. యుజిసి-సిఎస్ఐఆర్, యుజిసి-నెట్ సిలబస్‌పై పరీక్ష పత్రాలు ఉంటాయి. పరీక్షలు పేపర్-1 ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, పేపర్-2 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయి.

ప్రజ్ఞ

జవాబులు

1.ఝార్ఖండ్‌లోని దేవ్‌ఘర్ జిల్లాలో (150 ఎకరాలు)
2. అతుల్ ఎం. గోత్సర్వే
3. మధ్యప్రదేశ్, 4. మార్చి 21
5. డెహ్రాడూన్

చోరీ

ఎటిఎంలో దొంగలు పడ్డారు

చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి - బుచ్చిరెడ్డిపాళెం

ఎటిఎంలో దొంగలు పడ్డారు..చోరీకి విఫలయత్నం చేశారు. చివరికి డబ్బులు రాకపోవడంతో నగదు బాక్స్‌ను పగులగొట్టేందు కు యత్నించారు..శతవిధాలుగా ప్రయత్నించి చివరాకరుకు విఫలయ్యారు. ఈ ఘటన పట్టణ శివారులోని కెనరా బ్యాంకు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది.

బ్యాంకు సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని గ్లోబల్ స్కూల్ పక్కన కెనరా బ్యాంకు ఉంది. బ్యాంకుకు అనుసంధానంగా ఎటిఎం ఉంది. బ్యాంకు పనివేళలు ముగిశాక సిబ్బంది వెళ్లిపోయారు. ఉదయం వచ్చి చూడగా ఎటిఎంలోని మిషన్ రోడ్డు మీద ఉంది. స్థానికులు బ్యాంకు సిబ్బందికి సమాచారం అందించగా..వారు వచ్చి పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందిం చారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజరు మురళీ మాట్లాడుతూ ఎటిఎంలో రూ.10 లక్షల వరకూ నగదు నిల్వలు ఉండొచ్చని తెలిపారు. చోరీకి యత్నించిన దొంగలు ఎటిఎంలోని సిసి కెమెరాలను ధ్వంసం చేసి నగదు బాక్సును బలవంతంగా తెరిచేందుకు యత్నించినట్లు తెలిపారు. బాక్సు తెరుచుకోక పోవడంతో ఎత్తు కెళ్లేందుకు ప్రయత్నించి వీలుపడక పోవడంతో బాక్సును ఎటిఎం బయట పడవేసి వెళ్లినట్లు వివరించారు.



ధ్వంసమైన ఎటిఎం

సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

ఆధారాల కోసం క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించింది. ఎటిఎం తలుపులు, ఎలక్ట్రానిక్స్ బాక్సులపై వేలి ముద్రలు సేకరించింది. బ్యాంకులోని సిసి టీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన క్లూస్‌టీం బుధవారం రాత్రి సుమారు 1నుంచి 2 గంటల ప్రాంతంలో చోరీ జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఎటిఎం మిషన్‌లపై అవగాహన ఉన్న వారే చోరీకి పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఎటిఎంలోని నగదు నిల్వలు, ఖాతాదారుల వివరాలను బ్రాంచ్ మేనేజరు మురళి, క్యాషియర్, ఇతర సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలంలో లభించిన ఆధారాలను విశ్లేషించి దొంగలు పాత నేరస్తులా? లేక కొత్తవారా అనేది తెలుస్తామన్నారు. ఎటిఎంలో చోరీకి యత్నించిన దొంగలను సాధ్యమైనంత త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ నాగశివారెడ్డి తెలిపారు.

రుణాల కోసం బడ్జెట్‌లో

రూ. 5 వేల కోట్లు కేటాయించాలి

ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

గొర్రెలు,మేకల పెంపకందార్ల రుణాల కోసం బడ్జెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఒక్కొక్క గొర్రెల కాపరికి తెలంగాణ తరహాలో 75 శాతం సబ్సిడీతో రూ. రెండు లక్షలు గొర్రెలు యూనిట్‌కు మంజూరు చేయాలని, గొర్రెలు, మేకలకు సంవత్సరానికి 4 సార్లు నట్టల నివారణకు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని, 50 సంవత్సరాలు దాటిన గొర్రెల కాపరికి రూ. 2 వేల వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని, జిఓ నెంబరు 559, 1016 ప్రకారం గొర్రెలు, మేకలు ఉన్న గ్రామాల్లో మేత కోసం 5 ఎకరాల నుంచి 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు కేటాయించాలని, అన్ని జిల్లాలకు ఎన్‌సిడిసి నిధులను వెంటనే విడుదల చేయాలని, వేసవిలో వలసల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, గొర్రెల బీమాకు నిధులు కేటాయించాలని, గొర్రెల పెంపకందార్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, జీవక్రాంతి, నాబార్డు సబ్సిడీ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లో గురువారం ధర్నా చేపట్టారు. ముందుగా రైల్వేస్టేషన్ నుంచి అలంకార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల రాష్ట్ర అధ్యక్షులు బి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు నిండినా గొర్రెలు, మేకల పెంపకందార్లు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నార న్నారు. తమ సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం ప్రధానకార్యదర్శి జమలయ్య, ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం రామకృష్ణ, సహాయ కార్యదర్శులు గంటా శ్రీరామ్, గోవింద్, పెద్దబ్బాయి, ఆంజనేయులు, ఎవి కృష్ణా రావు, జి రామకృష్ణ, పి సాంబమూర్తి, 13 జిల్లాల నుంచి విచ్చేసిన గొర్రెలు, మేకల పెంపకందార్లు పాల్గొ న్నారు. ధర్నా వద్దకు విచ్చేసిన పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ గాబ్రియేల్ వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



విజయవాడలోని అలంకార్‌సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గ్యాబ్రియల్

అమరులు, వికలాంగ జవాన్ల పిల్లల ఫీజులకు పరిమితి లేదు

న్యూఢిల్లీ : అమరవీరులు, వికలాంగులైన, అదృశ్యమైన సైనికుల పిల్లల చదువులకు చెల్లిస్తున్న ఫీజులపై పరిమితిని కేంద్ర ప్రభుత్వం తొలగించింది. వారి పిల్లల చదువులకు నిధులను పూర్తిగా సమకూర్చనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. గతంలో నెలకు 10 వేల రూపాయల చొప్పున పరిమితిని విధించారు. తాజాగా ఈ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం దీనికి సంబంధించి కొన్ని నిబంధనలను విధించింది. ప్రభుత్వ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలలకు, సైనిక, మిలటరీ పాఠశాలలకు, అటానమస్ సంస్థలకు మాత్రమే ఈ ఫీజులు చెల్లించనున్నట్లు పేర్కొంది.

సేవల యాప్

కేరళలోని కొచ్చిలో గురువారం ఫ్యూచర్ పేరుతో జరిగిన గ్లోబల్ డిజిటల్ సమ్మిట్‌లో ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు, కేరళ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేరళ సిఎం విజయన్ ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో సులభంగా పొందేలా ఒక యాప్‌ను ఆవిష్కరించారు.



యూనిఫైడ్ గవర్నెన్స్ యాప్‌ను ప్రారంభించిన కేరళ సిఎం

కొచ్చి : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం ఇక్కడ యూనిఫైడ్ గవర్నెన్స్ యాప్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ జరుగుతున్న గ్లోబల్ డిజిటల్ సమ్మిట్‌లో ఆయన ఈ యాప్‌ను ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా పౌరులు దాదాపు 100కు పైగా ప్రభుత్వ సేవలను అందుకోవచ్చని ఆయన చెప్పారు. కేరళలో వ్యాపార అనుకూల వాతావరణం వుందని, రాష్ట్రానికి చెందిన మూడున్నర కోట్ల మంది ప్రజలు వాణిజ్య, వ్యాపారాలతో మంచి సంబంధాలు కలిగి వుండటంతో పాటు వినిమయానికి కూడా సిద్ధంగా వున్నారని చెప్పారు. అత్యుత్తమ స్థాయి మానవ వనరులతోపాటు, అందమైన భౌగోళిక ప్రదేశాలతో కేరళ అత్యున్నత స్థాయి జీవనానికి అనువైన వాతావరణం కలిగి వుందని, రాష్ట్రంలో అక్షరాస్యత స్థాయి అధికంగా వుండటంతో డిజిటల్ అవగాహన కలిగిన శ్రామిక వనరులు ఇక్కడ పుష్కలంగా లబిస్తాయని ఆయన వివరించారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని డిజిటల్ టెక్నాలజీతో సమూలంగా మార్పు చేయగలమన్న అంశాన్ని తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రభుత్వం బహిరంగ ప్రదేశాలలో వెయ్యికి పైగా ఉచిత వైఫై కేంద్రాలను ఏర్పాటు చేసిందని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కేరళ ప్రభుత్వ ఐటి కార్యదర్శి ఎం శివశంకర్, హైపవర్ ఐటి కమిటీ సభ్యుడు వికె మాథ్యూస్ తదితరులతో పాటు ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ల తదితర ప్రముఖులు పాల్గొంటున్నారు.

ఆధార్ నిరాధారం..

బిజెపి ఎంపీ శత్రుఘ్న సిన్హా

పాట్నా : మోడీ సర్కారుపై బిజెపి ఎంపీ శత్రుఘ్న సిన్హా మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. నిరాధారమైన ఆధార్ కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరమేముందంటూ కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఆధార్ వ్యవస్థను వ్యర్థ కసరత్తుగా అభివర్ణిస్తూ గురువారం ట్వీట్ చేశారు. 'నిరాధారమైన ఆధార్‌తో ఏం జరుగుతుంది ? దాని కోసం పెద్ద ఎత్తున డబ్బు, మానవ వనరులను ఎందుకు ఖర్చు చేస్తున్నారు. ఆధార్‌పై చేస్తున్నదంతా వృథా ప్రయాసే అన్న సంగతి తెలియదా ?' అంటూ సొంత ప్రభుత్వాన్నే నిలదీశారు. డిజిటల్ గోప్యత ప్రతీ పౌరుని హక్కు అని ఆయన తెలిపారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియా సైట్లలో ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం అపహరణకు గురి కాకుండా కేంద్రం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో విదేశీ సంస్థలతో రాజీ పడవద్దని సూచించారు. ఫేస్‌బుక్ వినియోగదారుల డేటా లీకేజీ వ్యవహారంపై ప్రస్తుతం పెద్ద ఎత్తున చర్చ నడుస్తోన్న సంగతి తెలిసిందే.

మాల్దీవుల్లో ఎమర్జెన్సీ ఎత్తివేత

మాలె : మాల్దీవుల్లో 45 రోజుల తర్వాత అత్యవసర పరిస్థితిని ఎత్తివేశారు. దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో నిరసనలు, ఆందోళనలపై నిషేధం విధిస్తూ ప్రకటించిన ఎమర్జన్సీని గురువారం అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఎత్తివేశారు. తొలుత 15రోజులపాటు అమల్లో వుండేలా ఫిబ్రవరి 5న ఎమర్జన్సీ విధించారు. తొమ్మిదిమంది ప్రతిపక్ష నేతలపై గల అభియోగాలను కొట్టివేస్తూ వారిని వెంటనే జైలు నుండి విడుదల చేయాలంటూ సుప్రీం కోర్టు రూలింగ్ ఇవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. తర్వాత పార్లమెంట్ ఆమోదంతో మరో 30 రోజుల పాటు పొడిగించారు. కాగా ఈ చర్యను ప్రతిపక్షం సవాలు చేసింది. "జాతీయ భద్రతకు ఇంకా ముప్పు వున్నప్పటికీ సెక్యూరిటీ సర్వీసెస్ సలహా మేరకు, దేశంలో సాధారణ పరిస్థితులు పెంపొందించేందుకు అత్యవసర పరిస్థితి ఎత్తివేయాలని అధ్యక్షుడు నిర్ణయించారని అధ్యక్ష భవన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పరిమితి రెట్టింపు

న్యూఢిల్లీ : ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందే గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చట్టసవరణ బిల్లును పార్లమెంట్ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రతిపాదిత చట్టం ప్రకారం ప్రస్తుతం పన్ను మినహాయింపు పొందుతున్న గ్రాట్యుటీ మొత్తం రు.10 లక్షలు కాగా, కొత్త చట్టం ప్రకారం ఇది రు.20 లక్షలకు పెరుగుతుంది. ఈ చట్టం అమలులోకి వస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన లక్షలాది మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుంది. గ్రాట్యుటీ చెల్లింపుల చట్టంలో ప్రతిపాదించిన ఈ సవరణలతో మహిళలకు కల్పించే ప్రసూతి సెలవు పరిమితిని కూడా పెంచారు. ఈ బిల్లును లోక్‌సభ గత వారం ఆమోదించగా రాజ్యసభ ఎటువంటి చర్చా లేకుండా గురువారం నాడు దీనిపై ఆమోదముద్ర వేసింది. రాష్ట్రపతి సంతకం చేసిన తరువాత ఇది చట్టంగా మారుతుంది. వరుసగా ఐదేళ్లు పనిచేసిన ఉద్యోగి తన ఉద్యోగాన్ని వదిలే సమయంలో యాజమాన్యం గ్రాట్యుటీని చెల్లించాల్సి వుంటుంది. ఇది చివరిగా ఆ ఉద్యోగి అందుకున్న వేతనం, ఎన్నేళ్లు పనిచేశాడన్న అంశాలపై ఆధారపడి వుంటుంది. ప్రస్తుతం పదిమంది అంతకన్నా ఎక్కువ మంది పనిచేస్తున్న కంపెనీ లకు ఈ గ్రాట్యుటీ నిబంధనలను వర్తింప చేస్తున్నారు. కాగా ఏడవ వేతన సంఘ సిఫార్సుల మేరకు గ్రాట్యుటీపై పన్ను మినహాయింపు పరిమితిని ప్రభుత్వం రు.20 లక్షలకు పెంచుతూ 2016లోనే నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే.

జర్నలిస్ట్ హత్య కేసులో లాలూ కుమారుడికి 'సుప్రీం' ఊరట

న్యూఢిల్లీ : జర్నలిస్ట్ రాజ్‌దేవ్ రాజన్ హత్య కేసులో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌పై విచారణను గురువారం సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ హత్యకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని సిబిఐ పేర్కొన్న అనంతరం రాజన్ భార్య ఆశా రాజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణకు తేజ్ రావల్సిన అవసరం లేదంటూ కోర్టు తీర్పును వెలువరించింది. విచారణ జరుగుతున్న సమయంలో అనుమానితులుగా భావిస్తున్న తేజ్ ప్రతాప్ యాదవ్, ప్రస్తుతం జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న మహ్మద్ కైఫ్, మహ్మద్ జావేద్‌లకు సంబంధించి మీడియా కథనాలు, ఫోటోలు సేకరించారా అని సిబిఐని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. కాగా, తేజ్‌ప్రతాప్ యాదవ్‌కు వ్యతిరేకంగా సిబిఐ ఎటువంటి ఆధారాలు లభించలేదని సోలిసిటర్ జనరల్ అమన్ లఖీ తెలిపారని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

సుష్మా స్వరాజ్‌పై సభా హక్కుల తీర్మానం?

న్యూఢిల్లీ : విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌కు వ్యతిరేకంగా రాజ్యసభలో సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతామని కాంగ్రెస్ పార్టీ గురువారం తెలిపింది. నాలుగేళ్ల క్రితం ఇరాక్‌లో అదృశ్యమైన 39 మంది భారతీయులు మృతి చెందారని మంగళవారం సుష్మా స్వరాజ్ ప్రకటన నేపథ్యంలో కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ 39 మంది భారతీయులు సురక్షితంగా, ప్రాణాలతో ఉన్నారని గతంలో అనేక సార్లు సుష్మా తెలిపారని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యులు అంబికా సోని, ప్రతాప్ సింగ్ బజ్వా తెలిపారు. 2014 ఆగష్టులో ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించినప్పుడు కూడా మంత్రి ఇదే హామీ ఇచ్చారని అంబికా సోని తెలిపారు. 2014 జూన్‌లో ఇరాక్‌లో 40 మంది భారతీయులు ఐఎస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. 2015లో వారి చెర నుండి తప్పించుకున్న ఒక వ్యక్తి హర్జిత్ మషా మిగిలిన భారతీయులంతా హత్యకు గురయ్యారని వెల్లడించాడు.

ఉన్నత విద్య ధనికులకే పరిమితం

వర్శిటీలకు స్వయం ప్రతిపత్తిపై ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్‌ఎన్), న్యూఢిల్లీ : 60 విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ యుజిసి తీసుకున్న నిర్ణయాన్ని ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా వ్యతిరేకించింది. విద్యను ప్రైవేటీకరించే దిశగా నరేంద్ర మోడీ తీసుకుంటున్న నిర్ణయాల్లో ఇది ఒకటిగా ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్ణయాలు ఉన్నత విద్యా, పరిశోధనా కేంద్రాలు కేవలం ధనవంతులకే పరిమతం అనే ప్రమాదకార సంకేతాలు ఇస్తాయని పేర్కొంది. 5 సెంట్రల్ యూనివర్శిటీలు, 21 రాష్ట్ర యూనివర్శిటీలు, 24 డీమ్డ్ యూనివర్శిటీలు, 2 ప్రైవేట్ యూనివర్శిటీలు, 8 స్వతంత్ర కళాశాలలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నట్లు యుజిసి ప్రకటించింది. స్వయం ప్రతిపత్తి నిర్ణయం ఈ సంస్థలకు ఆర్థికంగా మరింత భారంగా మారుతుందని, దీంతో డిగ్రీ, డిప్లొమా ఫీజులు మరింతగా పెరుగుతాయని ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన వ్యక్తం చేసింది. యుజిసి నివేదిక ప్రకారం ఈ స్వయం ప్రతిపత్తి సంస్థలన్నీ నూతన కేంద్రాలు, విభాగాలు, ఆఫ్-క్యాంపస్ కేంద్రాలు ప్రారంభించాల్సి వుంటుందని, అయితే ఈ వ్యయాలకు కేంద్రం ఎలాంటి నిధులను సమకూర్చదని, దీనికి అర్థం భారీగా ఫీజులు పెంచాలన్నదేనని ఎస్‌ఎఫ్‌ఐ పేర్కొంది. ఎన్‌డిఎ ప్రభుత్వ వత్తిడితో యుజిసి తీసుకున్న ఈ నిర్ణయం దేశంలో ఉన్నత విద్యపై దీర్ఘకాలం పాటు తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ తెలిపింది.

ముజఫర్‌నగర్ కేసుల ఉపసంహరణ

యుపి న్యాయశాఖ మంత్రి వెల్లడి



న్యూఢిల్లీ : గత ఏడాది ముజఫర్‌నగర్ దాడులకు సంబంధించి తమ పార్టీ నేతలపై నమోదు చేసిన 131 కేసులను ఉపసంహరించుకునేందుకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. 'అతి పాతవి, తీవ్రమైనవి కానివి' అంటూ ఈ కేసులపై ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులన్నీ కేవలం ఒక వర్గానికిచెందిన వారిపైనే నమోదుచేశారని ఆయన అంటున్నారు. ఇందులో కొన్ని కేసులు దాడి, దోపిడీ, హత్యాయత్నం, హత్య వంటి తీవ్రమైన నేరాభియోగాలతో నమోదు చేశారని ప్రభుత్వం జిల్లా అధికారులకు రాసిన లేఖ చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వం రాసిన లేఖ కాపీ మీడియా చేతుల్లోకి వచ్చింది. ఈ లేఖ వివరాలిలా వున్నాయి. యుపి బిజెపి ఎమ్మెల్యే ఉమేష్ మాలిక్‌తో కలిసి మాజీ కేంద్ర మంత్రి సంజీవ్ బన్యాన్ ఇటీవల ముఖ్యమంత్రిని కలిసి పార్టీ నేతలపై నమోదు చేసిన దాదాపు 150 కేసులను ఉపసంహరించాలని కోరారు. ఇందులో అధికశాతం బోగస్ కేసులేనని ప్రస్తుతం ముజఫర్ నగర్ లోక్‌సభా స్థానానికి బిజెపి తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న బన్యాన్ చెబుతున్నారు. 'మహిళలు, యువతపై తప్పుడు కేసులు బనాయించారని, వారు గత ఐదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. 2013 నాటి ఈ దాడుల్లో 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అనంతరం ఈ దాడులకు సంబంధించి పోలీసులు దాదాపు 150కి పైగా కేసులను నమోదు చేశారు. ఈ అంశంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి బ్రిజేష్ పాఠక్ జవాబిస్తూ కేసుల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు యుపిలో రాజకీయ దురుద్దేశంతో నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలని భావిస్తోందని చెప్పారు. ఈ మేరకు అన్ని జిల్లాల యంత్రాంగానికి ఆదేశాలుజారీ చేశామని ఆయన వివరించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ కేసులను ఉపసంహరించుకునేందుకు వీలుందేమో పరిశీలించాలని ప్రభుత్వం తన లేఖలో జిల్లా మేజిస్ట్రేట్‌లకు సూచించింది.

ఇడి మాజీ డైరెక్టర్ ప్రాంగణాల్లో సోదాలు

న్యూఢిల్లీ : 600 కోట్ల 'యునిపే 2యు స్కాం'లో నిందితుడిని నుంచి 6 కోట్లు లంచం తీసుకున్నట్లు ఆరోపణల నేపథ్యంలో గురువారం చండీగడ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ మాజీ డైరెక్టర్ గుర్నాం సింగ్ చెందిన నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) సోదాలు నిర్వహించింది. ఇడికి గతంలో అధికార న్యాయవాదిగా వ్యవహరించిన పునీత్ కుమార్ ఇంటిలో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ ఇడి అధికారి తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పూంజీ స్కీం ద్వారా వేలాది మంది పెట్టుబడిదారులను మోసం చేసినందుకు యునిపే 2యు మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్‌పై మనీలాండరింగ్ కేసు నమోదైంది. ఈ మనీలాండరింగ్ కేసు ఆధారంగా కంపెనీ, దాని కార్యనిర్వాహకుల మీద అనేక కేసులు నమోదయ్యాయి. సంస్థకు సంబంధించిన అనేక ఖాతాలను స్తంభింప చేశారు. తదుపరి దర్యాప్తులో భాగంగా గత జులైలో ప్రధాన నిందితుడు కమల్.కె.బక్షిని అరెస్టు చేశారు. అతనిని విచారిస్తున్న సమయంలో గుర్నాం సింగ్, అతని స్నేహితుడైన న్యాయవాది పునీత్ తన వద్ద నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేయడంతో పాటు ఆస్తిని కూడా బదిలీ చేయించారని తెలిపారు. గుర్నాం సింగ్ గత నవంబర్‌లో పదవి విరమణ చేశారు. సిబిఐ ఇప్పటికే అతనిపై చర్య తీసుకుంది.

సుప్రీం తీర్పుపై కేంద్ర మంత్రి గెహ్లాట్‌కు

డిఎస్ఎంఎం వినతి పత్రం

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్‌ఎన్), న్యూఢిల్లీ :

ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్‌కు దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) ప్రతినిధి బృందం గురువారం వినతిపత్రం సమర్పించింది. ఈ చట్టం లోని నిబంధనలను సుప్రీంకోర్టు సడలించిందని ఆ వినతి పత్రంలో పేర్కొంది. సుప్రీం కోర్టు తీర్పుపై ప్రభుత్వం తక్షణమే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిఎస్ఎంఎం డిమాండ్ చేసింది. ముఖ్యంగా దుర్వినియోగం చేస్తారనే పేరుతో చట్టంలోని సెక్షన్ 18ను తొలగించడం చాలా దురదృష్టమైన నిర్ణయంగా డిసిఎంఎం పేర్కొంది. నిజానికి ఇప్పటికే ఎస్‌సి, ఎస్‌టిలపై జరిగిన నేరాలకు సంబంధించి పడిన శిక్షల శాతం చాలా తక్కువగా ఉందని, చార్జ్‌షీటు దాఖలు నుంచి కోర్టులో విచారణ వరకూ ప్రతీ దశలోనూ తీవ్ర జాప్యం జరుగుతుందని డిఎస్ఎంఎం ఆందోళన వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రమైన



సామాజిక న్యాయంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని డిఎస్ఎంఎం పేర్కొంది. దళితులకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 21న న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్‌లో డిఎస్ఎంఎం భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రచారం, నిరసనలు నిర్వహిస్తామని డిఎస్ఎంఎం ప్రకటించింది.

సిసిటివి కెమెరాలు ఆపేశాం

ఐసియు ఖాళీ చేయించాం
జయలలిత మృతిపై డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత చనిపోయిన ఏడాది దాటినా ఇంకా ఆమె మృతిపై చర్చ జరుగుతునే వుంది. జయలలిత చివరి రోజులను వీడియో తీశామని ఆమె స్నేహితురాలు శశికళ విచారణా కమిషన్‌కు చెప్పగా, దానికి విరుద్ధమైన రీతిలో అపోలో ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి చెప్పారు. జయలలిత 75 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారని, ఆమె వున్నంత కాలమూ ఆస్పత్రిలోని అన్ని సిసిటివి కెమెరాలను స్విచ్ఛాఫ్ చేశామని గురువారం చెప్పారు. పైగా 24 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కూడా ఖాళీ చేయించామని, ఆమె ఒక్కరే అందులో వున్నారని చెప్పారు. జయలలిత ఆరోగ్యం కొంత మెరుగ్గా వున్నప్పుడు నాలుగుసార్లు వీడియోలు తీశామని, పన్నీర్‌సెల్వం, తంబిదురైలతో సహా సీనియర్ పార్టీ నేతలు పలువురు ఆమెను కలిశారని శశికళ చెప్పారు. కాగా దీనిపై పన్నీర్‌సెల్వం, తంబిదురై స్పందిస్తూ, జయలలిత ఆస్పత్రిలో వున్న సమయంలో ఏ దశలోనూ తాము కలవడానికి అనుమతించలేదని స్పష్టం చేశారు. జయకు అందించిన చికిత్స వివరాలను ఇప్పటికే అపోలో ఆస్పత్రి విడుదల చేసింది. చెన్నైలో పత్రికా సమావేశం సందర్భంగా విలేకర్లు మాట్లాడుతూ, సిసిటివి ఫుటేజీలన్నీ ఆస్పత్రి విడుదల చేసిందా అని ప్రశ్నించగా, మొత్తం 75రోజుల పాటు అన్ని కెమెరాలు ఆపివేశామని డాక్టర్ రెడ్డి చెప్పారు. జయలతిత వెంట వున్న వారి సూచన మేరకు కెమెరాలు తొలగించామని చెప్పారు. ముఖ్యమంత్రి ఐసియుకి వచ్చిన తరువాత ఇక వేరెవరినీ అందులోకి అనుమతించలేదని, వారందరినీ వేరే యూనిట్‌కి తరలించామని చెప్పారు.

కేంద్రం కట్టుకథలు అల్లుతోంది : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ఇరాక్‌లో 39 మంది భారతీయుల మరణాల నుండి దృష్టిని మరల్చడానికి కేంబ్రిడ్జ్ అనాలిటికా నుండి డేటాను కాంగ్రెస్ దొంగిలించిందనే కట్టు కథను కేంద్రం అల్లుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం ఆరోపించారు. దీనిపై మీడియాను కూడా విమర్శించారు. 'సమస్య 39 మంది భారతీయుల మరణం ప్రభుత్వం అబద్ధాలాడుతోంది. పరిష్కారం కాంగ్రెస్ డేటాను దొంగిలించిందనే కథనం, ఫలితం మీడియా సమస్యను వదిలేసింది. 39 మంది మరణించిన విషయాన్ని విస్మరించింది. సమస్య తీరింది' అని ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. దేశం దృష్టిని మరల్చడానికి ప్రధాన సమస్యలైన పిఎన్‌బి స్కాం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటిస్ యాక్ట్ నిబంధనల సడలింపు, ఇరాక్‌లో మరణించిన వారి కుటుంబ సభ్యుల ప్రశ్నల వంటి పలు సమస్యలను ప్రభు త్వం వెనక్కు నెట్టే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.

విజయవంతమైన క్షిపణి బ్రహ్మోస్ ప్రయోగం

న్యూఢిల్లీ : సూపర్ సోనిక్ క్రూయిస్ క్షిపణి బ్రహ్మోస్ ప్రయోగం విజయవంతమైంది. రాజస్థాన్ పోఖ్రాన్ టెస్ట్ రేంజ్ నుండి గురువారం ఉదయం 8.42 నిమిషాలకు ఈ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను విజయవంతంగా పరీక్షించారు. మొదటిసారిగా స్వదేశీ టెక్నాలజీతో క్షిపణిని ప్రయోగించారు. ఈ ప్రయోగంలో క్షిపణి అనుకున్న లక్ష్యాన్ని చాలా కచ్చితత్వంతో చేరుకుందని రక్షణ మంత్రిత్వ శాఖ ట్విట్టర్‌లో పేర్కొంది. బ్రహ్మోస్‌ను గత నవంబర్‌లో సుఖోయ్ యుద్ధ విమానం నుండి విజయవంతంగా పరీక్షించారు. ఈ సాంకేతికతను భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ)తో సహకారంతో హైదరాబాద్‌లో రీసెర్చ్ సెంటర్ ఇమ్రాత్(ఆర్‌సిఐ) అభివృద్ధి చేసింది. దీని బరువు దాదాపు 2.5 టన్నులు, పొడవు 8.4 మీటర్లు. ఈ క్షిపణి సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యంత రహస్యంగా ఉంచారు.

రూ. 53 వేల కోట్లతో ఢిల్లీ బడ్జెట్

న్యూఢిల్లీ : రూ. 53 వేల కోట్లతో 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఆప్ ప్రభుత్వం గురువారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. పర్యావరణం, ఆరోగ్యం, విద్య, నీటి సరఫరా అంశాలకు భారీ కేటాయింపులు జరిగాయి. ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. '2018-19 ఏడాదికి రూ. 53 వేల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను తయారు చేశామని, గత ఆర్థిక సంవత్సరంలో రూ 44, 370 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే 19.45 శాతం అధికం' అని ఆయన తెలిపారు. ఢిల్లీలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడం కోసం ప్రవేశపెట్టిన 'తొలి పర్యావరణ బడ్జెట్'గా పేర్కొన్నారు. రవాణా, విద్యుత్, పర్యావరణం, ప్రజా పనుల విభాగం, పర్యావరణ నియంత్రణ కోసం 26 కార్యక్రమాలు, పథకాలు రూపొందించినట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రహదారుల మరమ్మత్తు, నిర్వహణ కోసం రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే, ఈ గత ఏడాది బడ్జెట్‌పై స్టేటస్ రిపోర్టును కూడా మనీష్ సిసోడియా ప్రవేశపెట్టారు.

నేడు 'రాజ్యసభ' ఎన్నికలు

న్యూఢిల్లీ : రాజ్యసభలో ఖాళీ అవుతున్న స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనున్నది. వచ్చేనెల నాటికి పెద్దల సభలో 58 సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ స్థానాల్లో అత్యధికంగా ఉత్తర ప్రదేశ్ నుంచి 10, బీహార్, మహారాష్ట్రల నుంచి ఆరేసి స్థానాల చొప్పున ఉన్నాయి. 16 రాష్ట్రాల నుంచి 58 రాజ్యసభ స్థానాలకు ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. అయితే.. 10 రాష్ట్రాల నుంచి 33 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో.. ఆరు రాష్ట్రాల్లోని(ఉత్తరప్రదేశ్ 10, బెంగాల్ 5, కర్నాటక 4, తెలంగాణ 3, జార్ఖండ్ 2, ఛత్తీస్‌గఢ్ 1) 25 స్థానాలకు మాత్రమే పోలింగ్ జరగనున్నది. శుక్రవారం సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేయడంతో పాటు ఫలితాలు కూడా వెల్లడించే అవకాశముంది. ఎమ్మెల్యే ఓట్ల ద్వారా పరోక్ష పద్ధతిలో రాజ్యసభ సభ్యులు ఎన్నికవుతారు. రాజ్యసభ సభ్యుడి పదవీ కాలం 6 సంవత్సరాలు. ప్రతీ రెండేండ్లకోసారి రాజ్యసభలో మూడింట ఒకవంతు ఎంపీలు పదవీ విరమణ పొందుతారు.

పెద్దల సభలో 'కోటీశ్వరులు'

87 శాతం అభ్యర్థుల ఆస్తి కోట్ల పైనే

న్యూఢిల్లీ : రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 87 శాతం అభ్యర్థులు కోటీశ్వరులే అంటూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. ఈ నెల 28న 16 రాష్ట్రాల్లో 58 సీట్లకు జరుగబోయే రాజ్యసభ ఎన్నికల్లో 64 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఏడీఆర్ తెలిపిన వివరాల ప్రకారం... రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 63 మంది అభ్యర్థుల సగటు ఆస్తి రూ. 122.13 కోట్లుగా ఉన్నది. వీరిలో 55 మంది ఆస్తి కోటి రూపాయల కంటే ఎక్కువగానే ఉన్నది. వీరిలో అత్యధికంగా జనతాదళ్ (యు) నుంచి పోటీ చేస్తున్న మహేంద్రప్రసాద్ ఆస్తి రూ. 4,078 కోట్లుగా ఉన్నది. తరువాతి స్థానంలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న జయాబచ్చన్ ఉన్నారు. ఆమె ఆస్తి రూ. 1,001 కోట్లుగా ఉన్నదని నివేదిక పేర్కొంది. బిజు జనతాదళ్ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న అచ్యుతానంద సమనంత ఆస్తి రూ. 4 లక్షలతో చివరి స్థానంలో ఉన్నారు. పార్టీల పరంగా చూస్తే బీజేపీ అభ్యర్థుల్లో 29 మందికి గానూ 26 మంది కోటీశ్వరులే (సగటున ఒక్కొక్కరి ఆస్తి రూ. 16 కోట్లు) ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 10 మంది (సగటున రూ.66 కోట్లు), తృణమూల్ కాంగ్రెస్, టీఆర్ఎస్ నుంచి ముగ్గురు అభ్యర్థులు, జనతాదళ్(యు) నుంచి ఇద్దరు, సమాజ్‌వాది పార్టీ నుంచి ఒక్కరు కోటీశ్వరులని ఏడీఆర్ తెలిపింది. పెద్దల సభకు పోటీ చేస్తున్న 63 అభ్యర్థుల్లో 16 మంది(25శాతం) పై క్రిమినల్ కేసులున్నట్టు ఏడీఆర్ పేర్కొంది. ఇందులో 8 మంది అభ్యర్థులపై కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం వంటి కేసులున్నాయని తెలిపింది. కాగా, ఏడుగురు(11 శాతం) అభ్యర్థులు 10 నుంచి 12 తరగతి వరకు తమ విద్యార్హతగా పేర్కొన్నారు. 55 మంది(87 శాతం) అభ్యర్థులు గ్రాడ్యుయేట్లేనని ఏడీఆర్ పేర్కొంది.



2017లో ప్రకృతి విలయాల ఖరీదు రూ. 20 లక్షల కోట్లు

న్యూయార్క్ : ప్రపంచం మొత్తం మీద 2017 సంవత్సర కాలంలో వరదలు, తదితర వాతావరణ మార్పుల కారణంగా కనీసం రూ. 20,83,330 కోట్ల నష్టం వచ్చినట్టు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఏది ఏమైనా, గడచిన మూడేండ్లలో ఆస్ట్రేలియాలో అత్యధిక ఉష్ణోగ్రతలతో అసాధారణమైన వేడి గాలులతో వాతావరణం భయానకంగా సాగిందని వార్షిక నివేదికలో ఐక్యరాజ్యసమితి అనుబంధ వరల్డ్ మెట్రోలాజికల్ ఆర్గనైజేషన్ తెలియచేసింది. ఈ 2017 సంవత్సర కాలంలో ఇండియాలో కూడా వరదలు, ఇంకా ఇతర వాతావరణ తీవ్రతలు భారీ నష్టాలు కలిగించాయని, ఆ సంవత్సర కాలంలో పరిస్థితే ఇప్పటికీ 2018లో కూడా కొనసాగుతోందని ఈ సంస్థ సెక్రెటరీ జనరల్ పెటెరీ తాలాస్ ఆ నివేదికలో పేర్కొన్నారు. 19వ శతాబ్దం నుంచి సేకరించిన రికార్డులన్నిటిలో 2016 సంవత్సరం అత్యధిక ఉష్ణ వాతావరణం నమోదైన సంవత్సరం. ఎల్ నినో ప్రభావం కారణంగా గత ఏడాది పసిఫిక్ సముద్ర తీరం నుంచి ఉష్ణ గాలులు అన్ని దేశాలను ప్రభావితం చేసాయి. 2018లో యూరోప్, ఉత్తర అమెరికాల్లో అతిశీతల వాయువులు, ఇతర ప్రదేశాల్లో వేడి గాలులు ఈ వాస్తవ స్థితిని ప్రతిబింబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దాదాపు 8,00,000 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా వాతావరణంలో మిలియన్ (పది లక్షలు) అణువుల్లో 400 పార్టులు కార్బన్ డై ఆక్సైడ్ అణువులున్నట్టు లెక్కకడుతూ, రానున్న తరాలు మరింత ప్రమాదకరమైనకార్బన్ డై ఆక్సైడ్ అణువులతో సహజీవనం సాగించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

కొత్త బ్లాక్‌హోల్స్‌కు స్టీఫెన్ హాకింగ్ పేరు

మాస్కో : రష్యన్ వ్యోమగాములు ఓ కొత్త బ్లాక్ హోల్‌ను ఆవిష్కరించారు. తన జీవితమంతా అంతరిక్ష పరిశోధనలకు కేటాయించిన ప్రఖ్యాత బ్రిటీష్ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పేరును బ్లాక్ హోల్‌కు పెట్టారు. కొత్తగా కనిపెట్టిన బ్లాక్‌హోల్ ఓఫికస్ నక్షత్రాలు కూటమిలో ఉన్నట్టు కనుగొన్నారు. సరిగ్గా స్టీఫెన్‌హాకింగ్ చనిపోయిన రెండు రోజుల తర్వాత ఈ విషయం కనిపెట్టారు. మాస్కో స్టేట్‌యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కొంతకాలంగా నక్షత్రాల కూటమిలో గామా కిరణాల పేలుళ్లను(జీఆర్‌బీ) పరిశీలిస్తున్నారు. నక్షత్రం కూలిపోవటం వల్లే పేలుడు సంభవించిందని, దాని స్థానంలో బ్లాక్ హోల్ ఏర్పడటానికి పరిస్థితులు దారితీశాయని వెల్లడించారు. గామా-రే ఖగోళ శాస్త్రంలో.. గామా-రే పేలుళ్లు చాలా శక్తివంతమైన పేలుళ్లు అని, సుదూరంలో ఉన్న గెలాక్సీలను కూడా అవి మింగేస్తాయని తెలిపారు. పేలుళ్ల సమయంలో విడుదలయ్యే శక్తిని టెలిస్కోపు ద్వారా బంధించడం కూడా దాదాపు అసాధ్యమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సెకనులో పదో వంతు నుంచి మిల్లీ సెకండ్ సమయంలో మాయమైపోతాయని అన్నారు. కానీ అదృష్టవశాత్తు రష్యాన్ వ్యోమగాములు ఈ దృశ్యాన్ని బంధింపగలిగారని రష్యన్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఈ శక్తివంతమైన పేలుళ్లను స్పెయిన్ దేశంలోని టెనెరిఫ్ ఐలాండ్‌లో ఏర్పాటు చేసిన మాస్టర్-ఐఏసీ రోబోటిక్ టెలిస్కోప్ బంధించగలిగిందని తెలిపారు. బ్లాక్ హోల్‌పై పరిశోధనలకు గానూ దీనికి స్టీఫెన్‌హాకింగ్ బ్లాక్ హోల్ అని నామకరణం చేసినట్టు రష్యన్ పరిశోధకులు, ఆస్ట్రోనామర్స్ టెలిగ్రామ్ జర్నల్‌లో పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణను జీఆర్‌బీ180316ఏ పేరుతో రిజిస్టర్ చేశారు. బ్లాక్ హోల్‌లో వెళ్లిన ఏ వస్తువులూ తిరిగి రాలేవు. కాంతిని కూడా బ్లాక్ హోల్స్ మింగేస్తాయి. స్టీఫెన్ హాకింగ్(76) ఈ నెల 14న అమియోట్రోఫిక్ లాటెరల్ స్క్లెరోసిస్- ప్రోగ్రెస్సివ్ న్యూరోడీజనరేటివ్ వ్యాధితో మృతి చెందినత సంగతి తెలిసిందే.

థాయ్‌లాండ్‌లో రోడ్డు ప్రమాదం, 17 మంది మృతి

బ్యాంకాక్ : థాయ్‌లాండ్ ఈశాన్య ప్రాంతంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో కనీసం 17 మంది మరణించారని, అనేక మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 50 మంది ప్రయాణికులతో నఖోన్ రచసీమా ప్రావిన్స్‌లో బయల్దేరిన ఈ డబుల్ డెక్కర్ బస్సు మార్గమధ్యంలో రోడ్డు పక్కకి జారిపోయి ఒక చెట్టును ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద ఘటనా స్థలిలో 17 మంది మరణించారని, 33 మంది గాయపడ్డారని ప్రావిన్షియల్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ అధికారి ఒకరు వివరించారు.

■ రాజీనామా

అధ్యక్ష ఎన్నికలలో రష్యా జోక్యంపై ట్రంప్ తరఫున కోర్టులో వాదిస్తున్న లాయర్ జాన్‌డౌడ్ ట్రంప్ తన సలహాలను పెడచెవిన పెడుతున్నాడని ఆరోపిస్తూ రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించాడు.



బ్రెగ్జిట్ ఉపసంహరణపై పరిశీలిస్తాం

స్కాట్లాండ్ సుప్రీంకోర్టు వెల్లడి

ఎడిన్‌బరో : బ్రెగ్జిట్ తుది నిబంధనలను బ్రిటన్ పార్లమెంట్ తిరస్కరించిన పక్షంలో తిరిగి బ్రిటన్ యురోపియన్ యూనియన్‌లో కొనసాగవచ్చా లేదా అనే అంశాన్ని కూలంకషంగా, లోతుగా పరిశీలిస్తామని స్కాట్లాండ్ సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో బ్రెగ్జిట్ వ్యతిరేక కార్యకర్తలు చేపట్టిన న్యాయ పోరాటానికి ఊతం లభించినట్లైంది. కావాలనుకుంటే బ్రిటన్ ఏకపక్షంగా బ్రెగ్జిట్ క్రమాన్ని మార్చవచ్చని నిరూపించేందుకు వారు పోరాడుతున్నారు. ఈ గ్రూపులో ఇయు అనుకూల స్కాటిష్ ఎంపీలు కూడా వున్నారు. బ్రెగ్జిట్ క్రమాన్ని ప్రారంభించిన లాంఛనప్రాయమైన చర్య, ఇయు లిస్బన్ ఒప్పందంలోని 50వ అధికరణను అమలు పరచాలన్న నిర్ణయాన్ని బ్రిటన్ ఉపసంహరించుకోవచ్చని వీరు పేర్కొంటున్నారు. దీనిపై అంతర్జాతీయ న్యాయస్థానం (ఇసిజె) అభిప్రాయాన్ని వారు కోరుతున్నారు. బ్రెగ్జిట్ నిబంధనలపై చర్చ జరిగేటపుడు, ఈ క్రమంతో ముందుకు సాగరాదని బ్రిటన్ పార్లమెంట్ నిర్ణయించవచ్చని వారు వాదిస్తున్నారు. ఇదిచట్టపరంగా సాధ్యమా కాదా అనేది తాము ముందుగానే తెలుసుకోవాల్సిన అవసరముందని వారు పేర్కొంటున్నారు. బ్రెగ్జిట్ వ్యతిరేక ప్రచార కమిటీ తరపు లాయర్ జోలిన్ మాగమ్ చేపట్టిన ఈ లీగల్ కేసును దిగువ స్కాటిష్ కోర్టు కొట్టివేసింది. అయితే ప్రజల అభిప్రాయమేంటనేది సుస్పష్టంగా వెల్లడైనందున ఈ క్రమాన్ని ఏకపక్షంగా నిలిపివేసేది లేదని బ్రిటీష్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

ఆఫ్రికాలోని దేశాల మధ్య 'స్వేచ్ఛా వాణిజ్యం'

అడిస్ అబాబా : 'ఆఫ్రికా స్వేచ్ఛా వాణిజ్య ప్రాంత' ఏర్పాటుకు సంబంధించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై దాదాపు 40 ఆఫ్రికన్ దేశాలు సంతకాలుచేశాయని ఆఫ్రికన్ యూనియన్ వెల్లడించింది. రువాండా రాజధాని కిగాలిలో బుధవారం జరిగిన ఎయు పదో అసాధారణ సమావేశంలో ఈ సంతకాలు జరిగాయి. ఈ సమావేశం నేపథ్యంలో జరిగిన కార్యక్రమంలో ఆఫ్రికన్ దేశాల ప్రతినిధులు సంతకాలు చేసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద పత్రాలను ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడు మౌసా ఫకీ మహ్మత్ అందుకున్నారని ఎయు ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది. ఎయు అధ్యక్షుడి సంతకం అనంతరం ఆయా దేశాల చట్టాల నిబంధనల మేరకు పార్లమెంట్‌ల ధృవీకరణ కోసం ఈ ఒప్పంద పత్రాలను ప్రవేశపెడతారు.

కొనసాగుతున్న లూలా యాత్ర

బ్రసీలియా : బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు లూలా డసిల్వా చేపట్టిన 'లూలా ఫర్ బ్రెజిల్' యాత్ర మూడువందల ఏళ్ళనాటి మున్సిపాలిటీ సావో బోర్జాలో కొనసాగుతోంది. ఎవరు ఎన్ని ఆటంకాలు కల్పించినా తన యాత్ర సాగుతుందని లూలా స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన యాత్ర సాగుతున్న రియో గ్రాండే డుసుల్ రాష్ట్రాన్ని తీవ్రవాదులు దిగ్బంధించారు. అయినా తాము ముందుకే సాగుతామని ఆయన పేర్కొన్నారు. సోమవారం ప్రారంభమైన ఈ యాత్ర నాల్గవ దశ ఈ నెల 28వరకు సాగుతుంది. ఈ యాత్ర సందర్భంగా దేశ మాజీ అధ్యక్షులు గెటులియో వర్గాస్, జోవో గెలార్ట్, జాతీయవాద నాయకుడు లియోనెల్ బ్రిజోలాలకు వర్కర్స్ పార్టీ (పిటి) వ్యవస్థాపకుడు డసిల్వా ఘనంగా నివాళి అర్పించారు. లూలా శాంతియుతంగా యాత్ర సాగిస్తుండగా వారి యాత్రను భగ్నం చేస్తామని తీవ్రవాదులు హెచ్చరించడం, పైగా దాడులు జరపడాన్ని వర్కర్స్ పార్టీ తీవ్రంగా ఖండించింది.

చైనా, ఫిలిప్పీన్స్ మధ్య పెరగనున్న సహకారం

బీజింగ్ : చైనా, ఫిలిప్పీన్స్ మధ్య సంబంధాలు మరింత పెంపొందించేందుకు ఉభయ పక్షాలు కలిసి కృషి చేయాలని నిర్ణయించాయి. చర్చలకు ఊతమివ్వాలని, సముద్ర జల వ్యవహారాల్లో సహకారాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఇరు దేశాల విదేశాంగ మంత్రులు నిర్ణయించారు. చమురు, గ్యాస్ రంగంలో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి తెలిపారు. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టుకు సంబంధించి ఫిలిప్పీన్స్‌తో మరింతగా కలిసి పనిచేయాలని భావిస్తున్నామని వాంగ్ చెప్పారు. దక్షిణ చైనా సముద్ర వివాదాన్ని సానుకూలంగా పరిష్కరించుకొని ఇరు దేశాల మధ్య సంబంధాల మెరుగుదలకు ఉపయోగించుకోవాలని వాంగ్ పేర్కొన్నారు. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగో డ్యుటార్టెను ఏప్రిల్‌లో చైనాలో పర్యటించాల్సిందిగా చైనా ఆహ్వానించింది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య



సంబంధాలు ధృఢమవుతాయని పేర్కొంది. బుధవారం బీజింగ్ చేరుకున్న ఫిలిప్పీన్స్ విదేశాంగ మంత్రి అలాన్ పీటర్ కేయటనో ఆదివారం వరకు చైనాలో వుంటారు. వాంగ్‌తో కలిసి ఆయన పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. వాంగ్‌తో జరిపిన చర్చలు జయప్రదమయ్యాయని కేయటనో చెప్పారు. విభేదాలున్నప్పటికీ ఇరు దేశాలు అన్నిరంగాల్లో తమ సహకారాన్ని పెంచుకోవాలని భావించినట్లు చెప్పారు.

చైనా సైన్యం అధీనంలోకే సరిహద్దు బలగాలు

భారత్‌తో గల సరిహద్దులను కాపలా కాస్తున్న బలగాలతో సహా సరిహద్దు దళాలన్నింటినీ చైనా మిలటరీ కమాండ్ పరిధిలోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు ఈ బలగాలపై వున్న పౌర నియంత్రణను తొలగించిందని ప్రభుత్వ మీడియా తెలిపింది. ఇప్పటివరకు ఈ బలగాలు సాయుధ పోలీసు విభాగంలో భాగంగా వుండేవి. స్టేట్ కౌన్సిల్ నిర్వహణలో వుండేవి. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ), ఇతర జాతీయ సాయుధ బలగాలపై పార్టీకే సంపూర్ణ నాయకత్వం వుండేలా ఈ చర్య తీసుకున్నారు. 3,448 కిలోమీటర్ల పొడవైన వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) పొడవునా మోహరించి వుండే సరిహద్దు బలగాలన్నీ ప్రత్యక్షంగా పిఎల్ఎ పరిధిలోకి వస్తాయని, జిన్‌పింగ్ నేతృత్వంలోని సెంట్రల్ మిలటరీ కమిషన్ (సిఎంసి) కింద పనిచేస్తాయని పిఎల్ఎ అధికారి ఒకరు తెలిపారు. 15లక్షల మందితో కూడిన పారా మిలటరీ పోలీసు బలగాలు ఇప్పటివరకు ద్వంద్వ కమాండ్ వ్యవస్థలో వుండేవి. సిఎంసి, స్టేట్ కౌన్సిల్ సంయుక్త నియంత్రణలో వుండేవి.

అభిశంసనతో పెరూ అధ్యక్షుడి రాజీనామా

లిమా : ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయటం ద్వారా గెలిచి అధికారం చేపట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పెరూ అధ్యక్షుడు పెడ్రో పాబ్లో కుజ్జిన్‌స్కీ (79), తనపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్ ఆమోదించటానికి ముందే పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'రాజ్యాంగబద్ధంగా, సక్రమంగా' అధికార బదిలీని ముగిస్తానని హామీ ఇచ్చిన కుజ్జిన్‌స్కీ, ఇప్పుడు దేశంలో కొనసాగుతున్న రాజకీయ వాతావరణం పాలనను అసాధ్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎటువంటి తప్పూ చేయలేదని, తనపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం కుట్రపూరితంగా ఆరోపణలు చేస్తుండటంతో తాను పదవీకాలం ముగియటానికి ముందే వైదొలగాల్సి వస్తోందని ఆయన అన్నారు. పదవి నుండి వైదొలుగుతున్న కుజ్జిన్‌స్కీ స్థానంలో ఉపాధ్యక్షుడు మార్టిన్ విజ్‌కారా పగ్గాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తన జీవితంలో దాదాపు 60 ఏళ్లు పూర్తి నిజాయితీతో దేశం కోసం పనిచేశానని, ఇప్పుడు ప్రతిపక్షం తనను అవినీతిపరుడిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని కుజ్జిన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా రికార్డ్ చేసిన ఈ వీడియో ప్రసంగాన్ని అధికార మీడియా ప్రసారం చేసింది. దేశ ఐక్యత, సామరస్యతల పరిరక్షణ కోసం జరుగు తున్న మార్గాన్వేషణలో తాను అడ్డంకి కాదల్చుకోలేదన్నారు. దేశానికి ఏది మంచిదయితే తనకూ అదే మంచిదవుతుందని, అందువల్లే పదవి నుండి తప్పుకోవాలను కుంటున్నానని ఆయన అన్నారు. అవిశ్వాస తీర్మానం ఆమోదానికి ముందే కుజ్జిన్‌స్కీ తన పదవికి రాజీనామాను ప్రకటించటంతో దానిని ఆమోదించేందుకు పార్లమెంట్ అంగీకరించిందని స్పీకర్ లూయిస్ గలరెట్టా ప్రకటించారు.

అమెరికా, ఉత్తర, దక్షిణ కొరియాల సమావేశం

మూన్ జే ఇన్ ఆశాభావం

సియోల్ : త్వరలో జరగబోయే సమావేశాలు పురోగతి సాధించినట్లైతే ఉత్తర కొరియా, అమెరికా, దక్షిణ కొరియాల నేతలతో త్రైపాక్షిక సమావేశం కూడా సాధ్యమవుతుందని దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ అన్నారు. ఉభయకొరియాల మధ్య సమావేశం జరిగిన తర్వాత జరగనున్న ఉత్తర కొరియా, అమెరికా సమావేశం చరిత్ర సృష్టిస్తుందని మూన్ వ్యాఖ్యానించారు. ఉభయ కొరియాల సదస్సు కోసం సన్నాహక సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ,, కొరియా ద్వీపకల్పంలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పడం, అణు నిరాయు ధీకరణ వంటి సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించుకుంటామని చెప్పారు.

కెటలన్ అధ్యక్షుడిగా జోర్డి తురుల్

పార్లమెంట్ స్పీకర్ ప్రతిపాదన

బార్సిలోనా : కెటలన్ ప్రాంత కొత్త అధ్యక్షుడిగా జోర్డి తురుల్ పేరును ప్రతిపాదించనున్నట్లు పార్లమెంట్ స్పీకర్ రోజర్ టొరెంట్ విలేకర్లకు చెప్పారు. అయితే వేర్పాటువాద కార్యకలాపాల్లో ఆయన పాత్ర వుందనే కారణంపై అనర్హుడయ్యే ముప్పును ఆయన ఎదుర్కొంటున్నారు. కాగా, శుక్రవారం కోర్టుకు హాజరు కావాలని తురుల్‌కు సుప్రీం కోర్టు నుండి సమన్లు అందాయి. తురుల్‌తో పాటు మరో ఇద్దరు వేర్పాటువాద నేతలకు కూడా ఈ సమన్లు అందాయి. వీరిని రిమాండ్‌కు పంపాలా వద్దా అనే విషయమై న్యాయమూర్తి నిర్ణయం తీసుకోనున్నారు. కెటలన్ ప్రభుత్వ మాజీ ప్రతినిధి అయిన తురుల్ వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడినందుకు గానూ దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చారు.

న్యూయార్క్‌లో మళ్ళీ మంచుతుపాను

వేలాది విమానాలు రద్దు, స్కూళ్ళు మూసివేత

న్యూయార్క్ : న్యూయార్క్ నగరాన్ని, దాని పొరుగు ప్రాంతాలను మంచు తుపాను మళ్ళీ భయపెడుతోంది. గత మూడు వారాల్లో నాల్గవసారి మంచు తుపాను సంభవించడంతో బుధవారం వేలాది విమానాలు రద్దు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారు. పెద్ద ఎత్తున మంచు కురిసే అవకాశముందని న్యూయార్క్ నగర పారిశుధ్య విభాగం హెచ్చరిక జారీ చేసింది. రోజంతా ఇదే పరిస్థితి వుంటుందని అధికారులు భావిస్తున్నారు. సాధ్యమైనంతవరకు ప్రభుత్వ రవాణా సాధనాలను ఉపయోగించాలని, వ్యక్తిగత వాహనాలు వాడవద్దని ప్రజలను కోరారు. షాంఘై నుండి న్యూయార్క్‌కు తిరిగే విమానాలతో సహా 2వేలకు పైగా విమానాలు రద్దయ్యాయి. మేరీలాండ్, దల్వారె, పెన్సిల్వేనియా తూర్పు ప్రాంతాల్లో కూడా మంచు తుపాను ప్రభావం వుంటుందని అధికారులు హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసి ఎండిగా సురేంద్రబాబు

డిజిగా ఉన్న సురేంద్ర బాబుకు పదోన్నతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2001 నుంచి 2004 మధ్య విజయవాడ కమిషనర్‌గా పనిచేశారు. 2006-2007 మధ్యలో హైదరాబాద్ సిటీ పోలీస్ అడిషనల్ కమిషనరేట్‌లో కో ఆర్డినేషన్ విభాగంలో సేవలందించారు. అంతకుముందు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. 2007లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొందారు. 2008లో మక్కా మసీదు బాబింగ్ కేసులో ఎపి పోలీస్ దళం సభ్యులుగా ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గానూ, ఎక్సైజ్ శాఖలోనూ పని చేశారు. వరంగల్ ఎన్‌ఐటి నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన ముంబైలో ఎంటెక్ చేసి డెహ్రాడూన్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో ఎస్‌పి శిక్షణ పొందారు. నల్లమలలోని గ్రే హౌండ్స్ అకాడమీలో మావోయిస్టు వ్యతిరేక శిక్షణను పూర్తి చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాలో ఫెలోషిప్ చేశారు. కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షులుగానూ ఉన్నారు. ఆయనకు 2003లో రాజీవ్ సర్వీస్ మెడల్ కూడా లభించింది.

ఫేస్‌బుక్ క్షమాపణ

ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ నవంబర్‌లో అమెరికాలో జరుగనున్న మధ్యంతర ఎన్నికలు లేదా భారత్, బ్రెజిల్‌లలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఏ విధంగానూ జోక్యం చేసుకోకూడదన్న నిర్ణయానికి తాము కట్టుబడివున్నామని చెప్పారు. లండన్‌కు చెందిన రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికా ఫేస్‌బుక్‌లోని దాదాపు 5 కోట్ల మంది వినియోగదారుల సమాచారాన్ని అక్రమంగా సేకరించి 2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు అనుకూలంగా వినియోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జుకర్‌బర్గ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

300 కోట్లు కోత

కోత కొద్ది కొద్ది మొత్తంలో కేంద్రం రీయింబర్స్ చేస్తోంది. అయితే ఇటీవలి నిధుల విడుదలలో మరింత జాప్యం జరుగుతోంది. అందుకోసమని నాబార్డు ద్వారా రుణం ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేంద్రం సమ్మతించింది. ఈ నేపథ్యంలో నాబార్డు పలు దఫాలుగా నిధులు విడుదల చేస్తూ వస్తోంది. అయితే నాబార్డు ద్వారా రూ.1400 కోట్లు తీసుకునేందుకు మొదట అనుమతించింది. రెండ్రోజుల్లోనే కేంద్రం మాట తప్పింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.1,089 కోట్లు మాత్రమే ఇవ్వాలని జల వనరుల శాఖ ఆదేశించింది. ఇప్పటికే విభజన హామీలను కేంద్రం అమలు చేయలేదని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో పోలవరానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధించారు. 2014 ఏప్రిల్ 1 నుంచి ఖర్చు చేసిన దానికి ఈ మొత్తం ఇస్తున్నట్లు పేర్కొంది. మిగతా నిధులను భవిష్యత్‌లో దఫాల వారీగా విడుదల చేస్తామని తెలిపింది.

ఐదో 'సారీ'

- మోడీ సర్కార్, స్పీకర్ అదే మాట
- అవిశ్వాసంపై చర్చలేదు
- కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన
- వాయిదాల పర్వంలో పార్లమెంట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో అదే సీన్ పునరావృతం అయింది. ఐదో రోజు కూడా అదే దశ్యం ఆవిష్కృతమైంది. కేంద్ర ప్రభుత్వం, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఐదు రోజుల నుంచి అదే పల్లవి పాడుతున్నారు. హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ సభ వాయిదాకు ముందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని, అయితే సభ ఆర్డర్‌లో ఉండాలని పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా ఇదే విధమైన ప్రకటన చేస్తున్నారు.. మరోవైపు స్పీకర్ కూడా అవిశ్వాస తీర్మానాలు అందాయని, సభ ఆర్డర్‌లో లేదనందున అనుమతించలేనని చెబుతూ వాయిదా వేస్తున్నారు. గురువారం కూడా అదే పునరావృతమైంది. కేంద్ర ప్రభుత్వంపై వైసిపి, టిడిపి ఎంపిలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభ ఆర్డర్‌లో లేదనే సాకుతో స్పీకర్ తిరస్కరించి, సభను శుక్రవారం నాటికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే 'డ్రామా' కొనసాగింది. సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే శుక్రవారానికి వేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించారు. దీంతో వరుసగా ఐదు రోజులు ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే పార్లమెంట్ సమావేశాలు తుడిచిపెట్టుకు పోయింది. పార్లమెంట్ నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

ఆరోసారి అవిశ్వాస నోటీసులు

కేంద్రంపై ఆరోసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, టిడిపి ఎంపి తోట నరసింహ గురువారం మధ్యాహ్నం లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు మరోసారి నోటీసులను అందజేశారు. శుక్రవారం జరిగే సభ కార్యకలాపాల ఎజెండాలో తమ తీర్మానాలను పెట్టాలని కోరారు. ఏపి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు తమ ఆందోళనను గురువారం కూడా కొనసాగించారు.

అవిశ్వాసంపై స్పీకర్ సానుకూలంగా లేరు: సుజనా చౌదరి

అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్‌లో చర్చ జరిగేలా చూసేందుకు తాము అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నామని టిడిపి సుజనా చౌదరి తెలిపారు. గురువారం లోక్‌సభ వాయిదా పడిన అనంతరం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.."సభ సజావుగా జరగడం లేదని వాయిదా వేస్తున్నారు. కానీ వాళ్ళ బిల్లులు మాత్రం ఆమోదం చేసుకుంటున్నారు. సభ వాయిదా అనంతరం ఎంపిలంతా స్పీకర్ సుమిత్రా మహాజన్‌ని కలిశాం. కానీ ఆమె సానుకూలంగా స్పందించలేదు" అని ఆయన చెప్పారు.



కేంద్ర ప్రభుత్వానికి దృష్టి లేదు: ఎం.డి సలీం, సిపిఎం

కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంట్ సజావుగా నిర్వహించాలనే ఆసక్తి లేదని, అందుకోసమే ఈ విధంగా వ్యవహరిస్తోందని సిపిఎం లోక్‌సభ పక్ష ఉపనేత ఎం.డి సలీం విమర్శించారు. గురువారం ఆయన పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఉభయ సభలను ఎందుకు నిర్వహించటం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గత రెండు వారాలుగా పార్లమెంట్ సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు.

పునరావాసానికి కేంద్రం మొండి చెయ్యి

(మొదటిపేజీ తరువాయి)

పునరావాస నిధులపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 2014 వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5135 కోట్లు ఖర్చు చేసిందని, అందులో రూ.562 కోట్లు కేంద్ర సహాయంగా విడుదల చేయడం జరిగిందని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. మిగిలిన రూ.7158 కోట్లు మాత్రమే నీటి పనులకు సంబంధించిన మొత్తమని ఆయన పేర్కొన్నారు. అందులోనూ రూ. 5364 కోట్లు విడుదల చేసామని వివరించారు. దీంతో ఇక కేంద్రం నుంచి వచ్చేది కేవలం రూ. 1800 కోట్లుగానే అంతర్లీనంగా తెలుస్తోంది. కొసమెరుపుగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 58,319 కోట్లకు కొత్త ప్రతిపాదనలు పంపించిందని, దానిని కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొనడం విశేషం.పునరావాస సహాయంపై ప్రస్తావన లేకుండా కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానంపై రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడుతోంది. పునరావాసానికి కేంద్రం నుంచి నిధులు రాకపోతే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది. తాజా రాజకీయ పరిస్థితుల్లో కేంద్రం నుంచి అదనపు నిధులువచ్చే అవకాశాలు కనిపించకపోగా, పథకంపై సిబిఐ దర్యాప్తునకు కూడా కేంద్రం ఆలోచన చేస్తుండడంతో కొత్త నిధులు ఇప్పట్లో వచ్చే పరిస్థితి కనిపించడం లేదని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

తాజా రాష్ట్ర బడ్జెట్‌లో పోలవరానికి దాదాపు పది వేల కోట్లు కేటాయించినప్పటికీ, దానితో పథకం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని ఆయన అంటున్నారు. పోలవరాన్ని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులపై ఇప్పటికే కేంద్రంతో అనేక పర్యాయాలు సంప్రదింపులు చేశామని, అయినప్పటికీ నిధులు ఆశించిన స్థాయిలో రావడం లేదని, ఇప్పుడు మారిన రాజకీయ సీన్‌తో మరిన్ని ఆర్థిక కష్టాలు తలెత్తే పరిస్థితి కనిపిస్తోందని ఆయన వివరించారు. కాగా, కేంద్ర మంత్రి సమాధానాన్ని అధ్య యనం చేస్తామని, మరోసారి కేంద్రంతో మాట్లాడుతామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు.

తాజా నిధుల్లో కోత

తాజాగా పోలవరం నిర్మాణానికి రూ. 1400 కోట్ల రూపాయలను రుణంగా ఇచ్చేందుకు ప్రకటించిన కేంద్రం అందులోనూ కొంత కోత పెడుతూ తాజాగా నిర్ణయించినట్లు తెలిసింది. కేవలం 1089 కోట్లు ఇస్తూ మిగిలిన 311 కోట్లను కోత పెట్టినట్లు సమాచారం.

దీనిపైనా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు 311 కోట్ల రూపాయలను కోత పెట్టారన్నది అర్థం కావడం లేదని, దీనిపై అధ్యయనం చేస్తున్నామని అధికారులంటున్నారు.

అయిదు జిల్లాలో సేద్యం శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వానికి ఏమేరకు చిత్తశుద్ధి ఉందో అర్థమవు తోందన్నారు. గాలేరు నగరి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి రూ. 1000 కోట్లు అవసరమైతే రూ. 434 కోట్లు, వెలిగొండకు రూ. 1500 కోట్లు కావాల్సి ఉండగా రూ. 360 కోట్లు, హంద్రీ నీవాకు కేవలం రూ. 524 కోట్లే కేటాయించారని, ఈ నిధులు ఏమాత్రమూ సరిపోవన్నారు. పోలవరంతో సహా మిగిలిన అన్ని ప్రాజెక్టులన్నింటికీ నిర్వాసితులకు పునరావాస చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

రాజధాని ముంపు నివారణకు చర్యలేవీ - బొడ్డు నాగేశ్వరరావు

రాజధాని అమరావతి లోతట్టు ప్రాంతం కావడం వల్ల ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, అమరావతిని ఆనుకొని ఉన్న కొండవీటివాగు నుంచి ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారని, దీనిని నివారించేందుకు తీసుకున్న చర్యలేమిటో ప్రజలకు తెలపాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ నగరానికి బుడమేరు నుంచి ప్రమాదం ఉందన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

కొట్టేసిందన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లారని, ఇతర రాష్ట్రాలనూ రెచ్చగొడుతున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్‌ను తానే తీసుకున్నానని పవన్ కల్యాణ్ అంటున్నారని, తాను ఆ ప్రాజెక్ట్‌ను తీసుకోలేదని, నీతి ఆయోగ్ చెప్పిన మీదటే పోలవరాన్ని ఇప్పటి వరకు 54 శాతం పూర్తి చేయించామని వివరణ ఇచ్చారు. డబ్బులొస్తే 2019కి పోలవరాన్ని పూర్తి చేస్తామన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటి పరిరక్షణకు అంతా కట్టుబడి ఉండాలని సూచించారు. రాష్ట్రంలో 52 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి నదుల అనుసంధానం ద్వారా మహా సంగమం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందు కెళుతోందన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతి అంశమూ ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. పెద్ద నోట్లు రద్దు చేసి ప్రతి లావాదేవీ ఆన్‌లైన్ చేయాలని సూచించింది తానేనని గుర్తు చేశారు. రాజకీయాల్లో సేవే కొలమానంగా ఉండాలని, చేసే పనులబట్టే ఓట్లు అడగాలని అన్నారు. రాజకీయాల్లోకి

మీరూ.. సిబిఐతో విచారణ చేయించుకుంటారా?

వచ్చే వారు, ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నవారూ దీన్ని గుర్తించుకోవాలని పరోక్షంగా పవన్‌ను జగన్‌లను ఉద్దేశించి అన్నారు.

ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా గురువారం శాసనమండలిలో సాగునీటి ప్రాజెక్టులపై స్వల్ప వ్యవధిపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో పలు మార్లు బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ అడ్డుతగలడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. పోలవరం భూ సేకరణ, పునరావాసంకు సంబందించిన విషయం కేంద్రందే బాధ్యతనన్నారు. ప్రధాని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తున్న 90 :10 శాతంతో బాటు పారిశ్రామిక రాయితీలు మన రాష్ట్రానికి ఎందుకు ఇవ్వరని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తామంటే కమ్యూనిస్టు పార్టీలతో బాటు ప్రజలను నచ్చజెబుతానని ఆయన తెలిపారు. తన జీవితం తెరచిన పుస్తకమని, తన కుటుంబం అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రత్యేకహోదా , విభజన హామీలు అమలు కాక పోవడంతో నేడు అన్ని రాజకీయపార్టీలు రోడ్డెక్కారని చంద్రబాబు అనగానే బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ జోక్యం చేసుకుని రోడ్డుపైకి వెళ్లే విదంగా మీరు చేశారని అనడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది.

ఈ విషయంపై చంద్రబాబు మాట్లాడుతూ ప్రత్యేకహోదా, హామీలు అమలు కాక పోవడంతో ప్రజలందరూ రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితులు కల్పించారన్నారు. జాతీయరహదారుల దిగ్బంధనం కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మాధవ్ మరలా జోక్యం చేసుకుని గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో కూడా ఇలాగే మద్దతునివ్వడంతో రాష్ట్రం వెనుకబడిందని అన్నారు. వెంటనే చంద్రబాబు మాట్లాడుతూ నేను ఆందోళనలకు మద్దతునివ్వలేదని, జపాన్ తరహా ఉద్యమం చేయమని చెప్పానని అన్నారు. మరలా మాధవ్ స్పందిస్తూ ప్రత్యేక హోదా ప్రస్తుతం ఎక్కడా లేదన్నారు.

హోదాపై ప్రజా బ్యాలెట్‌కు సిద్ధం : విఠపు

రోడ్డుపై నిరసనలు తెలిపే వారిని చులకనగా మాట్లాడటంతో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కత్తి నరశింహారెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రత్యేకహోదా ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతునివ్వడం జరిగిందని తెలిపారు. ప్రజలను అవమానపరిస్తే సహించేది లేదని గట్టిగా హెచ్చరించారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఏపికి రావాల్సిన నిధులను రాబట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మాధవ్ వ్యాఖ్యలను ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, టిడిపి ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తప్పుబట్టారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

- ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలతో గంటా భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర మానవ వనరుల అభివ ద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలతో గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు అవసరమైన విధి విధానాలు, చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉన్న టైం టేబుల్ లోనే గంట పాటు ఫౌండేషన్ కోర్సు శిక్షణను ఇవ్వాలని నిర్ణయించారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు సమర్థవంతంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, ఎ.ఎస్ రామకృష్ణ, కత్తి నరసింహారెడ్డి, విఠపు బాలసుబ్రమణ్యం, మాధవ్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐదు సినిమాలు చేశాక తెలిసింది



కాజల్ అగర్వాల్

'ఓ నటిగా విభిన్నమైన సినిమాలు చేయాలని అనుకున్నాను. ఆ ప్రయత్నంలో భాగంగానే మంచి పాత్రలు చేస్తూ వస్తున్నాను. కమర్షియల్, కొత్త తరహా సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ వస్తున్నాను' అని కాజల్ అగర్వాల్ చెప్పింది. కల్యాణ్ రామ్ , కాజల్ కాంబినేషన్‌లో పదేళ్ల క్రితం 'లక్ష్మీ కల్యాణం' వచ్చింది. ఆ చిత్రంతోనే కాజల్ తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేసింది. ఇప్పుడు మళ్లీ మరోసారి వీరిద్దరూ హీరో హీరోయిన్లుగా 'ఎం.ఎల్.ఎ' చేశారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గురువారం కాజల్ విలేకరులతో మాట్లాడింది.

- కల్యాణ్ రామ్‌తో పదేళ్ల క్రితం నటించాను. ఇప్పుడు మళ్లీ నటించడం చాలా సంతోషమనిపించింది. ఈ ప్రయాణంలో ఇద్దరమూ ఎంతో మార్పు చెందాం. ఇద్దరి అనుభవాలను పంచుకున్నాం. నా పాత స్నేహితుడిని కలిసినట్లు అనిపించింది. ఎవరికివారి వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలతో బిజీగా ఉంటున్నాం. ఈ పదేళ్ల కాలంలో ఓ పబ్లిక్ ఫంక్షన్‌లో కలిశానంతే. మధ్యలో కల్యాణ్‌ని ఎప్పుడూ కలవలేదు. 'లక్ష్మీకల్యాణం' చేసేటప్పుడు ఒక సినిమా చేస్తే చాలు. మానేసి వెనక్కి వెళ్లిపోయి ఎం.బి.ఎ చదువుకుందామనిపించింది. కానీ జీవితం వేరేలా ఉంటుంది కదా! ఈ ప్రయాణం పట్ల నేను చాలా హ్యాపీగా ఉన్నాను. దేవుడికి, తెలుగు ప్రేక్షకులకు ఇంత మంచి లైఫ్ ఇచ్చి..వారి కుటుంబంలో నన్ను ఒకరిగా భావించినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా.
- నాకు తెలుగు ఇండస్ట్రీలోనే లైఫ్ అని ఐదు సినిమాలు చేసిన తర్వాత అనిపించింది. నా 'మగధీర' చేసేటప్పుడు వందశాతం ఇదే నా లైఫ్ అని అర్థమైంది. 'ఎం.ఎల్.ఎ' సినిమా విషయానికి వస్తే.. ఇందులో నేను ఎన్నారై అమ్మాయి పాత్రలో కనపడతాను. నా క్యారెక్టర్‌లో ఓ షేడ్ ఉంటుంది. నేను ఎందుకు అలా చేస్తుంటానో అనే షేడ్ ఇంటర్వెల్ వరకు కనపడదు. దానికి కారణాలేంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే.
- చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్ చేశాను. మంచి మెసేజ్ కూడా ఉంది. అయితే ఈ మెసేజ్ హార్డ్ వేలో కాకుండా ఎంటర్‌టైనింగ్ తరహాలో ఉంటుంది. నేను చేస్తున్న సినిమాలు, పాత్రలు పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. వీలైనంత కొత్తదనం ఉన్న సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను.
- నేను సిన్సియర్‌గా నా పాత్రలకు న్యాయం చేయడానికి ట్రై చేస్తున్నాను. నందమూరి కల్యాణ్‌రామ్ తను చేసే పని పట్ల చాలా నిజాయితీగా, ప్యాషన్‌తో ఉంటాడు. చాలా ప్రొఫెషన్, ఫోకస్డ్‌గా ఉంటాడు. ప్రేక్షకులు ఆసక్తికరమైన సినిమాలు చూడాలనుకుంటుంటారు.

మల్టీస్టారర్ చేస్తున్నాం




రాజమౌళి




ఎన్టీఆర్

దర్శకధీరుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత ఏం సినిమా చేస్తారు? అన్నదానిపై చాలా పెద్ద చర్చ జరిగింది. దక్షణాది, బాలీవుడ్ తారలతో కలిసి 'మహాభారతం' తీస్తారని అనుకున్నారు. ఆ ఆలోచన ఉంది అని జక్కన్న కూడా ఓ వేడుకలో ప్రకటించారు. ఈ లోగా ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో మల్టీ స్టారర్ చేస్తారని ప్రచారం జరిగింది. రాజమౌళితో ఈ ఇద్దరు స్టార్స్ దిగిన ఫొటోలు కూడా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. ఇటీవలే ఎన్టీఆర్, రామ్ చరణ్ ఈ చిత్రం ఫొటో షూట్ కోసం అమెరికాలోని లాస్‌ఏంజెల్‌కు వెళ్లారు. అప్పుడూ తాము సినిమా చేస్తున్నట్టు అధికారిక ప్రకటన అయితే ఎవరి నుంచీ రాలేదు. ఎట్టకేలకు రాజమౌళి దీనిపై గురువారం ఓ ప్రకటన చేశారు. మల్టీస్టారర్ చేస్తున్నామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా 23 సెకండ్ల నిడివి గల ఓ వీడియోను విడుదల చేశారు. దానికి 'యాస్ ఆర్‌ఆర్‌ఆర్' అని పేర్కొన్నారు. రాజమౌళి, తారక రామారావు, రామ్ చరణ్ ...ఇలా ఈ మూడు పేర్లు వచ్చేలా ట్రిపుల్ ఆర్ పేరుతో వీడియో విడుదల చేశారు. ఇది టైటిల్ కాదని కూడా స్పష్టం చేశారు. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని పేర్కొన్నారు. డీవీవీ దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



రామ్ చరణ్

వెంకీకి జోడీగా శ్రియ





యువ హీరోయిన్లు ఎవరూ సీనియర్ హీరోలతో చేయడానికి అంగీకరించడం లేదు. ఒక వేళ వాళ్లతో చేస్తే సీనియర్ హీరోయిన్ ముద్ర పడిపోతుందన్న భయంతో బాలకృష్ణ, చిరంజీవి, వెంకటేశ్ వంటి వారితో చేయడానికి నిరాకరిస్తున్నారు. దర్శకుడు తేజతో వెంకటేశ్ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఆ చిత్రంలో వెంకీకి సరిపడే కథానాయిక కోసం తీవ్రంగా అన్వేషించారు. చివరకూ శ్రియను ఎంపిక చేశారు. ఈమెను కథానాయికగా ఎంపిక చేయడానికి చాలా సమయం పట్టింది. ఈ సినిమాలో చేసేందుకు బాలీవుడ్ హీరోయిన్లు అతిదిరావును కూడా సంప్రదించారు. డేట్స్ ఖాళీ లేవని తప్పించుకుంది. ఈనెల 19వ తేదీనే వివాహం చేసుకున్న శ్రియ ఈ చిత్రంలో చేయడానికి అంగీకరించింది. త్వరలో ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొననుంది శ్రియ.



అక్షిత, మనిష్ బాబు, బాబీ

'ప్రశ్నిస్తా' చిత్రీకరణ ప్రారంభం

జనం ఎంటర్టైన్మెంట్ పతాకంపై సత్య రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. సత్యరెడ్డి కొడుకు మనిష్ బాబును హీరోగా పరిచయం చేస్తూ ఈ సినిమా రూపొందిస్తున్నారు. రాజా వన్నెం రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ గురువారం ఈ సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. అక్షిత కథానాయికగా నటిస్తుంది.

గత రెండేళ్లుగా మనీష్‌కి నటనలో శిక్షణ పొందాడు. అక్షిత కూడా తెలుగమ్మాయే. మరో దివ్య భారతి లాంటి అందంతో, నటనలో ఈ సినిమాతో అక్షిత మంచి గుర్తింపు తెచ్చుకుంటుందని నమ్మకముందని నిర్మాత తెలిపారు.

దర్శకుడు రాజా వన్నెం రెడ్డి మాట్లాడుతూ ' నా మొదటి సినిమాని డైరెక్ట్ చేస్తున్నాను అన్నట్టుగా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నాను. ఈ సమయంలో మా గురువు దాసరి నారాయణ రావు ఉంటే చాలా సంతోష పడేవారు. ఎందుకంటే ఈ సినిమా సబ్జెక్టు ఆయనకు కూడా తెలుసు' అని చెప్పారు.

గుమ్మడి కాయ కొట్టేశారు



షూటింగ్ చివరి రోజు సందర్భంగా సావిత్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కీర్తి సురేశ్

కీర్తి సురేశ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'మహానటి'. అలనాటి కథానాయిక సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. కీర్తి సురేశ్, సమంత, మోహన్ బాబు, రాజేంద్రప్రసాద్, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, నాగ చైతన్య, షాలిని పాండే, మాళవిక నాయర్, భానుప్రియ, దివ్యవాణి, శ్రీనివాస్ అవసరాల, దర్శకులు క్రిష్, తరుణ్ భాస్కర్ తదితరులు నటిస్తున్నారు. నాగఅశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. వైజయంతీ మూవీస్-స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం బుధవారంతో చిత్రీకరణ పూర్తి చేసుకొంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

నిర్మాత ప్రియాంక దత్ మాట్లాడుతూ 'మా టెక్నికల్ టీమ్ ఎంతో నేర్పుతో క్రియేట్ చేసిన బ్లాక్ అండ్ వైట్ ఎరా ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురి చేయడమే కాక అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తుంది. ఏ విషయంలోనూ రాజీపడకుండా అద్భుతమైన చిత్రంగా నిర్మించాం. ఆఖరి రోజున ఆఖరి సన్నివేశం చిత్రీకరణ పూర్తయిన తర్వాత గుమ్మడికాయ పూజలో భాగంగా సావిత్రిగారి చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న తరుణంలో కనీరు పెట్టుకొంది. మే 9న విడుదలవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక మరపురాని అనుభూతిని మిగుల్చుతుంది" అని అన్నారు.

ఈ సినిమాను కొనుక్కోవాలనిపించింది

శర్వానంద్



కృష్ణ విజయ్, నారాయణరావు, నారా రోహిత్, వేణు ఊడుగుల, శర్వానంద్, శ్రీవిష్ణు తదిరులు

'ఈ సినిమా ట్రైలర్ చూడగానే మార్నింగ్ షో చూడాలనిపించింది. అంతే కాకుండా ఈ సినిమాను నేను కొనుక్కుంటే బావుంటుందనిపించి.. విజయ్‌కి కాల్ చేశాను. కానీ అప్పటికే సినిమా బిజినెస్ పూర్తయ్యింది. మంచి సినిమాను మిస్ చేసుకున్నానే అనిపిస్తుంది. ఇలాంటి మంచి సినిమాలు ఈ మధ్య ఎక్కువగా వస్తున్నాయి. గత ఏడాది, ఈ ఏడాది కొత్త దర్శకులు మంచి కథలతో సినిమాలు చేస్తున్నారు. ట్రైలర్ చూసి శ్రీవిష్ణుకి నేను పెద్ద ఫ్యాన్ అయ్యాను. నా కథలాగా అనిపించింది. సినిమా ఎంతో నిజాయితీగాఉండబోతుందనిపిస్తుంది' అని శర్వానంద్ అన్నారు.

శ్రీ విష్ణు హీరోగా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం శుక్రవారం విడుదల కానుంది. వేణు ఊడుగుల దర్శకత్వం వహించారు. 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ కథానాయికగా నటించింది. ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణ రావు అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్‌లపై సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో నిర్వహించారు.

రాజ్ కందుకూరి మాట్లాడుతూ 'ఈ మధ్య విడుదలైన సినిమాలను గమనిస్తే కొత్త డైరెక్టర్స్ ప్రభంజనం సృష్టిస్తున్నారు. అదే కోవలోకి వేణు ఉడుగుల కూడా రాబోతున్నాడని నేను కచ్చితంగా చెప్పగలను" అని అన్నారు.

జి.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ "నారా రోహిత్ హీరోగానే కాదు.. నిర్మాతగా కూడా కొత్త దర్శకులను పరిచయం చేస్తున్నారు. ఇండస్ట్రీకి నిర్మాతే ప్రాణం అని నమ్మే వాళ్లలో నేను ఒకడ్ని. ఈ సినిమా ట్రైలర్ చూడగానే పెద్ద హిట్ అవుతుందనే వైబ్రేషన్ కలిగింది. 'ఆకలిరాజ్యం'లో తండ్రి కొడుకుల మధ్య జరిగే సంఘర్షణ అలాగే గుర్తుండి పోయింది. చాలా సంవత్సరాలు మనకు గుర్తుండిపోయిన సీన్‌ను నాకు గుర్తుకు తెచ్చిన సినిమా ఇది' అని పేర్కొన్నారు.

శ్రీవిష్ణు మాట్లాడుతూ 'వేణు కథ చెప్పినప్పుడు 'ఎంట్రా ఇదేదో నా స్టోరీలాగే ఉందే' అనిపించింది. నన్ను ఏదో పక్కంట్లోనో, ఎదురింట్లోనో ఉండి గమనించి సినిమా కథ రాసుకున్నారనిపించింది. నా కోసమైనా సినిమా చేయాలి. ఎందుకంటే ఎప్పుడైనా నా జీవితాన్ని సినిమాగా చూసుకోవాలంటే చూసుకోవచ్చు అనిపించి.. సరే సినిమా చేద్దాం. నాకు, దర్శకుడికే కాదు.. సినిమాలో పనిచేసే అసిస్టెంట్ దర్శకులు సహా అందరికీ కనెక్ట్ అయింది. సినిమా రిజల్ట్ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. సినిమా చూశాక నలుగురైదుగురు మాట్లాడుకుంటే చాలనిపించింది. సినిమా చూసిన వారందరూ 'సినిమా భలే ఉందే' అన్నారు. చాలా మంది సొసైటీ కోసం చదువుతుంటారు. మనకు నచ్చిన పని చేయడానికి ఇంట్లో వాళ్లని ఒప్పించడానికి ప్రయత్నించాలి. ఒక అమ్మాయి వెంట పడి ప్రేమ కోసమే ఒప్పించేటప్పుడు.. జీవితం కోసం ఎంత ఒప్పించాలని చెప్పేది సినిమా' అని పేర్కొన్నారు.

నారా రోహిత్ మాట్లాడుతూ 'ఈ కథను శ్రీవిష్ణు చెప్పినప్పుడు నాకు నా స్నేహితుడు ఒకడు గుర్తుకు వచ్చాడు. తను ఇంటర్ చదివే రోజుల్లో నేషనల్‌లో బాస్కెట్‌బాల్‌కి సెలక్ట్ అయితే వాళ్ల ఇంట్లోవాళ్లు ఒప్పుకోకపోవడంతో తను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. అలాంటి వాళ్ల జీవితాలను తెరపై చూపే చిత్రమిది. అందరికీ కచ్చితంగా కనెక్ట్ అవుతుంది' అని అన్నారు.



నేలనెరిగి వ్యవసాయం

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయంలో దిగుబడులతో పాటు ఖర్చులూ రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన ఎరువులు మొదలైన వాటిపై పెట్టే ఖర్చు రోజురోజుకీ పెరుగుతుండటం వల్ల వ్యవసాయంలో గిట్టుబాటు అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. అందుకే వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు నేలనెరిగి వ్యవసాయం చేయాలని సలహాలిస్తున్నారు. ఆ వివరాలు మీ కోసం.

నేల మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ మొక్క పెరుగుదల, దిగుబడుల్లో ప్రధానపాత్ర వహిస్తుంది. రసాయన ఎరువులపైపెట్టే పెట్టుబడులు తగ్గించుకొని, దిగుబడులు పెంచుకునే దిశగా వ్యవసాయంలో మార్పులు రావటం ఎంతైనా అవసరం. దీని కొరకు రైతు పండించే పొలం పోషక సామర్థ్యాన్ని తెలుసుకుని, అవసరమైన మేరకు ఎరువులు వాడుకోవాలి. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం లేకపోవడంతో విచక్షణా రహితంగా తన పొలం పోషక సామర్థ్యం తెలుసుకోకుండా అధికంగా లేదా మరీ తక్కువగా ఎరువులు వాడటం వల్ల దిగుబడులు బాగా తగ్గటమే కాక నేల వాతావరణంలో దుష్పరిణామాలు ఏర్పడతాయి. ఇలాంటివాటిని నివారించడానికి భూసార పరీక్షలు చేయించుకొని, పొలంలో ఏయే పోషకాలు ఎంతెంత మోతాదులో ఉన్నాయో, అవి వేసే పంటకు ఎంత మోతాదులో ఉపయోగపడతాయో తెలుసుకోవటం ఉత్తమమైన మార్గం.

పైరుకు కావలసిన అన్ని పోషకాలు ఎంతో కొంత పరిమాణంలో నేలలో సహజంగానే ఉంటాయి. ఇది పైర్లకు లభ్యం కావడం అనేది నేల భౌతిక, రసాయన లక్షణాలు, సూక్ష్మజీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పోషకాల సమతుల్యత పాటించడానికి, రసాయన ఎరువులు సక్రమంగా వినియోగించు



కోవడానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి మట్టి నమూనాలను సేకరించుకొని, భూసార పరీక్షా కేంద్రాలలో విశ్లేషింపజేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశం

రసాయన పద్ధతుల ద్వారా లేదా ఇతర విశ్లేషణ పద్ధతుల ద్వారా నేలలో మొక్కలకు కావాల్సిన పోషక పదార్థాలు ఏయే పాళ్లలో ఉన్నాయో తెలుసుకునేందుకు, మొక్కల పెరుగుదలకు, భూమిలోని ఇతర పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు, భూసార పరీక్షలు ఎంతో అవసరం. నేలలో సారం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి మట్టిని పరీక్షించాలి. సంవత్సరాల తరబడి పైర్లు వేయటం వల్ల నేల నుంచి నత్రజని, భాస్వరం, పొటాషియం మొదలైన పోషక పదార్థాలు తరిగిపోతుంటాయి. పంట దిగుబడి తగ్గకుండా ఎప్పటికప్పుడు ఈ పోషక పదార్థాలు ఎరువుల ద్వారా మొక్కలకు అందిస్తూ ఉండాలి. ఎంత మోతాదులో ఎరువు వేయడం అనేది ఆ నేలలో పోషకపదార్థాల స్థాయిని బట్టి నిర్ణయించాలి. ఇష్టం వచ్చినట్లు ఎరువులను వాడితే అనేక దుష్పరిణామాలతో పాటు ఖర్చూ పెరుగుతుంది.

కాబట్టి ప్రతి రైతు తన పొలంలో సకాలంలో పరీక్ష చేయించి, ఏ పైరుకు కచ్చితంగా ఎంత ఎరువు వేయాలో పైరు విత్తకముందే తెలుసుకోవాలి. మన రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు ఎంత మోతాదులో నత్రజని, భాస్వరం పొటాష్, ఇతర సూక్ష్మ పోషకాలను వేయాలో తెలుసుకోవడానికి వేసవి కాలంలో పంటలు లేకుండా నేలలు ఖాళీగా ఉన్నపుడు భూసార పరీక్షలు చేయించుకోవాలి.

మట్టి పరీక్ష వల్ల ప్రయోజనాలు

- ఏ నేల, ఏ పంటకు అనుకూలమో తెలుసుకోవచ్చు.
- నేలలోని పోషకాల స్థాయిని తెలుసుకుని తర్వారా పంటకు అవసరమైన ఎరువులను సిఫారసు చేయవచ్చు.
- భూసార పటాలను తయారుచేసి, గ్రామాల వారీగా ఎరువులను సిఫారసు చేయవచ్చు.
- నేల సమస్యలను (క్షార/ ఆమ్ల/ చవుడు) తెలుసుకొని, సవరణ చర్యలు చేపట్టవచ్చు.
- భూసార పరీక్షా ఫలితాల ఆధారిత ఎరువుల వాడకం వల్ల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడమేకాక అధిక దిగుబడులూ పొందవచ్చు.

భూసార పరీక్షలలోని దశలు

- రైతుల పొలం నుంచి మట్టి నమూనాల సేకరణ
- భూసార పరీక్షా కేంద్రాలలో మట్టినమూనాల విశ్లేషణ
- ఫలితాల ఆధారంగా ఎరువుల సిఫార్సు, సమస్యాత్మక నేలల బాగుకు తగు సూచనలు

రైతుల పొలం నుంచి మట్టి నమూనాల సేకరణ

సాధారణంగా పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు ఐదెకరాల విస్తీర్ణానికి ఒక్క మట్టి నమూనా తీస్తే సరిపోతుంది. అలా కాకుండా నేల రకం, రంగు, సాగునీటి వసతి, మెరక, పల్లం, సేద్య పద్ధతులు, పంట దిగుబడులలో తేడా ఉంటే, తేడా ఆధారంగా వేరువేరు నమూనాలు తీయాలి. నమూనాలు తీయదలచిన పొలంలో 10–12 చోట్ల ఆరు అంగుళాల 'V' ఆకారపు గుంతలు తీసి, గుంత పై నుంచి దిగువ వరకూ ఒక అంగుళం మందంలో పలుచని పొర వచ్చే విధంగా మట్టిని సేకరించాలి. అలా సేకరించిన మట్టిని గోనెపట్టా/ పాలిథీన్ షీట్/ గుడ్డ మీద వేసి బాగా కలిపి చతుర్విభజన పద్ధతిలో 1/2 కిలో మట్టి మిగిలేవరకూ చేయాలి. ఇలా సేకరించిన మట్టిని శుభ్రమైన గుడ్డ సంచిలోగానీ పాలిథీన్ సంచిలోగానీ వేసి నమూనాకు సంబంధించిన పూర్తి సమాచారంతో భూసార పరీక్షా కేంద్రానికి పంపించాలి.

నమూనాల సేకరణ పనిముట్లు

పార/తాపీ/ఆగర్/స్క్రూలాంటి ఆగర్/ట్యూబ్‌లాంటి ఆగర్/ పోస్ట్‌హూల్ ఆగర్, ప్లాస్టిక్ బకెట్, గోనెసంచి, గుడ్డ సంచులు, పిస్టిల్, మోర్టార్, స్కేల్, 2 మిల్లీమీటర్ల జల్లెడ మొదలైనవి.

మట్టి నమూనాలు సేకరించడంలో మెళకువలు



- పొలంలోని మట్టి లక్షణాలకు పోలికలేని చోట్ల లేదా ప్రాతినిధ్యం వహించని చోట్ల ఉదాహరణకు చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల దగ్గర, కాలిబాటలలో, పశువుల ఎరువు/ కంపోస్ట్ ఎరువుల కుప్పలు నిల్వ ఉంచిన చోట్ల నమూనాలు సేకరించకూడదు.
- పైరులేని సమయంలో సాధారణంగా ఏప్రిల్ / మే నెలలలో నమూనాలు సేకరించాలి. ఒకవేళ అత్యవసర పరిస్థితులలో పైరు వరుసల మధ్య నుంచి నమూనాలు సేకరించాలి.
- రసాయనిక ఎరువులు వేసిన 45 రోజులలోపు నమూనాలు సేకరించకూడదు.
- నీటి తడి ఇచ్చి వెంటనేగానీ లేదా నీరు నిలిచి బురదగా ఉన్న నేల నుంచి గానీ నమూనా సేకరించకూడదు.
- నమూనా తీసేటప్పుడు నేలపై ఉన్న ఆకులు, చెత్తచెదారాలు తొలగించాలిగానీ పై మట్టి పొరను గీకరాదు.
- బాగా సారవంతమైన చోట్ల మరీ నిస్సారంగా ఉన్నచోట్ల తీసిన మట్టిని కలపకూడదు.
- నమూనా సేకరించుటకు తీయు గుంతలోతు (6/9/12 అంగుళాలు) వేయబోవు పంటను బట్టి నిర్ణయించుకోవాలి.
- చౌడు పొలాల్లో రెండు నమూనాలు 0–15 సెం.మీ., 15.30 సెం.మీ. లోతులో విడివిడిగా తీయాలి.
- పండ్ల తోటలు వేయదలచిన పొలంలో 3–4 చోట్ల 6 అడుగుల గుంతలను తీసి, ప్రతి అడుగుకు పై నుంచి కిందకి ఒక మట్టి నమూనా చొప్పున సేకరించాలి.
- సూక్ష్మ పోషకాల విశ్లేషణకు మట్టి నమూనాలు సేకరించేప్పుడు ఇనుముతో చేసిన పనిముట్లను వాడరాదు. చెక్కను మాత్రమే ఉపయోగించాలి.

భూసార పరీక్షా కేంద్రాలలో మట్టి నమూనాల విశ్లేషణ



భూసార పరీక్షా కేంద్రాలలో నేల రంగు, స్వభావము వంటి భౌతిక లక్షణాలేకాక ఉదజని సూచిక, లవణ పరిమాణము, సేంద్రియ కర్బనము, లభ్య నత్రజని, లభ్య భాస్వరం, లభ్య పొటాష్, లభ్య సూక్ష్మ పోషకాలను నిర్ధారిస్తారు. సమస్యాత్మక నేలలకు వేయవలసిన జిప్సం/సున్నం పరిమాణాన్ని నిర్ణయిస్తారు.

ఫలితాల ఆధారంగా సిఫార్సులు/ సూచనలు


భూసార పరీక్షా ఫలితాలు, పైర్లకు వేయాల్సిన ఎరువుల మోతాదులు, చౌడు మొదలగు సమస్యలపై సలహాలు, సూచనలు తెలుగులో ముద్రించబడిన కార్డు ద్వారా రైతులకు అందజేస్తారు. పైరు రకాన్ని బట్టి అందుబాటులోని నీటి వసతి లేదా వర్షాధారపు పరిస్థితిని బట్టి, ఖరీఫ్ లేదా రబీ సీజన్లను బట్టి నేలలో ఉన్న పోషక పరిమాణాన్ని పరిగణనలోనికి తీసుకుని అవసరమైన కచ్చితమైన మోతాదులను సిఫార్సు చేస్తారు.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత నంబరుకూ కాల్ చేయవచ్చు-1800 425 0430

డాక్టర్ పి. వెంకట సుబ్బయ్య, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ (సస్యపోషణ)
డాక్టర్ వి. జ్యోతి, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ (విస్తరణ విభాగం)
డాక్టర్ యం. రాజశ్రీ, సీనియర్ సైంటిస్ట్
డాక్టర్ పి. రత్నప్రసాద్, పరిశోధనా సహ సంచాలకులు
డాక్టర్ కె.ఎల్. రావు, కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు, కృష్ణాజిల్లా.

గట్టిపడే దశలో

మార్చి నెలలో వరి పంట చిరు పొట్ట దశ నుండి గింజ పాలు పోసుకుని గట్టిపడే దశ వరకు ఉంటుంది. ఈ పరిస్థితులలో వరి సాగు చేయు రైతులు చేయవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు.



- **అగ్గి తెగులు (మెడ విరుపు):** వెన్నుల మెడ భాగంలో ఆశించుట వలన వెన్నులు విరిగిపోతాయి. తాలు గింజలు తయారవుతాయి. నివారణకు పైరు నిండు పొట్టదశలో ఉన్నప్పుడు ట్రై సైక్లోజోల్ 0.6 గ్రా॥ లేదా ఐసోప్రోథయోలీన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
- కాండం కుళ్ళు తెగులు పైరు పాలు పోసుకునే దశలో వస్తుంది. నివారణగాను పొలంలో మురుగు నీరు నిల్వకుండా చూడాలి. ప్రారంభదశలోనే తెగులు లక్షణాలు గమనించిన వెంటనే వాలిడామైసిన్ 2.0 మి.లీ. లేదా హెక్సాకోనజోల్ 2.0 మి.లీ. లేదా కార్బెండిజమ్ 1.0 గ్రా॥ లేదా బెనోమిల్ 1.0 గ్రా॥ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిలకల క్రింది వరకు తడిచేలా పిచికారీ చేయాలి.
- మానిపండు తెగులు పైరు పూత దశలో వస్తుంది. కార్బెండిజమ్ 1.0 గ్రా॥ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 2.5 గ్రా॥ లీటరు నీటికి కలిపి వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం రోజుల తరువాత రెండవసారి పిచికారీ చేయాలి.



డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్.జి. రంగా
వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.

మనవి

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. దక్షిణాది ధాన్యాగారంగానూ ప్రసిద్ధి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవగర్ర, అటువంటి కీలకమైన ఈ రంగానికి సంబంధించిన సమాచారం, శాస్త్రవేత్తల, నిపుణుల విశ్లేషణలు, ఇంటర్వ్యూలు, గణాంకాలతో 'అగ్రిప్లస్' ప్రతి శుక్రవారం మీ ముందుకొస్తోంది. దీనిపై మీ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయగలరు. దీనిని మరింతగా పరిపుష్టం గావించేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులు తమ వంతు తోడ్పాటును అందించాలని మనవి.

మా చిరునామా :

'అగ్రిప్లస్', ప్రజాశక్తి దినపత్రిక, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
ఇ-మెయిల్ : editorprajasakthi@gmail.com



చిన్నారి

నేనెవరిని?

నేనేమో చిన్న పురుగు
ఆలనా పాలనా మెరుగు
దారమౌను నా నోటి నురుగు
రైతులాదాయం పెరుగు?

జవాబు : పట్టుపురుగు

జోక్:

తండ్రి : ఏంట్రా రవీ! కుర్చీ ఎక్కడ నుంచి తీసుకొస్తున్నావు?

రవి : ఇవాళ క్లాసులో టీచర్ నన్ను ప్రశ్న అడిగారు నాన్నా.. సమాధానం చెప్పాను. నన్ను మెచ్చుకుని 'టేక్ యువర్ సీట్' అన్నారు. అందుకే..

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలోని చుక్కలను కలిపి, రంగులు వేయండి!

థ్రెడ్ గార్డెన్ @ ఊటీ



పిల్లలూ..! మీరు పూల తోటలను చూసే ఉంటారుగా. అలాగే పూలు పూయడం, రాలిపోవడం గమనించే ఉంటారు. కానీ ఒక తోటలో పూలు రాలిపోవుట, వాడిపోవుట. అలాంటి పూలు ఎక్కడైనా ఉంటాయా అని ఆశ్చర్యపోతున్నారా? నిజమే పిల్లలూ అలాంటి పూలు ఊటీలో ఒక తోటలో ఉన్నాయి. ఆ తోటపేరే 'థ్రెడ్ గార్డెన్'. అక్కడ పూలన్నీ దారంతో చేసిన కృత్రిమపూలే. మీరు చాలాసార్లు అమ్మ దారం ఆధారంగా పూలు కట్టడం చూసే ఉంటారు. కానీ ఈ గార్డెన్‌లో దారంతోనే పూలు పూస్తాయి.



ఆంటోని జోసఫ్ అనే ఓ కళాకారుడి ఆలోచనల్లో ప్రాణం పోసుకున్నవే ఈ దారపు పూలు. ఆయన 12 ఏళ్ల కృషి ఫలితమే 'థ్రెడ్ గార్డెన్'.

లేలేత గులాబీలు, తెల్లతెల్లని మల్లెలు, కొలనులో కమలాలు, చూడచక్కని చామంతులు.. ఇలా రకరకాల పూలు ఎంతో సహజంగా కనిపిస్తాయి. అవి ముట్టుకుని చూస్తేగానీ మనకు తెలియదు అవి కృత్రిమపూలని. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి పూదోట లేదు. ఇది మనదేశంలో ఊటీలో ఉండటం విశేషం. ఇందులో దాదాపు 100 రకాలు పూలమొక్కలు కనువిందు చేస్తాయి. ఊటీలోని బోట్‌హౌజ్‌కు ఎదురుగా ఈ పూదోట ఉంది. పూలను తయారుచేయడానికి ఎలాంటి ఆధునిక పరికరాలను ఉపయోగించరు. వీటిని ప్రత్యేక శిక్షణ పొందిన 50 మంది కళాకారులు తయారుచేశారు. జోసఫ్ ఈ తోటకు ఒక రూపాన్ని తీసుకురావడం కోసం ఎన్నో రోజులు కష్టపడ్డాడు. ఆ ప్రయోగాల్లో భాగంగా ఆరు కోట్ల మీటర్ల పొడవైన దారాన్ని ఉపయోగించాడు. 400 విభిన్న రంగుల ఎంబ్రాయిడరీ దారాలను ఉపయోగించి, పూలను తీర్చిదిద్దాడు. ఇక్కడ పూలు, పూరేకులు, ఆకులు, కాండం, బెరడు అన్నీ దారంతో తయారుచేసినవే. కాండం, ఆకులు, పూల కోసం స్టీలు, కాపర్ వైర్లను ఉపయోగిస్తారు. ★



నేను గీసిన బొమ్మ





చెక్కా అమృత
4వ తరగతి
మౌంట్ కోర్నల్ స్కూల్
ఇంద్రపాలెం
కాకినాడ రూరల్
తూర్పుగోదావరి జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



షూటింగ్‌లో ప్రపంచ రికార్డ్

జూనియర్ ఐఎస్ఎస్ఎఫ్‌లో వాలరివాన్‌కు స్వర్ణం

సిడ్నీ : జూనియర్ ఐఎస్ఎస్ఎఫ్ 10 మీటర్ల షూటింగ్ మహిళల వ్యక్తిగత విభాగంలో భారత్‌కు చెందిన వాలరివాన్(18) స్వర్ణ పతకంతోపాటు ప్రపంచరికార్డ్ నమోదుచేసింది. ఫైనల్ పోరుకు చేరేముందు జరిగిన పోటీలో తలపడి మొత్తం 631.4 పాయింట్ల సాధించడం ద్వారా ప్రపంచ రికార్డ్ సృష్టించింది. గురువారం జరిగిన మహిళల జూనియర్ విభాగం ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన లింగ్-ఇన్-షిన్‌తో తలపడి తొలుత 9.6 పాయింట్ల అనంతరం చివరి 24వ షాట్‌లో 10.7 పాయింట్లు సాధించడం 249.8 పాయింట్లతో గెలుపొందింది. అంతేగాక భారత్‌కు చెందిన వాలరివాన్, శ్రేయా అగర్వాల్, జినా ఖిట్టాల బృందం మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది.

ఇంగ్లండ్ 58 ఆలౌట్

న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్

అక్లాండ్ : న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి డే-నైట్ టెస్ట్‌మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 58 పరుగులకే ఆలౌట్ అయ్యింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ కేవలం 27 పరుగులకే 9 వికెట్లనుకోల్పోయింది. చివరి వికెట్‌కు అండర్సన్-ఓవర్టన్‌లు 31 పరుగులు చేయడంతో టెస్టుల్లో అత్యల్ప స్కోర్ ప్రమాదంనుండి ఇంగ్లండ్ బయటపడి పరువు నిలుపుకుంది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ ఓవర్టన్ (33), స్టోన్‌మన్(11) పరుగులు చేయగా... ఐదుగురు బ్యాట్స్‌మెన్లు డకౌట్ అయ్యారు. బోల్ట్ 6, సోధీ 4 వికెట్లు పడగొట్టారు. న్యూజిలాండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమ యానికి 3 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది.

టీ20 ట్రై సిరీస్

ఆసీస్ చేతిలో ఓటమి



ముంబయి : టీ20 ట్రై సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో తలపడిన భారత మహిళాజట్టు 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళాజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. స్మృతి మంధాన67, పాటిల్ 35 పరుగులు చేశారు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ జట్టు 18.1 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. ఆ జట్టులో మూనీ 45, విల్లాని 39 పరుగులు చేశారు. భారత మహిళా బౌలర్ జులన్ గోస్వామికి 3 వికెట్లు లభించాయి.

రాష్ట్రస్థాయి జుడోలో ఏలూరుకు రెండు పతకాలు

క్రీడాకారులు రాణించడం అభినందనీయం: అజీజ్

ప్రజాశక్తి-ఏలూరు

రాష్ట్రస్థాయిలో జుడో క్రీడల్లో ఏలూరుకు చెందిన క్రీడాకారులు రెండు పతకాలు సాధించడం అభినందనీయమని పశ్చిమ గోదావరి జిల్లా క్రీడల అధికారి అజీజ్ అన్నారు. విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 66 కేజీల బరువు కేటగిరీలో ఏలూరుకు చెందిన ఎస్.చందు కాంస్య పతకాన్ని, జూనియర్స్ 73 కేజీల బరువు కేటగిరిలో సిహెచ్.సురేష్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద గురువారం నిర్వహించిన అభినందన సభలో క్రీడాకారులు చందు, సురేష్‌లకు అజీజ్ మెడల్స్ బహూకరించారు. సభలో ఆయన మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తతతో ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేస్తూ జుడో క్రీడలో రాష్ట్రస్థాయి బహుమతులు సాధించడం మన క్రీడాకారుల ప్రతిభకు నిదర్శనమని చెప్పారు. భవిష్యత్తులో ఈ క్రీడ మరింత ఆదరణ పొందేలా పటిష్టవంతమైన కోచింగ్ ఇవ్వాలని అజీజ్ కోరారు. జిల్లా జుడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.పౌలురాజ్ మాట్లాడారు.

సౌమ్యజిత్ ఘోష్‌పై కేసు నమోదు

కోల్‌కత్తా : పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ టేబుల్ టెన్నిస్ ఆటగాడు, అర్జున అవార్డు గ్రహీత సౌమ్య జిత్ ఘోష్‌పై ఎఫ్ఐఆర్ కేసు నమోదైంది. ఓ మహిళపై కొన్నేళ్ళుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడంటూ ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదులో తామిద్దరం సోషల్ మీడియా ద్వారా 2014లో కలుసుకున్నామని... తరుచుగా కోల్‌కతాలోని ఘోష్ ఫ్లాట్‌లో, సిలిగురిలోని మరో ఫ్లాట్‌లో ఉండడమేగాక... అనధికారికంగా ఓ ఆలయంలో వివాహం కూడా చేసుకున్నట్లు ఆ ఫిర్యాదులో తెలిపింది. అయితే పెళ్లిని అతని తల్లిదండ్రులు అంగీకరించడంలేదని బరాసత్ మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు కేసు పెట్టింది.

ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మూడో టెస్ట్

దక్షిణాఫ్రికా - 266/8 (87 ఓవర్లలో)
(ఎల్గర్ - 121 నాటౌట్, డివిలియర్స్ 64, కమ్మిన్స్ 4/64, హోజ్లేవుడ్ 2/37

ఐపిఎల్ ఓ మైండ్ గేమ్!

- వాణిజ్య ప్రకటనలే ముఖ్యం
- ఆటకన్నా కాసులకే ప్రాధాన్యం
- ఐసీసీ-బీసీసీఐ పక్కా వ్యూహం

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

పదేళ్లక్రితం ఎనిమిది ఫ్రాంచేజీలతో ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ ఐపిఎల్ టోర్నీ ఒక పక్కా కమర్షియల్ గేమ్ అనక తప్పదు. ఎందుకంటే ఈ క్రీడ వర్ధమాన క్రికెటర్లను వెలికితీయడానికి నిర్వహించే క్రీడ అనడం కంటే... ఫ్రాంచేజీలకు కాసులను కురిపించడానికి నిర్వహించే ఆట అనడమే సముచితం. ఐపిఎల్ టోర్నీ ప్రారంభంలో విదేశీ క్రీడాకారులు ఈ టోర్నీలో ఆడేందుకు అంతగా ఆసక్తిని ప్రదర్శించేవారు కాదు. రాను రాను బీసీసీఐకి-ఐసీసీకి మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందాల్లో భాగంగా ప్రపంచ క్రికెట్ ఆడే అన్ని దేశాల్లోని క్రీడాకారులందరూ మన ఐపిఎల్ టోర్నీలో ఆడేందుకు ఇష్టపడుతున్నారు.

క్రికెట్‌లో గెలుపు- ఓటమిలు సహజమే. కానీ ఈ గేమ్ రాను రాను తన రూపం మార్చుకొని వాణిజ్య ప్రకటనలకు, కనబడని బెట్టింగ్‌లను ప్రోత్సహించే ఒదుకు, కాసులను దండుకోవడానికే అని చెప్పక తప్పదు. గతంలో ముగిసిన ఐపిఎల్ మ్యాచ్‌లను పరిశీలిస్తే ఏ జట్టు అయినా అత్యధిక పరుగుల తేడాలో ఓటమిచెందిన సందర్భాలుగానీ, త్వరగా మ్యాచ్ ముగిసిన సందర్భాలుగానీ లేవు. ఇలా జరిగితే మ్యాచ్‌ను చూసేందుకు వచ్చే క్రీడాభిమానుల్లోనూ, వాణిజ్య ప్రకటనల్లోనూ కోత పడే అవకాశమున్నందున మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకూ పొడిగించేందుకు ఫ్రాంచేజీలు ఇష్టపడుతున్నాయి.

బౌండరీ లైన్ తగ్గింపు...

క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్ కొట్టే ఫోర్లు, సిక్సర్లకు ఉండే క్రేజ్ దృష్ట్యా బౌండరీ లైన్‌లను సైతం 75-80 మీటర్ల లోపే. బౌండరీ లైన్స్ తగ్గడంతో బ్యాట్స్‌మన్ సునాయాసంగా బాల్‌ను సిక్సర్, బౌండరీకి తరలించగలుగుతున్నాడు. ఈ ఐపిఎల్ టోర్నీలో బౌలర్ల ఆధిపత్యం కంటే బ్యాట్స్‌మెన్ హహ అనక తప్పదు. బ్యాట్స్‌మన్‌కు అనుకూలంగా, పరుగులు ధారాళంగా వచ్చే మైదానాలను తయారు చేయడానికి పిచ్ క్యూరేటర్లు ఇష్టపడుతున్నారు. అది కూడా ఫ్రాంచేజీల అంగీకారంతోనే..

ఈసారి ఐపిఎల్ ఆడేందుకు భారీగా...

ఈసారి ఐపిఎల్-11లో ఆడేందుకు ప్రపంచ క్రికెట్ ఆడే దేశాలన్నింటి తరపునుండి సుమారు 1100 మంది క్రీడాకారులు సంతకాలు చేశారు. వారిని ఫిల్టర్ చేసిన ఐపిఎల్ నిర్వాహకులు 600 లోపు ఆటగాళ్ళనే వేలంలోకి అనుమతిచ్చారు. చివరకు ఒక్కో ఫ్రాంచేజీ సుమారు 25 మందిని మాత్రమే కొనుగోలు చేసుకొని 8 ఫ్రాంచేజీలు 200 మంది క్రీడాకారులను మాత్రమే కొనుగోలు చేసుకున్నారు.



అధిక మొత్తంలో చెల్లింపులు...

మన ఐపిఎల్‌లో ఒక జట్టు తరపున ఆడే క్రీడాకారుడికి ఏడాదికి అత్యల్పంగా 20 లక్షల నుండి అత్యధికంగా 15 కోట్ల రూపాయల వరకు ముట్టజెబు తున్నారు. కాసుల మోజులో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలామంది క్రీడాకారులు ఆయా దేశాల తరపున ఆడకుండా మన ఐపిఎల్‌లో కాసుల కోసం ఆడడం మొదలుపెట్టారు. అలాగే బీసీసీఐ-ఐసీసీకి కుదిరిన అవగాహనా ఒప్పందంలో భాగంగా భారీగానే ఐసీసీకి బీసీసీఐ ముట్టజెబుతోంది.

బీసీసీఐ-ఐసీసీ పరస్పర అంగీకారం...

మన దేశ ఐపిఎల్ క్రేజ్... ఫ్రాంచేజీల పెట్టుబడులను గమనించిన ఐసీసీ ఐపిఎల్‌లో ఆడకుండా కొంతకాలం క్రీడాకారులను నియంత్రించింది. తర్వాతకాలంలో బీసీసీఐ-ఐసీసీ ఒక అవగాహనా ఒప్పందానికి వచ్చి కాసులను పంచుకోవడానికి పరస్పరం అంగీకారానికి వచ్చాయి. దీంతో ఐసీసీ సైతం ఈ టోర్నీలో ఆడేందుకు విదేశీ క్రీడాకారులకు అనుమతిని మంజూరు చేస్తూ... టోర్నీ జరిగే కాలంలో ఆయా దేశాల్లో ఐసీసీ అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగకుండా షెడ్యూల్ తయారు చేస్తోంది.

అప్పులపాలైన ఫ్రాంచేజీలు...

ఐపిఎల్‌లో పాల్గొని అప్పులపాలైన ఫ్రాంచేజీలు ఉన్నాయి. ప్రారంభ టోర్నీ విజేత డెక్కన్ ఛార్జర్స్ తర్వాత కాలంలో ఆశించినస్థాయిలో రాణించలేక అప్పులపాలై ఫ్రాంచేజీని మూసేసుకుంది. తర్వాతి తరంలో ఆడిన గుజరాత్ లయన్స్, కొచ్చి టస్కర్స్ కేరళ, పూనే వారియర్స్, రైసింగ్ పూనే సూపర్‌గైంట్స్ జట్లు తర్వాత టోర్నీల్లో ఆడేందుకు ఇష్టపడక కొన్నేళ్ళు మాత్రమే కొనసాగి టోర్నీ నుంచి విరమించుకున్నాయి.

వాణిజ్య ప్రకటనలు.. బెట్టింగ్‌లే లక్ష్యం...

ఓవర్ ఓవర్‌కు మధ్య వాణిజ్య ప్రకటనలు వస్తుంటే అధిక మొత్తంలో రాబడిని సంపాదించుకోవడమే ఆయా ఫ్రాంచేజీల లక్ష్యం. విదేశాల్లో చట్టబద్ధమైన బెట్టింగ్‌కు అవకాశముంది. మన దేశంలో బెట్టింగ్‌కు చట్టబద్ధత లేదు. దీనికారణంగా క్రికెట్ తెలియని వారు, అవగాహన ఉన్న వారు, లేని వారు ఎక్కడపడితే అక్కడ బెట్టింగ్‌లకు పాల్పడుతు న్నారు. చివరకు మధ్యతరగతి ప్రజ లు సైతం ఈ బెట్టింగ్‌ల జూదంలో సర్వం కోల్పోయి అప్పులపాలవుతున్నారు.

షమీకి ఊరట!



ముంబయి : భార్య హసీన్ జహాన్ ఆరోపణలతో గత కొన్ని రోజులుగా ఉక్కిరిబిక్కిరవుతున్న టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీకి ఊరట లభించింది. పేసర్ షమీ ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్‌లకు పాల్పడలేదని బీసీసీఐ అవినీతి నిరోధక శాఖ విభాగం చీఫ్ నీరజ్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వారం రోజుల కిందట బీసీసీఐ నేతృత్వంలోని అవినీతి నిరోధక విభాగం షమీ కేసును దర్యాప్తు చేసింది. అయితే అతడు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తమకు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని నీరజ్ కుమార్ వివరించారు. తమ నివేదికలో షమీ కి క్లీన్ చిట్ ఇవ్వడంతో అతడి క్రికెట్ కెరీర్‌కు ఎలాంటి ఢోకా లేదని తేలింది. దీంతో అతడిని వార్షిక కాంట్రాక్టులో గ్రేడ్ 'బి'లో బీసీసీఐ చేర్చింది. దీని ప్రకారం షమీ వార్షిక జీతభత్యాలురూ.3 కోట్లు అందుకోనున్నాడు.

యుఎఇ సంచలనం

హరారే : జింబాబ్వే-యుఎఇల మధ్య జరిగిన మ్యాచ్ లో యుఎఇ 3 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. యుఎఇ 47.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేయగా... తర్వాత భారీ వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. దీంతో జింబాబ్వే లక్ష్యాన్ని 40 ఓవర్లకు 229 పరుగులుగా నిర్ణయించగా... 7 వికెట్ల నష్టానికి 226 పరుగులే చేసింది. నేడు జరిగే ఐర్లాండ్-ఆఫ్ఘనిస్తాన్ మ్యాచ్ విజేత ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది.



లోగోను ప్రదర్శిస్తున్న తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

ఎపి 'మా' కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గుంటూరు జిల్లా తెనాలి పట్టణం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. 'మా' అసోసియేషన్ లోగోను రాష్ట్ర రాజధాని అమరావతిలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరించు కున్న సందర్భంలో కళాక్షేత్రం వేదికపై ఎమ్మెల్యే ఆలపాటి లోగోను ప్రదర్శించారు. అసోసియేషన్ అధ్యక్షురాలుగా నటి కవిత, ఉపాధ్యక్షులుగా బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా నరసింహరాజు, కార్యదర్శులుగా గీతాంజలి, అన్నపూర్ణ, శ్రీలక్ష్మిలు ప్రమాణ స్వీకారం చేశారు. సినీ పరిశ్రమకు సంబంధించి 24 విభాగాలకు కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలపాటి మాట్లాడుతూ హైదరాబాద్ నుండి నూతన రాజధానిలోకి 'మా' అసోసియేషన్ తొలి అడుగు పడిందన్నారు. అసోసియేషన్ ఏర్పాటుకు కృషిచేసిన అందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగాదా 1913 నుండి 2018 వరకు సినీ పరిశ్రమలోని పరిణామాల క్రమాన్ని వీడియో ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యత్వ కార్డులను మున్సిపల్ కమిషనర్ కె.శకుంతల ద్వారా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, మార్కెట్ యార్డు చైర్మన్ గడవర్తి సుబ్బయ్య, జెడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, డీఎస్పీ స్నేహిత, కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ కావేటి సామ్రాజ్యం పాల్గొన్నారు.

శనగ రైతులను ఆదుకుంటాం

మంత్రి సోమిరెడ్డి హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


శనగరైతుల సమస్యలను ముఖ్యమంత్రితో మాట్లాడి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. తక్షణమే రెండు లక్షల క్వింటాళ్ల శనగల కొనుగోలుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షులు నాగబోయిన రంగారావు, కార్యదర్శి పి. జమలయ్యలు నేతృత్వంలోని శనగరైతుల బృందం గురువారం విజయవాడలో మంత్రి ఇంటివద్ద కలిశారు. శనగలు క్వింటాలుకు జే.జే 11ను రూ,6వేలు, కాక్-2 రకం రూ.8వేలు, బొల్టులు రూ.10వేలు వంతున ధరలు నిర్ణయించి కొనుగోలు చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎటువంటి నిబంధనలను లేకుండా రైతుల పంటనంతటినీ కోల్డ్‌స్టోరేజీల వద్ద కొనుగోలు చేయాలని కోరారు. పట్టాదారు పాసు పుస్తకంతో సంబంధం లేకుండా సాగు ధృవీకరణ పత్రాలు, రుణ అర్హత కార్డుల ఆధారంగా పంటలు కొనుగోలు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.



రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షులు నాగబోయిన రంగారావు

ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో శనగ పంట ఐదు లక్షల ఎకరాల్లో పండించారని తెలిపారు,. పంటల ధరలు పడిపోవడంతో కౌలు రైతులు మంత్రిని కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుత ధరలతో పోల్చుకుంటే ఎకరానికి ప్రతి కౌలు రైతు రూ.37,900లు నష్టపోవాల్సి వస్తోందన్నారు. జొన్న క్వింటాలు రూ.2వేలు, మొక్కజొన్న కింటా రూ.1900లు, కందుల క్వింటా రూ.7వేలు, మినుములు క్వింటా రూ. 8వేలు, పసుపు , మిర్చి, జూట్ క్వింటా రూ.10వేలు చొప్పున కొనుగోలు చేయాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన బృందంలో ప్రకాశం జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.హనుమంతరావు, ఆర్.వినోద్, గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షులు టి.సురేష్, కృష్ణా జిల్లా కార్యదర్శి నిమ్మగడ్డ నరశింహ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను యంగ్ టాలెంట్స్‌తో అధిగమించాలి



సదస్సులో పాల్గొన్న రుద్రరాజు, చంద్రశేఖర్, లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

నూతన సవాళ్లను ఎదుర్కొనడానికి యంగ్ టాలెంట్స్‌ను పరిశ్రమల్లో చేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌విఎస్.రుద్రరాజు వెల్లడించారు. రాబోయే రోజుల్లో పనిలో నైపుణ్యానికే పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. గురువారం విశాఖనగరంలోని నోవాటల్ హోటల్‌లో సిఐఐ ఆధ్వర్యాన హెచ్‌ఆర్ సమ్మిట్ జరిగింది. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ.. నూతన సవాళ్లను ఎదుర్కొనడానికి యంగ్ టాలెంట్స్‌ను పరిశ్రమల్లో చేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. సిఐఐల ప్యానల్ నుంచి ప్రొఫెసర్ చంద్రశేఖర్ (ఐఐఎం డైరెక్టర్ విశాఖ) మాట్లాడుతూ.. ప్రాక్టికల్‌గా నేర్పించడం వల్లే నైపుణ్యాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. శుద్ధ ముక్కల ద్వారా, మాట్లాడటం ద్వారా నైపుణ్యాలను ఈ రోజుల్లో పెంచలేమన్నారు. సిఐఐ వైజాగ్ జోన్ ఉపాధ్యక్షులు కెవివి.రాజు మాట్లాడుతూ సరైన ప్రతిభ ద్వారా పరిశ్రమలో సుస్థిర ప్రగతి సాధ్యపడుతుందన్నారు. సిఐఐ ఎపి ఉమెన్ నెట్‌వర్క్ చైర్మన్ లక్ష్మీ ముక్కవిల్లి మాట్లాడుతూ.. పరిశ్రమ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను, ప్రతిభకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ముకుంద్ మెనన్, సూర్యప్రసాద్, షిల్పి సహాయ్ చౌదరి, ఎం.రాధాకృష్ణమూర్తి, నమిత భరద్వాజ్, అనంత్ బర్ధదికార్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అమిత్‌షా కోసమే నయీమ్ ఎన్‌కౌంటర్

- నయీమ్ డైరీని బయటపెట్టాలి
- ఆ కేసులో మొదటి నిందితుడు కేసీఆరే
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్

సోహ్రాబుద్దిన్ ఎన్‌కౌంటర్‌లో నిందితుడైన బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా సిబిఐ కేసు నుంచి బయటపడేందుకు.. కీలక సాక్షిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ నయీమ్‌ను ఎన్‌కౌంటర్ పేరుతో అంతమొందించారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆరోపించారు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గురువారం ఆయన సిపిఐ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిచందర్‌తో కలిసి మాట్లాడారు. నయీమ్ బతికి ఉంటే అమిత్‌షా సోహ్రాబుద్దిన్ కేసులో కచ్చితంగా జైలుకు వెళ్లేవాడన్నారు. రాజకీయంగా ఇబ్బంది రావచ్చుననే భయంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కనుసన్నల్లో ఉన్న నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ), ఎస్ఐబీలతో నయీమ్‌ను ఎన్‌కౌంటర్ చేయించాయే కానీ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి కాదన్నారు. ఈ కేసును విచారిస్తున్న సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి లోయ అనుమానాస్పద మృతి వెనుక కూడా అమిత్‌షా కుట్ర దాగి ఉందన్నారు. రూ.100 కోట్లు ఇస్తామని ఆశ చూపినా లొంగక పోవడంతో పథకం ప్రకారం జస్టిస్ లోయను చంపేశారని ఆరోపించారు. నయీమ్‌తో అంట కాగిన దోషులను ఎంతటివారైనా వదిలిపెట్ట బోమని ప్రగల్భాలు పలికిన సిఎం కెసిఆర్ తలమాసిన వాళ్లను తప్ప అసలు దోషులను అరెస్టు చేయలేదన్నారు. దోషులను కాపాడే ప్రయత్నం చేస్తున్న కెసిఆర్ నయీమ్ కేసులో మొదటి నిందితుడు అవుతాడన్నారు. నయీమ్ ఎన్‌కౌంటర్ జరిగి ఏడాదిన్నర కావస్తున్నా బాధితులకు న్యాయం జరగలేదన్నారు. నయీమ్ డెన్‌లో దొరికిన నగదు, బంగారం, స్థలాల డాక్యు మెంట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. నయీమ్ ఆగడాల్లో భాగస్వామ్యం ఉన్న పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఉన్న రాజకీయ నేతలు, అధికారులను దోషులుగా తేల్చాలంటే ఈ కేసును సిబిఐ అప్పగించాలని డిమాండ్ చేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68